# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - మంగళవారం 22 ఏప్రిల్ 2025 | సంపుటి: 9 | సంచిక: 115 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## విచ్చేసిన జేడీ వాన్స్ దంపతులు



2

## ముంబైలో మాయే మస్క్



సిద్ధి వినాయక ఆలయంలో పూజలు

2

# తులం బంగారం లక్ష రూపాయలు

## దానికి దగ్గరలోనే వెండి..

ముంబై, ఏప్రిల్ 21: భారత దేశంలో బంగారం ధర సరికొత్త రికార్డును సృష్టించింది. 10 గ్రాముల మేలిమి పసిడి ధర ట్యాక్సుతో కలిపి అక్షరాలా లక్ష రూపాయలకు ఎగిసింది. అమెరికా, చైనా వాణిజ్య పోరు, డాలర్ బలహీన పడడం వంటి కారణాలతో మదుపర్లు బంగారం వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో అంతర్జాతీయ ...మిగతా 2లో



# పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూత

## వాటికన్ నివాసంలో తుదిశ్వాస

- కొంతకాలంగా శ్వాసకోశ, కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న మతాధిపతి
- మరణానికి కొన్ని గంటల ముందు ఈస్టర్ సందేశం
- నైట్ క్లబ్ బౌన్సర్ నుంచి పోప్ దాకా ఎదిగిన జార్జ్ మారియో బెర్గోగ్లియో
- ప్రధాని మోడీ, సీఎం రేవంత్ సంతాపం



హైదరాబాద్, మనం ప్రతినిధిః రోమన్ క్యాథలిక్ చర్చి అధిపతి, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది గౌరవించే క్రైస్తవ మత గురువు పోప్ ఫ్రాన్సిస్ (88) కన్నుమూశారు. ఇటలీ కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 7:35 గంటలకు వాటికన్‌లోని తన నివాసమైన కాసా శాంటా మార్టాలో ఆయన తుది శ్వాస విడిచినట్లు వాటికన్ న్యూస్ తమ వెబ్‌సైట్‌లో విడుదల చేసిన ప్రకటనలో అధికారికంగా ప్రకటించింది. గత కొంతకాలంగా పోప్ ఫ్రాన్సిస్ శ్వాసకోశ సమస్యలు, డబుల్ న్యుమోనియా, కిడ్నీ సంబంధిత ...మిగతా 2లో






తెలంగాణకు రండి..

# సరికొత్త భవిష్యత్‌ను నిర్మిద్దాం

## జపాన్ పారిశ్రామికవేత్తలకు సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానం

- ఒసాకా ఎక్స్‌పోలో ప్రత్యేక ఆకర్షణగా తెలంగాణ పెవిలియన్
- వరల్డ్ ఎక్స్‌పోలో పాల్గొన్న తొలి భారతీయ రాష్ట్రంగా రికార్డు

హైదరాబాద్, మనం బ్యూరోః తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి జపాన్ వేదికగా ప్రపంచానికి చాటి చెప్పారు. ఒసాకా నగరంలో జరిగిన వరల్డ్ ఎక్స్‌పోలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం పాలుపంచుకుంది. వివిధ రంగాలకు చెందిన వ్యాపారవేత్తలు, పారిశ్రామిక వేత్తలతో విడివిడిగా సమావేశమైంది. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను వారితో చర్చించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ వరల్డ్ ఎక్స్‌పోలో దేశంలోనే మొదటి రాష్ట్రంగా తెలంగాణ పాలుపంచుకోవడం గర్వంగా ఉందని అన్నారు. తెలంగాణ-జపాన్‌ల మధ్య ఉన్న చారిత్రక స్నేహాన్ని దీర్ఘకాల భాగస్వామ్యంగా మార్చుకుందామని పిలుపునిచ్చారు. కొత్త ఆవిష్కరణలతో భవిష్యత్ ప్రణాళికల రూపకల్పనకు కలిసి పనిచేద్దామనే ఆకాంక్షను ...మిగతా 2లో

# రాబోయే అవకాశాలను అంచనా వేయాలె

వ్యవస్థలను నిర్వహించడం పాత పద్ధతి.. టెక్నాలజీతో లభించిన అవకాశాలను ప్రగతిగా మార్చాలె

పరిపాలన అంటే ప్రస్తుత అర్థమదే : ప్రధాని మోడీ

2

### లుగు ఎన్‌కౌంటర్

# మావోయిస్టు కీలక నేత ప్రయాగ్ మాంఝీతో సహా ఎనిమిది మంది మృతి

## ప్రయాగ్ అలియాస్ వివేక్ తలపై కోటి రివార్డు

## మరో ఇద్దరిపైనా చెరో రూ. 10 లక్షల రివార్డు



**రాంచీ, ఏప్రిల్ 21:** ఝార్ఖండ్ రాష్ట్రం బొకారో జిల్లాలోని లాల్పానియా ప్రాంతంలోని లుగు పర్వత ప్రాంతంలో సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కీలకనేత ప్రయాగ్ మాంఝీ మృతి చెందాడు. ఈ ఎదురు కాల్పుల్లో ప్రయాగ్‌తో పాటు ఎనిమిది మంది చనిపోయారు. ప్రయాగ్ మాంఝీ అలియాస్ వివేక్‌ను పుచన, నాగ మాంఝీ, కరన్, లెతర అనే పేర్లతో కూడా పిలుస్తారు. ఈయన తలపై రూ.కోటి రివార్డు ఉంది. చనిపోయిన ఎనిమిది మందిలో అరవింద్, రామ్ మాంఝీ అనే వారిపై కూడా రూ.10 లక్షలు చొప్పున రివార్డులు ఉన్నాయి. కేంద్ర కమిటీ సభ్యుడైన ప్రయాగ్ మాంఝీ ప్రశాంత్ హిల్స్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. ధనాబాద్ జిల్లా తుండీ ...మిగతా 2లో

# 12 గంటలకు ఇంటర్ రిజల్ట్స్

## ఇంటర్మీడియెట్ బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటు

హైదరాబాద్, మనం ప్రతినిధిః తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలను నేడు మధ్యాహ్నం 12 గంటలకు విడుదల చేయనున్నట్లు ఇంటర్ బోర్డు ప్రకటించింది. ఇంటర్ మొదటి, ...మిగతా 2లో

## డేంజర్ జోన్‌లో వ్యర్థాల తొలగింపు

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో సహాయక చర్యలు

దక్షిణ మధ్య రైల్వే సిబ్బంది సహకారంతో బోరింగ్ యంత్ర భాగాల తొలగింత

2

## ముగ్గురు న్యాయమూర్తుల బదిలీ

తెలంగాణ నుంచి జస్టిస్ సురేందర్ మద్రాస్ హైకోర్టుకు, జస్టిస్ శ్రీసుధ కర్ణాటక హైకోర్టుకు..

ఏపీ నుంచి జస్టిస్ మన్మథరావు కర్ణాటక హైకోర్టుకు ట్రాన్స్‌ఫర్

### చెల్లని ఎమ్మెల్యే చెన్నమనేని..

# ప్రభుత్వ విప్ ఆదికి 25 లక్షలిచ్చిన రమేశ్



మనం బ్యూరో, హైదరాబాద్ః ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ హైకోర్టులో రూ.25 లక్షల డీడీని అందజేశారు. చెన్నమనేని జర్మనీ పౌరసత్వం కలిగి ఉన్నారనీ గతంలో ఆది శ్రీనివాస్ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జర్మనీ పౌరసత్వం కలిగి ఉండి ఆయన తప్పుడు పత్రాలతో వేములవాడ ఎన్నికల్లో పోటీ చేశారని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ అంశంపై కోర్టులో ఆది శ్రీనివాస్ సుదీర్ఘ కాలం పోరాటం చేశారు. దీంతో హైకోర్టు చెన్నమనేనికికి జర్మనీ పౌరసత్వం ఉన్నట్లు తేల్చింది. ఈ విషయంలో హైకోర్టును సైతం తప్పుదోవ పట్టించినందుకు ఆయనకు జరిమానా విధించింది. పిటిషనర్ ...మిగతా 2లో



# మేలో ఐఎస్ఎస్‌కు శుభాంశు శుక్లా

## అంతరిక్ష ప్రయోగ కేంద్రంలో ఏడు ఎక్స్‌పెరిమెంట్లు చేయనున్న మన వ్యోమగామి

**ఢిల్లీ, ఏప్రిల్ 21:** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేపట్టబోయే యాత్ర కోసం ప్రధాన వ్యోమగామిగా ఎంపికైన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా మాగ్జిమమ్-4 మిషన్లో భాగంగా మే నెలలో ఆయన ఐఎస్ఎస్ కు వెళ్లనున్నారు. అక్కడకనీసం ఏడు ప్రయోగాల్లో పాల్గొంటారు. అంతరిక్షంలో పంట సాగు, వాటర్స్ బేర్ (నీటి ఎలుగుబంటి) గురించి అధ్యయనం చేయనున్నట్లు తెలుస్తోంది. టార్డిగ్రేడ్, సూక్ష్మ కణజాల జీవిగా పిలిచే నీటి ఎలుగుబంటి భూమండలంపై జీవించి ఉండే అత్యంత అరుదైన జీవి. 0.3 మి.మీల నుంచి 0.5 మి.మీల పొడవు ఉండి పర్యావరణంలో అత్యంత కఠినమైన పరిస్థితులను తట్టుకుని జీవించే డీఎన్‌ఏను కలిగి ఉంటుంది. ఇలాంటి అరుదైన జీవి డీఎన్‌ఏను డీకోడ్ చేసిన ఇస్రో.. సూక్ష్మ గురుత్వాకర్షణ శక్తిలో పునరుత్పత్తిని.. భూమి, అంతరిక్షంలో జన్యు మార్పిడిని అధ్యయనం చేయనుంది. అత్యంత శక్తిమంతమైన సూర్యరశ్మితో పాటు గురుత్వాకర్షణ కలిగిన వాతావరణంలో ఈ జీవి డీఎన్ఏలో కలిగే మార్పులకు అనుగుణంగా వ్యోమగాముల రక్షణ వ్యవస్థలను తయారు చేయనుంది. ఈ అధ్యయనం త్వరలో ప్రయోగించే మానవసహిత గగన్యాన్ మిషన్ కూ ఉపయోగపడనుందని ఇస్రో అంచనా వేస్తోంది. అలాగే ఈ యాత్రలో భాగంగా అంతరిక్షంలో కంప్యూటర్ స్క్రీన్లను ఉపయోగించడం వల్ల కలిగే మార్పులను అర్థంచేసుకోనున్నారు. మైక్రోగ్రావిటీలో గేజ్ ఫిక్సేషన్, వేగంగా కంటిని కదిలించడం వల్ల ఒత్తిడి స్థాయిలు ఎలా ఉంటాయో పరిశీలించనున్నారు. దీనివల్ల భవిష్యత్ అంతరిక్ష నౌకల్లో కంప్యూటర్ల ...మిగతా 2లో

# జూన్ 2 నాటికి సమస్యలన్నీ పరిష్కారం



- భూ భారతితో సాగులో ఉన్న ప్రతి రైతుకు న్యాయం
- వచ్చే నెల నుంచి గ్రామ పరిపాలనాధికారులు
- చందంపేట, ఇబ్రహీంపట్నం అవగాహన సదస్సుల్లో పాల్గొన్న మంత్రి పొంగులేటి

నల్లగొండ/రంగారెడ్డి, ఏప్రిల్ 21(మనం ప్రతినిధి): భూ భారతితో రాష్ట్రంలోని భూ సమస్యలన్నింటికీ పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ చట్టం ద్వారా సాగులో ఉన్న ప్రతి రైతుకు శాశ్వతంగా న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. భూభారతి పేదలు, బడుగు, ...మిగతా 2లో

# ఎందుకు పోటీ చేస్తలేరో చెప్పాలె

## కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు కిషన్ రెడ్డి డిమాండ్

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలపై బీజేపీ కార్పొరేటర్లకు దిశానిర్దేశం



హైదరాబాద్, మనం బ్యూరో: బీజేపీతో పోరాడేందుకు ఎంఐఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కయ్యాయని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో ఈ ...మిగతా 2లో

# అమెరికాతో డీల్ చేస్తే అంతే సంగతులు



## ప్రపంచ దేశాలకు చైనా హెచ్చరిక

**బీజింగ్, ఏప్రిల్ 21:** చైనా ప్రయోజనాలకు నష్టం కలిగించేలా ఏ దేశమైనా అమెరికాతో డీల్ కుదుర్చుకుంటే దాన్ని తాము తీవ్రంగా ఖండిస్తామని బీజింగ్ హెచ్చరించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాల నుంచి బయటపడేందుకు అనేక దేశాలు అగ్రరాజ్యంతో బిజీబిజీగా చర్చలు జరుపుతున్నాయి. అయితే, టారిఫ్ల నుంచి ఉపశమనం కావాలంటే చైనాతో ఆర్థిక బంధాన్ని తెంచుకోవాలని తన మిత్ర దేశాలకు ట్రంప్ సర్కారు షరతు పెట్టినట్లు కథనాలు వస్తున్నాయి. ఈ వార్తలపై తాజాగా బీజింగ్ ...మిగతా 2లో

### ఆ తప్పులు చేయొద్దు

## డొనాల్డ్ ట్రంప్ సీరియస్ వార్నింగ్

**వాషింగ్టన్, ఏప్రిల్ 21:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వాణిజ్య పరంగా ఎనిమిది రకాల తప్పులు చేసే దేశాలను వదలిపెట్టనని హెచ్చరికలు జారీ చేశారు. అమెరికా వాణిజ్యం విషయంలో అత్యంత కఠిన వైఖరిని అవలంభిస్తున్న అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ప్రపంచ దేశాలకు మరో అల్టిమేటం జారీ చేశారు. అంతర్జాతీయ వాణిజ్యంలో సుంకాలు కాకుండా ఇతర రూపంలో అమెరికాను ...మిగతా 2లో

# విచ్చేసిన జేడీ వాన్స్, ఉషా వాన్స్

**ఢిల్లీ, ఏప్రిల్ 21:** అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కుటుంబం భారత పర్యటనకు విచ్చేసింది. సోమవారం ఢిల్లీ విమానాశ్రయంలో వాన్స్ దంపతులను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్, ఇతర అధికారులు సాదరంగా ఆహ్వానించారు. తన నాలుగు రోజుల పర్యటనలో భాగంగా జేడీ వాన్స్ ప్రధాని మోడీతో భేటీ అవుతారు. పర్యటనలో భాగంగా తన భార్యాపిల్లలతో కలిసి రాజస్థాన్, ఆగ్రాలోని ప్రముఖ ప్రాంతాలను సందర్శిస్తారు. వాన్స్ సతీమణి ఉష చిలుకూరి తెలుగమ్మాయి అన్న సంగతి తెలిసిందే. ఆమె పూర్వీకులు కృష్ణా జిల్లాకు చెందిన వారు. భారత సంస్కృతి, సంప్రదాయాలకు విలువనిచ్చే ఉషా.. జేడీ వాన్స్ హిందూ సంప్రదాయంలో వివాహం చేసుకున్నారు. పిల్లల పేర్లను కూడా అలాగే పెట్టారు. ఇప్పుడు కూడా ఆ కుటుంబం సంప్రదాయబద్ధంగానే కనిపించారు. వాన్స్ కుమారులు ఇవాన్, వివేక్ కుర్తా-పైజామా ధరించగా, కుమార్తె మీరాబెల్ అనార్కలీ డ్రెస్ వేసుకున్నారు.

# ముంబైలో మాయే మస్క్

**ముంబై, ఏప్రిల్ 21:** ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ తల్లి మాయే మస్క్ భారత్ లో పర్యటిస్తున్నారు. బాలీవుడ్ నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్ తో కలిసి నేడు ఆమె ముంబయిలోని సిద్ధి వినాయక ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. ఆమెతో కలిసి దేవున్ని దర్శించుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. తాను రాసిన పుస్తకం 'ఉమెన్ మేక్స్ ఎ ప్లాన్' హిందీ ఎడిషన్ ను ఆవిష్కరించడానికి మాయే ముంబయి వచ్చినట్లు సమాచారం. ఇటీవల ఆమె తన 77వ పుట్టిన రోజు వేడుకలను ఇక్కడే జరుపుకున్నట్లు సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. ''ఎ ఉమెన్ మేక్స్ ఎ ప్లాన్'' అనే పుస్తకంలో మాయే తన కుటుంబం ఎదుర్కొన్న ఇబ్బందుల గురించి ప్రస్తావించారు.

# రాబోయే అవకాశాలను అంచనా వేయాలె

**ఢిల్లీ, ఏప్రిల్ 21:** తమ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు దేశ ప్రజల వెయ్యేండ్ల భవిష్యత్తును ప్రభావితం చేస్తాయని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. టెక్నాలజీ పరుగులు తీస్తున్న ఈ కాలంలో పరిపాలన అంటే వ్యవస్థలను నిర్వహించడం కాదని, రాబోయే అవకాశాలను కూడా అంచనా వేయగలగాలని పేర్కొన్నారు. 'సివిల్ సర్వీసెస్ డే' సందర్భంగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న మోడీ ఈ వ్యాఖ్యలు చేశారు. 'సమగ్రాభివృద్ధి అంటే దేశంలోని ఏ గ్రామం, కుటుంబం, ఒక్క పౌరుడు కూడా వెనకబడి ఉండకూడదని అర్థం. ఎన్డీయే ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల వెయ్యేండ్ల భవిష్యత్తుపై సానుకూల ప్రభావం చూపుతాయనడంలో సందేహం లేదు. దేశ యువత, రైతులు, మహిళల ఆకాంక్షలు నెరవేరుస్తూ ఉన్నతస్థాయికి ఎదిగేందుకు ఉపయోగపడతాయి. వారి అసాధారణ ఆకాంక్షలు నెరవేర్చడానికి సాధారణంగా కృషి చేస్తే సరిపోదు. అంతే వేగంతో ప్రభుత్వం పని చేయాల్సి ఉంటుంది' అని ప్రధాని అన్నారు.

'టెక్నాలజీ పరుగులు తీస్తున్న ఈ కాలంలో పరిపాలన అంటే వ్యవస్థలను నిర్వహించడం కాదు. కొత్త అవకాశాలు సృష్టించడం. పథకాలు ప్రజలపై ఎంత ప్రభావం చూపుతాయనేది కీలకం. దాని ఆధారంగా నాణ్యమైన పాలన కొనసాగించడం సాధ్యమవుతుంది. ఈ పదేండ్లలో దేశంలో ఎన్నో మార్పులు జరిగాయి. పాలన పారదర్శకత, ఆవిష్కరణ ఇలా ఎన్నో రంగాల్లో కొత్త మార్పులను నెలకొల్పుతోంది' అన్నారు.

'2023లో జీ20 భారత్ అతిథ్యమిచ్చిన సంగతి తెలిసిందే. నాడు 'జనభాగిదారి' విధానం ఈ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చింది. యావత్ ప్రపంచ దృష్టి మన దేశంపై పడింది. కార్యక్రమాల్లో పాల్గొనడం మాత్రమే కాదు.. పలు కార్యక్రమాలను నడిపించే స్థాయికి మన దేశం చేరింది. అగ్రగామిగా నిలుస్తోంది. ఈ సందర్భంగా సివిల్ సర్వెంట్లకు ఓ విజ్ఞప్తి చేయాలనుకుంటున్నా. పేదల సమస్యలను ఓపికగా వినండి. వారితో సున్నితంగా వ్యవహరించండి. వారిని గౌరవించండి. పేదల సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వండి' అని ఈ సందర్భంగా వారికి సూచించారు.

# మావోయిస్టు కీలక నేత ప్రయాగ్ మాంఝీతో సహా ఎనిమిది మంది మృతి

(మొదటి పేజీ తరువాయి)

పరిధిలోని దల్బుద అతడి స్వగ్రామం. ఝార్ఖండ్, బిహార్, ఛత్తీస్ గఢ్, ఒడిశాలో జరిగిన దాదాపు 100 దాడుల్లో మాంఝీ హస్తం ఉన్నట్లు పోలీసులు ప్రకటించారు. ఒక్క గిరిధి జిల్లాలోనే ఇతడిపై 50 కేసులతో పాటు రూ.కోటి రివార్డ్ ఉంది. ఝార్ఖండ్‌లో అత్యధిక రివార్డ్ ఉన్న రెండో మావోయిస్టు మాంఝీ.

సోమవారం తెల్లవారుజామున సీఆర్పీఎఫ్, రాష్ట్ర పోలీసులు కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు. వీరికి లుగు హిల్స్ వద్ద మావోయిస్టులు ఎదురుపడటంతో ఎదురు కాల్పులు మొదలైనాయి. ఆ తర్వాత కొద్దిసేపటికి మావోయిస్టులు అడవుల్లోకి పారిపోయారు. మొత్తం 8 మృతదేహాలను స్వాధీనం చేసుకొన్నారు. వీరిలో ప్రయాగ్ ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా పోలీసులు ఎస్ఎల్ఆర్, ఇన్సాస్ వంటి భారీ ఆయుధాలను స్వాధీనం చేసుకొన్నారు. 209 కోబ్రా బెటాలియన్, ఝార్ఖండ్ పోలీసులు దీనిలో పాల్గొన్నారు. ప్రయాగ్ మాంఝీ భార్య జయాను గతేడాది పోలీసులు అరెస్టు చేశారు. ఆమె క్యాన్సర్‌కు చికిత్స తీసుకోవడానికి వచ్చిన సమయంలో ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది.

# మేలో ఐఎస్ఎస్‌కు శుభాంశు శుక్లా

(మొదటి పేజీ తరువాయి)

రూపకల్పనకు ఉపయోపడనుంది. ఇలా మొత్తం ఏడు పరిశోధనలు చేయనున్నారు. భారత్ ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన తొలి మానవసహిత అంతరిక్షయాత్ర 'గగన్ యాన్' కోసం ఇస్రో తీవ్ర కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. దీనికి ముందే అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి మన వ్యోమగామి పంపించనున్నారు. భారత్-అమెరికా సంయుక్తంగా చేపడుతోన్న ఈ మిషన్లో గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా ను ఇస్రో ఇదివరకే ఎంపిక చేసింది. గగన్ యాన్ కు ఎంపికైన నలుగురు వ్యోమగాముల్లో ఈయనే అతిపిన్న వయస్కుడు.

# పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

అనారోగ్యాలతో బాధపడుతున్నారు. ఈ కారణంగా ఫిబ్రవరిలో ఆసుపత్రిలో చేరి 38 రోజుల పాటు చికిత్స పొంది, గత నెలలోనే డిశ్చార్జ్ అయ్యారు. అర్జెంటీనాలో జన్మించిన ఆయన, దక్షిణ అమెరికా నుంచి పోప్ పదవిని చేపట్టిన తొలి వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. ప్రజల పోప్ గా పేరుగాంచిన ఆయన, సామాజిక అంశాలపై తన గళం వినిపించేవారు. ఆశ్చర్యకరంగా, మరణించడానికి కొన్ని గంటల ముందు ఈస్టర్ పర్వదినాన సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో వేలాది మంది భక్తులకు ఆయన సందేశం ఇచ్చారు. అనారోగ్యం తర్వాత అంతమంది ప్రజల మధ్యకు రావడం అదే తొలిసారి. ఆయన మృతితో ప్రపంచవ్యాప్తంగా కేథలిక్ సమాజం విషాదంలో మునిగిపోయింది. కార్డినల్ ఫారెల్ ఆయన మృతిని ప్రకటిస్తూ, పోప్ ఫ్రాన్సిస్ జీవితం ప్రభువుకు, చర్చికి సేవ చేయడానికే అంకితమైందని పేర్కొన్నారు.

**కామన్ మ్యాన్ నుంచి క్యాథలిక్ చర్చి అధిపతి దాకా..**

పోప్ ఫ్రాన్సిస్ అసలు పేరు జార్జ్ మారియో బెర్గోగ్లియో. ఆయన డిసెంబర్ 1936 17న అర్జెంటీనాలోని బ్యూనస్ ఎయిర్స్‌లో జన్మించారు. ఇటలీ నుంచి వలస వచ్చిన మారియో జోస్ బెర్గోగ్లియో, రెజీనా మరియా సివోరి దంపతుల ఐదుగురు సంతానంలో ఆయనే పెద్దవారు. తండ్రి అకౌంటెంట్ కాగా, తల్లి ఇటాలియన్ వలసదారుల కుమార్తె.




క్రైస్తవ మతగురువుగా మారడానికి ముందు, జార్జ్ మారియో బెర్గోగ్లియో పలు సాధారణ ఉద్యోగాలు చేశారు. నైట్‌క్లబ్‌లో బౌన్సర్‌గా, స్కూల్లో స్వీపర్‌గా, రసాయన ప్రయోగశాలలో టెక్నీషియన్‌గా పనిచేసినట్లు నివేదికలు చెబుతున్నాయి. 2013లో రోమ్‌లోని ఒక చర్చిలో మాట్లాడుతూ, తాను నేలలు తుడవడం, కెమికల్ ల్యాబ్లో పనిచేయడం, హైస్కూల్లో బోధించడం, చివరికి క్లబ్బులలో గొడవ చేసేవారిని నియంత్రించడానికి బౌన్సర్గా కూడా పనిచేశానని ఆయన గుర్తుచేసుకున్నారు. అయితే, బౌన్సర్‌గా తన అనుభవాల గురించి లేదా అవి తన నాయకత్వాన్ని ఎలా ప్రభావితం చేశాయనే దానిపై ఆయన వివరాలు పంచుకోలేదు. బదులుగా, సాహిత్యం, మనస్తత్వశాస్త్రాన్ని బోధించడం ద్వారా ప్రజలను తిరిగి చర్చి వైపు ఎలా తీసుకురావాలో నేర్చుకున్నానని ఆయన చెప్పినట్లు వాటికన్ పత్రిక 'ఎల్'ఒస్ఆర్‌వటోర్ రొమానో' పేర్కొంది. ఆధ్యాత్మిక మార్గం వైపు మళ్లడానికి ముందు, బెర్గోగ్లియో కెమిస్ట్రీ అభ్యసించి, టెక్నికల్ డిప్లొమా కూడా పొందారు. అయితే, తనకు ఎంతమాత్రం పరిచయం లేని, గతంలో ఎన్నడూ కలవని ఒక మతగురువుతో జరిగిన 'ఒప్పుకోలు' తన జీవితాన్ని శాశ్వతంగా మార్చివేసిందని, మతగురువు కావాలనే తన లోపలి పిలుపును అప్పుడే కనుగొన్నానని ఆయన ఒక సందర్భంలో పంచుకున్నారు. 1969 డిసెంబర్ 13న ఆయన జెస్యూట్ ఆర్డర్‌లో మతగురువుగా దీక్ష పొందారు. 1970లలో అర్జెంటీనాలో కఠినమైన నియంతృత్వ పాలన సమయంలో ఆయన ఆ దేశంలో జెస్యూట్ ఆర్డర్కు ప్రొవిన్షియల్ సుపీరియర్‌గా నాయకత్వం వహించారు.

**చరిత్ర సృష్టించిన 'తొలి' పోప్..**

పోప్ ఫ్రాన్సిస్ అనేక 'తొలి' ఘనతలకు ప్రతీక. అమెరికా ఖండాల నుంచి ఎన్నికైన తొలి పోప్ ఆయనే. జెస్యూట్ ఆర్డర్ నుంచి పోప్ పదవిని చేపట్టిన తొలి వ్యక్తి కూడా ఆయనే. పేదలు, అణగారిన వర్గాల పట్ల అపారమైన సేవాభావం కలిగిన సెయింట్ ఫ్రాన్సిస్ ఆఫ్ అస్సిసి స్ఫూర్తితో 'ఫ్రాన్సిస్' అనే పేరును స్వీకరించిన తొలి పోప్ కూడా ఆయనే. 2013లో చారిత్రాత్మకంగా పోప్‌గా ఎన్నిక కావడానికి ముందు, ఆయన కార్డినల్ జార్జ్ మారియో బెర్గోగ్లియోగా బ్యూనస్ ఎయిర్స్ ఆర్చ్ బిషప్‌గా సేవలందించారు. 'ఫ్రాన్సిస్' అనే పేరును ఎంచుకోవడం వినయం, కరుణ, సేవ పట్ల ఆయన నిబద్ధతకు నిదర్శనంగా నిలిచింది. శతాబ్దాల తర్వాత ఐరోపాయేతర ప్రాంతం నుంచి ఎన్నికైన తొలి పోప్ కూడా ఫ్రాన్సిస్ కావడం విశేషం. క్రీ.శ. 731 నుంచి 741 వరకు చర్చిని నడిపిన సిరియాకు చెందిన గ్రెగొరీ-ఐఐఐ తర్వాత ఈ ఘనత సాధించిన వారు ఆయనే. గొప్ప మానవతావాదిగా పేరొందిన ఆయన మరణం ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్యాథలిక్ సమాజానికి తీరని లోటు అనడంలో సందేహం లేదు.

# తులం బంగారం లక్ష రూపాయలు

(మొదటి పేజీ తరువాయి)

విపణిలో ఔన్సు పసిడి సోమవారం 3,405 డాలర్లకు చేరింది. దీన్ని అనుసరించి దేశీయంగా లక్ష రూపాయల మార్కును అందుకుంది. సాయంత్రం 5.30 గంటల సమయానికి 24 క్యారెట్ల పసిడి రూ.1,00,016కు చేరింది. మరో పక్క వెండి ధర సైతం కిలో లక్షకు చేరువవుతోంది. రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు కలిగిన అమెరికా- చైనాల మధ్య వాణిజ్యం విషయంలో సయోధ్య కుదిరేంతవరకు ఇదే పరిస్థితి కొనసాగొచ్చని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# ప్రభుత్వ విప్ ఆదికి 25 లక్షలిచ్చిన రమేశ్

(మొదటి పేజీ తరువాయి)

ఆది శ్రీనివాస్‌కు రూ.25 లక్షలు, న్యాయసేవాధికార సంస్థకు రూ.5 లక్షలు ఇవ్వాలని ఆదేశించింది. హైకోర్టు తీర్పు మేరకు చెన్నమనేని సోమవారం ఆ డబ్బును డీడీల రూపంలో ఆది శ్రీనివాస్‌కు అందజేశారు.

**చెన్నమనేని క్షమాపణ చెప్పాలె : ఆది**

వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ భారత పౌరుడు కాదని తాను ముందు నుంచీ చెబుతూనే ఉన్నాననీ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించారు. చెన్నమనేని తప్పుడు పత్రాలు సృష్టించి ఎన్నికల్లో పోటీ చేయకుంటే తాను పదేళ్ల క్రితమే ఎమ్మెల్యే అయ్యేవాడినని తెలిపారు. ఈ తీర్పుతో కోర్టులపై ప్రజలకు విశ్వాసం పెరిగిందని చెప్పారు. వేములవాడ నియోజకవర్గ ప్రజలను మోసం చేసిన చెన్నమనేని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

# తెలంగాణకు రండి.. సరికొత్త భవిష్యత్‌ను నిర్మిద్దాం

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న స్థిరమైన విధానాలు, సులభతర పారిశ్రామిక విధానం, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు తెలంగాణలో ఉన్నాయని తెలిపారు. హైదరాబాద్‌కు రండి...మీ ఉత్పత్తులు తయారు చేయండి భారత మార్కెట్‌తో పాటు ప్రపంచంలోని వివిధ దేశాలకు ఎగుమతి చేసేందుకు తెలంగాణను గమ్యస్థానంగా ఎంచుకోండి అని జపాన్ కంపెనీలను సీఎం తెలంగాణకు ఆహ్వానించారు. తెలంగాణ-జపాన్‌కు మధ్య చక్కటి సంబధాలు ఉన్నాయనీ, ఒసాకా బేలో సూర్యోదయం వంటి కొత్త అధ్యాయం తెలంగాణలో ప్రారంభమవుతోందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. తెలంగాణతో పాటు ఒసాకా, ప్రపంచంతో కలసికట్టుగా అద్భుతమైన భవిష్యత్తును నిర్మిద్దామని పిలుపునిచ్చారు. ఐటీ, బయో టెక్నాలజీ రంగాల్లో తెలంగాణ ప్రత్యేకమైన గుర్తింపు సాధించిందని ఐటీ, పరిశ్రమల



శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. వీటితో పాటు ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్ రంగాల పరిశ్రమలకు ఉన్న అనుకూలతనలను వివరించారు. హైదరాబాద్‌లో 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామనీ, ఎకో, ఎనర్జీ, స్మార్ట్ మొబిలిటీ, సర్క్యులర్ ఎకానమీపై ఈ సిటీ ఆధారపడుతుందని చెప్పారు. జపాన్‌కు చెందిన మారుబెని కార్పొరేషన్‌తో ఫ్యూచర్ సిటీలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ చుట్టూ 370 కి.మీ.ల రీజనల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లతో పాటు ఔటర్ రింగ్ రోడ్డు మధ్యలో ఉన్న జోన్ లో ఎలక్ట్రిక్ వాహనాలు, ఎనర్జీ స్టోరేజ్, ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్స్, ఏరోస్పేస్ పరిశ్రమలకు అనువైన వాతావరణం ఉందన్నారు. ఎగుమతులకు వీలుగా సమీప ఓడరేవుతో అనుసంధానించే డ్రై పోర్టును తెలంగాణలో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. మూసీ పునరుజ్జీవంలో భాగంగా నది పొడవునా 55 కి.మీ.ల అర్బన్ గ్రీన్‌వే అభివృద్ధి చేసేందుకు టోక్యో, ఒసాకా నగరాలను చూసి నేర్చుకోవాల్సి ఉందన్నారు. నైపుణ్యాల శిక్షణతో పాటు నాణ్యత, క్రమశిక్షణకు అద్దం పట్టేలా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. ఈ యూనివర్సిటీ రాష్ట్రంలో ఉపాధి, వ్యాపార అవకాశాలను రెట్టింపు చేస్తుందన్నారు.

# అమెరికాతో డీల్ చేస్తే అంతే సంగతులు

(మొదటి పేజీ తరువాయి)

తీవ్రంగా స్పందించింది. తమ దేశ ప్రయోజనాలకు నష్టం కలిగించేలా నిర్ణయాలు తీసుకుంటే ప్రతీకార చర్యలు తప్పవని హెచ్చరించింది. ఈ మేరకు చైనా వాణిజ్య మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

''చైనా ప్రజల ప్రయోజనాలకు నష్టం కలిగించేలా ఏ దేశమైనా అమెరికాతో ఒప్పందం కుదుర్చుకుంటే దాన్ని మేం తీవ్రంగా వ్యతిరేకిస్తాం. ఒకవేళ అలాంటి పరిస్థితి ఎదురైతే దాన్ని ఎన్నటికీ అంగీకరించబోం. మా నుంచి ప్రతిస్పందన కూడా అదే స్థాయిలో ఉంటుంది. ఇతరుల ప్రయోజాలను పణంగా పెట్టి తాత్కాలికంగా, స్వార్థపూరితంగా లాభం పొందాలనుకోవడం.. పులి చర్మం కోసం దాంతోనే డీల్ చేసుకోవడం లాంటిది. దీని వల్ల ఎవరికీ ఎలాంటి ప్రయోజనం చేకూరదు. స్వల్పకాలిక లాభాల కోసం వెళితే.. అది ఎప్పటికైనా మనకే హాని చేస్తుందన్న విషయాన్ని దేశాలు గుర్తుంచుకోవాలి. బుజ్జగింపులతో శాంతి స్థాపన జరగదు. రాజీ పడితే గౌరవం లభించదు'' అని చైనా తమ ప్రకటనలో హెచ్చరించింది.

ఏప్రిల్ 2న ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలపై భారీ టారిఫ్లు విధించిన ట్రంప్.. వాణిజ్య చర్చల కోసం వాటిని 90 రోజుల పాటు నిలిపివేసిన సంగతి తెలిసిందే. అయితే, చైనాకు మాత్రం ఎలాంటి మినహాయింపు లేదని ప్రకటించారు. ఇదే సమయంలో ఆయా దేశాలతో ట్రేడ్ డీల్ కోసం చర్చలు జరుపుతున్న అమెరికా.. వాటిని చైనాపై ఆయుధంగా మార్చుకోవాలని భావిస్తోంది. బీజింగ్‌తో సంబంధాలను తగ్గించుకునేలా ఒప్పందాలు చేసుకునేందుకు సిద్ధమైంది. ఇతర దేశాలు చైనా నుంచి దిగుమతులు చేసుకోవద్దని, ఆయా దేశాల్లో బీజింగ్ కంపెనీల ఏర్పాటును కూడా తిరస్కరించాలని షరతు పెట్టనున్నట్లు తెలుస్తోంది.

# జూన్ 2 నాటికి సమస్యలన్నీ పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

బలహీన వర్గాలు, రైతులకు, భూములున్న ఆసాముల కోసం తీసుకొచ్చిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన తెలంగాణ భూ భారతి- 2025 చట్టంపై నిర్వహిస్తున్న అవగాహన సదస్సులలో భాగంగా సోమవారం నల్గొండ జిల్లా చందంపేట రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికై రాష్ట్రంలోని 4 మండలాలను పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకోవడం జరిగిందని, ఈ నెలాఖరునాటికి ఈ పైలెట్ ప్రాజెక్టు పూర్తవుతుందని, జూన్ 2 నుండి ఈ పైలెట్ మండలాలలో వ్యవసాయ భూముల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించనున్నామని తెలిపారు. మే 1 నుండి అన్ని జిల్లాలలో ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకోనున్నామని, అత్యంత వెనుకబడిన చందంపేట మండలాన్ని కూడా పైలెట్ మండలంగా తీసుకునే విషయమై ఆలోచిస్తామని తెలిపారు. జూన్ 2 నుండి ప్రతి గ్రామానికి తహసిల్దార్ స్థాయి అధికారులు గ్రామానికి వచ్చి భూ సమస్యల పై దరఖాస్తులు తీసుకుంటారని, రైతులు ఒక రూపాయి కూడా చెల్లించకుండా రెవెన్యూ సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. రైతుల భూముల సర్వే కోసం 6000 మంది లైసెన్స్డ్ సర్వేయర్లను నియమించనున్నామని, ప్రతి గ్రామానికి ఒక గ్రామ పరిపాలన అధికారి చొప్పున 10695 మందిని వచ్చే నెల మొదటివారం నుండి పంపించనున్నామని ఆయన వెల్లడించారు.

# మట్టిలో మాణిక్యం చందుల్ల ఎల్లమ్మ

- ఎమ్మెల్సీ ప్రొ.కోదండరామ్

**హైదరాబాద్, మనం బ్యూరో:** మట్టిలో మాణిక్యమైన కథలను నేటి సమకాలీన చర్చల్లోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాం అన్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో చందుల్ల ఎల్లమ్మ పుస్కకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోదండరాం మాట్లాడుతూ ఇలాంటి పుస్తకాలు నేటి తరం చదవాలని సూచించారు. తెలంగాణ జానపద సంప్రదాయాల కుల చరిత్రలు, కుటుంబ అనుబంధాల శక్తిమంతమైన ప్రతిబింబాలుగా ఈ పుస్తకం నిలుస్తుందన్నారు. రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ మాట్లాడుతూ ఈ పుస్తకంలోని మూల రచనతో పాటు అనువాదాన్ని అభినందించారు. మహిళా వర్సిటీ వీసీ ప్రొ.సూర్య ధనంజయ మాట్లాడుతూ మాతృ రచనను కూతురు అనువదించడం తరతరాల మేధస్సుల మధ్య ఏర్పడే మానసిక వారసత్వానికి అపూర్వ నివాళి అన్నారు. చందుల్ల ఎల్లమ్మ పుస్తకాన్ని డా.ముత్యం రచించగా ఆయన కుమార్తె ప్రత్యూష యామిని ఆంగ్లంలోకి అనువదించారు. ఓయు ఆర్ట్స్ కాలేజీ మాజీ అధిపతి తుల రాజేందర్, ఓయు విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి, కాకతీయ వర్సిటీ మాజీ వీసీ ప్రొ.సయ్యన్న పలువురు సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

# డొనాల్డ్ ట్రంప్ సీరియస్ వార్నింగ్

(మొదటి పేజీ తరువాయి)

దెబ్బతీసే ఎనిమిది పాయింట్లను వెల్లడించి.. ఏదైనా దేశం వాటిని అనుసరిస్తున్నట్లు బయటపడితే తమ దేశంతో సంబంధాలు దెబ్బతింటాయన్నారు. ఈమేరకు ఆయన ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. కరెన్సీ మేనిప్యులేషన్: చాలా దేశాలు తమ వస్తువులను అంతర్జాతీయ మార్కెట్లో చౌకగా విక్రయించేందుకు కరెన్సీ విలువలను ఉద్దేశపూర్వకంగా తగ్గిస్తాయి. గతంలో అమెరికా ఇలాంటి దేశాల జాబితాలను కూడా తయారుచేసింది. వాల్యూయాడెడ్ ట్యాక్స్ (వ్యాట్): కొన్ని దేశాల ఉత్పత్తులపై వ్యాట్ విధిస్తాయి. కానీ, దిగుమతులపై వాటిని కొనసాగించినా.. ఎగుమతులపై ఆ సొమ్మును రీఫండ్ చేస్తుంటాయి. అలాంటి చర్యలు సహించమన్నారు. తక్కువ రేటుకు డంపింగ్ చేయడాన్ని కూడా ట్రంప్ తీవ్రంగా పరిగణించారు. చైనా వంటి భారీ ఉత్పాదక దేశాలు.. కారు చౌకగా వస్తువులు తయారుచేసి ఇతర దేశాల్లో డంపింగ్ చేస్తాయి. దీంతో ఆయా దేశాల్లో స్థానిక పరిశ్రమలు మూతపడతాయి. ఎగుమతులపై ప్రభుత్వాలు రాయితీలు ఇవ్వడాన్ని కూడా ట్రంప్ తప్పుపట్టారు. వ్యవసాయరంగంలో దేశీయ రైతుల కోసం రక్షణాత్మక రాయితీలు కూడా ఇవ్వకూడదని పేర్కొన్నారు. ఇవికాకుండా నకిలీల తయారీ, మేధో హక్కుల అపహరణ, అమెరికా టారిఫ్లను తప్పించుకోవడానికి మరో దేశం నుంచి ఎగుమతి చేయడం వంటివి కూడా ఉపేక్షించమన్నారు.

ఇక ప్రత్యేకంగా జపాన్ నిర్వహించే ఓ పరీక్షను కూడా ట్రంప్ తప్పుట్టారు. దేశీయ సంస్థలను కాపాడేందుకు రక్షణాత్మక సాంకేతిక ప్రమాణాలను ఏర్పాటు చేయకూడదన్నారు. దీనికిగాను జపాన్ నిర్వహించే బౌలింగ్ బాల్ టెస్ట్‌ను ఉదహరించారు. ఈ పరీక్షను జపాన్ 2018లో ప్రవేశపెట్టింది. విదేశీ కార్లు.. తమ దేశంలో విక్రయించకుండా చూసేందుకు దీనిని మొదలుపెట్టినట్లు ఆరోపణలున్నాయి. ఈ పరీక్షలు దాదాపు 20 అడుగుల ఎత్తు నుంచి బౌలింగ్ బాల్‌ను కారు హుక్‌పై వదులతారు. అప్పుడు దానికి సొట్ట (డెంట్) పడకపోతే అది పరీక్షలో విజయం సాధించినట్లు భావిస్తారు. ఇదో భయంకరమైన పరీక్షగా ట్రంప్ అభివర్ణించారు.

# డేంజర్ జోన్‌లో వ్యర్థాల తొలగింపు

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** ఎస్ఎల్‌బీసీ సొరంగం డేంజర్ జోన్‌కు అతి సమీపంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ సొరంగంలో రెండు నెలలకు పైగా సహాయక చర్యలు కొనసాగుతుండగా, ఈ డేంజర్ జోన్‌లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై అధికారులు, సహాయక సిబ్బంది నిరంతరం చర్చిస్తున్నారు.

సొరంగం మార్గంలో 281 మీటర్ల మేర పేరుకుపోయిన మట్టి, రాళ్లతో పాటు ప్రమాద సమయంలో ధ్వంసమైన టన్నెల్ బోరింగ్ యంత్ర భాగాలను ఇదివరకే వెలికి తీశారు. అక్కడి నుంచి మరో 43 మీటర్లను డేంజర్ జోన్‌గా గుర్తించారు. ఈ డేంజర్ జోన్‌లోని వ్యర్థాలను తొలగించేందుకు అనుసరించాల్సిన మార్గాలను అన్వేషిస్తున్నారు. డేంజర్ జోన్ సమీపంలో భారీగా నీరు వస్తోందని, దీనిని మోటార్లతో బయటకు తోడేస్తున్నామని సహాయక బృందం ప్రత్యేక అధికారి శివశంకర్ తెలిపారు. సొరంగం కూలిన ప్రదేశంలో అక్కడక్కడా మిగిలిపోయిన టన్నెల్ బోరింగ్ యంత్ర భాగాలను దక్షిణ మధ్య రైల్వే సిబ్బంది సహకారంతో తొలగించే ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# ముగ్గురు న్యాయమూర్తుల బదిలీ

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** తెలంగాణ, ఏపీ రాష్ట్రాల హైకోర్టులలో పనిచేస్తున్న ముగ్గురు న్యాయమూర్తుల బదిలీ జరిగింది. సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సుల ఆధారంగా ఈ బదిలీలను ఖరారు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల ప్రకారం, తెలంగాణ నుంచి ఇద్దరు, ఏపీ నుంచి ఒక న్యాయమూర్తి ఇతర రాష్ట్రాల హైకోర్టులకు బదిలీ అయ్యారు. తెలంగాణ హైకోర్టులో సేవలందిస్తున్న న్యాయమూర్తులలో జస్టిస్ కె. సురేందర్‌ను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేశారు. మరో న్యాయమూర్తి జస్టిస్ పి. శ్రీసుధను కర్ణాటక హైకోర్టుకు బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అదేవిధంగా, ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ కె. మన్మథరావును కూడా కర్ణాటక హైకోర్టుకు బదిలీ చేశారు.

# ఎందుకు పోటీ చేస్తలేరో చెప్పాలె

(మొదటి పేజీ తరువాయి)

రెండు పార్టీలు ఎందుకు పోటీ చేయడం లేదో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ కార్పొరేటర్లతో కిషన్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ మజ్లిస్ పార్టీకి మద్దతిచ్చి ఆ పార్టీని గెలిపించడం కోసం హైదరాబాద్ ప్రజలు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయలేదన్నారు. ఓల్డ్ సిటీలో మజ్లిస్ పార్టీ వరుసగా గెలుస్తున్న శాసనసభ నియోజకవర్గాల్లో మజ్లిస్ వ్యతిరేక ఓట్లను విభజించేందుకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయకుండా దూరంగా ఉన్న బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఎలా సెక్యులర్ అవుతాయని ప్రశ్నించారు.

# 12 గంటలకు ఇంటర్ రిజల్ట్స్

(మొదటి పేజీ తరువాయి)

రెండవ సంవత్సరాల పరీక్ష ఫలితాల కోసం లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య వివరాలను వెల్లడించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరై ఫలితాలను విడుదల చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా హాజరవుతారని పేర్కొన్నారు. ఫలితాల విడుదలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తైనట్లు తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 5వ తేదీ నుంచి మార్చి 25వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ పరీక్షలకు సుమారు 9.5 లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఫలితాలు విడుదలైన తర్వాత విద్యార్థులు తమ హాల్టికెట్ నంబర్‌ను ఉపయోగించి అధికారిక వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని అధికారులు సూచించారు.

# అట్టహాసంగా ప్రారంభమైన రైతు మహోత్సవం





**ప్రారంభోత్సవం చేసిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు • పాల్గొన్న మంత్రులు ఉత్తమ్ కుమార్, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, పోచారం • భాగస్వాములైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు • ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన స్టాళ్లు • ఐదు జిల్లాల నుండి హాజరైన రైతులు**

**నిజామాబాద్, ఏప్రిల్ 21 (మనం ప్రతినిధి):** రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈ నెల 21 నుండి 23 వరకు కొనసాగనున్న రైతు మహోత్సవం కార్యక్రమం సోమవారం అట్టహాసంగా ప్రారంభం అయ్యింది. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతు మహోత్సవాన్ని లాంచనంగా ప్రారంభించారు. హైదరాబాద్ నుంచి మంత్రితో కలిసి హెలికాప్టర్ లో విచ్చేసిన సహచర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ ఆలీ తదితరులు ఈ మహోత్సవంలో పాల్గొన్నారు. వీరితో పాటు ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కలెక్టర్లు రాజీవ్ గాంధీ హనుమంతు, ఆశిష్ సంగ్వాన్, ఐఏఎస్ అధికారులు భవాని శ్రీ, గోపి, వ్యవసాయ, అనుబంధ శాఖల ఉన్నతాధికారులు, కార్పొరేషన్ల చైర్మన్లు భాగస్వాములు అయ్యారు. రైతు మహోత్సవ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ, అనుబంధ రంగాల స్టాల్స్ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆధునిక వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు, వ్యవసాయ ఉత్పత్తులు, అధిక దిగుబడులను అందించే అధునాతన వంగడాలు, మేలు జాతి పశువులు, ఆహార పదార్థాల ప్రదర్శనకు దాదాపు సుమారు 150 స్టాళ్లు ఏర్పాటు చేశారు. సేంద్రీయ విధానంలో పంటల సాగు, ఆధునిక పద్ధతుల్లో లాభసాటి వ్యవసాయం, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులను అందించే వంగడాలు తదితర వాటి గురించి వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు, ఆదర్శ రైతుల ద్వారా అన్నదాతలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి ఐదు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు హాజరయ్యారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్టాల్స్ సందర్శించి, నూతన ఆవిష్కరణలు, ఆధునాతన వంగడాలు, వ్యవసాయ, అనుబంధ రంగాల ఉత్పత్తులను పరిశీలిస్తూ, వాటి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం తోపాటు, ఆధునిక సాంకేతికతను జోడించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జించే విధంగా వ్యవసాయ మెళుకువలను అందించడానికి రైతు మహోత్సవ కార్యక్రమం ఎంతగానో ఉపకరిస్తుందని, దీనిని రైతులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అందరి కోరిక మేరకు నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేసినందుకు కేంద్రానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. బోర్డును పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెచ్చి పసుపు రైతులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు, పసుపు ఆధారిత పరిశ్రమలు, ఉత్పత్తులకు కూడా కేంద్రం చొరవ చూపాలని కోరారు. ఈ మేరకు కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రత్యేకంగా కోరుతామని తెలిపారు. ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతుల ప్రయోజనాలే పరమావధిగా పంట రుణాల మాఫీ కింద రైతుల ఖాతాలలో 33 వేల కోట్ల రూపాయలను జమ చేశామని అన్నారు. త్వరలోనే రైతు భరోసా నిధులను కూడా రైతుల ఖాతాలలో జమ చేస్తామని మంత్రి తుమ్మల తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతిన్న రైతాంగానికి నష్ట పరిహారం సైతం అందించే ఏర్పాట్లు చేస్తామని ప్రకటించారు. దేశంలోనే మరెక్కడా లేనివిధంగా రైతుల నుండి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా పెద్ద ఎత్తున వరి ధాన్యం కొనుగోలు చేస్తూ, సకాలంలో బిల్లుల చెల్లింపులు జరుపుతున్నామని అన్నారు. తెలంగాణాలో ఉన్నది రైతు ప్రభుత్వమని, రైతాంగ సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఎంతో ఉపయుక్తంగా నిలిచే ఈ తరహా సదస్సులను ప్రతి జిల్లాలో ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. ఉమ్మడి జిల్లాలోని నిజాంసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులలో పూడికతీత పనుల కోసం ఈ నెలాఖరులోగా టెండర్ ప్రక్రియను పూర్తి చేస్తామని, పూడిక తొలగింపు ద్వారా లక్షల ఎకరాల అదనపు ఆయకట్టుకు నీటి వసతి సమకూరుస్తామని ప్రకటించారు. కాళేశ్వరం 20, 21, 22 ప్యాకేజీల పెండింగ్ పనులతో పాటు గుత్ప ఎత్తిపోతల పథకం మిగులు పనుల పూర్తికి అవసరమైన నిధులను కేటాయించి పనులను పూర్తి చేయిస్తామని అన్నారు. భూగర్భ జలాలు వృద్ధి చెందేలా అవసరమైన చోట విరివిగా చెక్ డ్యామ్ లు నిర్మించేలా చూస్తామని అన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగు నీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వపరంగా కొనుగోలు చేస్తూ, వారికి పూర్తిస్థాయి మద్దతు ధర అందిస్తున్నామని, సన్నాలు అదనంగా క్వింటాకు రూ. 500 చొప్పున బోనస్ చెల్లిస్తున్నామని గుర్తు చేశారు. పంట విక్రయించిన రెండు రోజులలోనే రైతుల ఖాతాలలో డబ్బులు జమ చేస్తున్నామని, కేంద్రాలలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచామన్నారు. ఎక్కడ కూడా గన్నీ బ్యాగుల కొరత లేదని, ఎక్కడైనా గన్నీ బ్యాగులు సమకూర్చడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సంబంధిత అధికారులను సస్పెండ్ చేస్తామని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా అవసరమైన అన్ని ప్రాంతాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను నెలకొల్పి, రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రణాళికాబద్ధంగా ధాన్యం సేకరణ చేస్తున్నామని తెలిపారు. కాగా, దేశంలోనే మరెక్కడా లేనివిధంగా తెలంగాణలోని 84 శాతం జనాభాగా ఉన్న సామాన్య, పేద కుటుంబాలకు కూడా తమ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తోందని అన్నారు. ఇదివరకు దొడ్డు రకం బియ్యం 2.81 కోట్ల మందికి పంపిణీ చేసేందుకు 10625 కోట్ల రూపాయలను వెచ్చించేవారని, కానీ 70 నుండి 80 శాతం మంది దొడ్డు బియ్యాన్ని భోజనానికి వినియోగించేవారు కాదని అన్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ , ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీలు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, డాక్టర్ భూపతిరెడ్డి, ధన్పాల్ సూర్యనారాయణ, రాకేష్ రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో ప్రసంగించారు. రాష్ట్ర వ్యవసాయ, రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, ఆయా కార్పొరేషన్ల చైర్మన్లు ఈరవత్రి అనిల్, అన్వేష్ రెడ్డి, మానాల మోహన్ రెడ్డి, తాహెర్ బిన్ హందాన్, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, నుడా ఛైర్మన్ కేశ వేణు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులుగా ఎంపిక చేసిన రైతులకు సబ్సిడీతో కూడిన ఆధునిక వ్యవసాయ యంత్ర, పరికరాలు పంపిణీ చేశారు.

---

# భూభారతి చట్టం పారదర్శకమైనది



**భూ సమస్యల పరిష్కార మార్గాలు సులభం**
**భూ భారతి తో అధికారాల వికేంద్రీకరణ**
**జియో మ్యాప్,జియో కోడ్ లతో పక్క గా హద్దుల నిర్ణయం**
**రైతులకు భూమి గుండె కాయ**
**భూ సమస్యలు త్వరితగతిన సులభంగా పరిష్కరించబడతాయి.**
**నిర్ణీత గడువులోపు భూమి మ్యూటేషన్ దరఖాస్తుల పరిష్కారం**
**భూ భారతి చట్టం అవగాహన సదస్సులలో కలెక్టర్ క్రాంతి వల్లూరు**



**సంగారెడ్డి, ఏప్రిల్ 21 (మనం ప్రతినిధి):** భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంపై రైతులు పరిపూర్ణమైన అవగాహన ఏర్పర్చుకోవాలని కలెక్టర్ క్రాంతి వల్లూరు సూచించారు. ఈ చట్టంలోని అంశాలపై గ్రామాలలో విస్తృతంగా చర్చిస్తూ, తోటి రైతులకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. సోమవారం మొగుడుంపల్లి మండలంలోని ప్రైవేట్ ఫంక్షనల్ లో భూభారతి చట్టం అవగాహన సదస్సులలో అదనపు కలెక్టర్ మాధురి ,తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూ భారతి చట్టం ద్వారా రైతులకు.చేకూరే ప్రయోజనాల గురించి కలెక్టర్ ఒక్కో అంశం వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. భూ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం రూపొందించిన భూ భారతి (ఆర్ ఓ ఆర్) చట్టం - 2025 జనవరిలో గెజిట్ రూపంలో వచ్చిందని, సమగ్ర అంశాలను పొందుపరుస్తూ ప్రభుత్వం ఏప్రిల్ 14న ఈ చట్టాన్ని ప్రవేశపెట్టిందని కలెక్టర్ వివరించారు. భూ సమస్యలు కలిగిన రైతులు ఏడాది కాలం లోపు భూభారతి పోర్టల్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. భూ భారతి చట్టం ప్రకారం భూ సంబంధిత సమస్యలను నిర్దిష్ట గడువులోపు పరిష్కరించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. సమస్య పరిష్కారం కాకుంటే కలెక్టర్ కు లేదా సీసీఎల్ఏ కు అప్పీల్ చేసుకోవచ్చని, ఈ చట్టంలో కొత్తగా ల్యాండ్ ట్రిబ్యునల్ కూడా అందుబాటులో ఉంటుందని సూచించారు. ధరణి లో రెవెన్యూ కోర్టులను తొలగించడం వల్ల భూ వివాదాల విషయంలో రైతులు సివిల్ కోర్టులను ఆశ్రయించాల్సి వచ్చేదని గుర్తు చేశారు. దీనివల్ల రైతులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం ప్రస్తుత భూభారతి చట్టం ద్వారా ఇదివరకటి తరహాలోనే రెవెన్యూ కోర్టులు పునరుద్ధరించిందని వివరించారు. భూ సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకునేందుకు రెవెన్యూ డివిజన్ అధికారికి, కలెక్టర్ కు అధికారాలు కల్పించారని తెలిపారు. అయినా కూడా సమస్య పరిష్కారం కాలేదని రైతులు భావిస్తే అప్పీలు చేసుకోవచ్చని సూచించారు. ఆర్థిక స్థోమత లేని పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం కూడా సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. రెవెన్యూ డివిజన్ అధికారి నిర్ణయం సరైంది కాదని భావిస్తే కలెక్టర్ వద్ద, కలెక్టర్ నిర్ణయంపై అభ్యంతరం ఉంటే ల్యాండ్ ట్రిబ్యునల్ కు అప్పీల్ చేసుకోవచ్చని అన్నారు. కాగా, ప్రతి గ్రామంలో రెవెన్యూ రికార్డులు తయారు చేసి, ప్రతి సంవత్సరం గ్రామాలలో రికార్డు డిస్ ప్లే చేయడం జరుగుతుందని అన్నారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతి గ్రామంలో గ్రామ పరిపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ప్రస్తుతం ధరణి లో ఉన్న భూ రికార్డులు భూ భారతి చట్టంలో కొనసాగుతాయని తెలిపారు. భూ హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు అర్హులైన వారు జిల్లాలో నూతన చట్టం అమల్లోకి వచ్చిన ఏడాదిలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పెండింగ్ లో ఉన్న సాధా బైనామా పరిష్కారం కోసం భూ భారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు. వీటికి సంబంధించి త్వరలోనే మార్గదర్శకాలు వెలువడనున్నాయని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ మాధురి మాట్లాడుతూ భూ భారతి చట్టం పై ఏమైనా సందేహాలు ఉంటే తీర్చడానికి అధికారులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని అన్నారు. ఈ సదస్సులలో ఆర్డీవో రామిరెడ్డి, స్థానిక అధికారులు, రైతులు పాల్గొన్నారు.

---

## తిరుమల శ్రీనివాసుడిని దర్శించుకున్న శ్రీనివాసరాజు



**తిరుమల,ఏప్రిల్ 21 (మనం న్యూస్ ):** కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి సన్నిధిలో దాదాపుగా ఎనిమిది సంవత్సరాల కాలం పాటు టీటీడీ సంయుక్త కార్య నిర్వహణ అధికారిగా పనిచేసి ప్రస్తుత తెలంగాణ రాష్ట్రం మౌలిక సదుపాయాలు, ప్రాజెక్టుల ప్రభుత్వ సలహాదారుడిగా పనిచేస్తున్న కే.ఎస్ శ్రీనివాసరాజు సోమవారం ఉదయం స్వామివారి నైవేద్యం విరామ సమయం అనంతరం స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు దర్శనం అనంతరం రంగనాయక మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా టీటీడీ అధికారులు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

---

## ఈనెల 24న ఆలేరులో జరుగు పాల రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి...

- **తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటి డిమాండ్**



**ఆత్మకూర్(ఎం), ఏప్రిల్ 21 (మనం న్యూస్):** పాల రైతులకు పెండింగ్ లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని, ప్రభుత్వం ప్రకటించిన ఐదు రూపాయల ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం ఏర్పడ్డ నాటినుండి నేటి వరకు రైతుల ఖాతాలో జమ చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మాటూరి బాలరాజు గౌడ్, జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం రోజున ఆత్మకూర్ మండలం కూరెళ్ల, పల్లెర్ల గ్రామాల్లోని మదర్ డైరీ పాల కేంద్రాల వద్ద రైతులతో కలిసి సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 రోజులకు ఒకసారి పాల బిల్లులు చెల్లించాల్సి ఉన్నప్పటికీ మదర్ డైరీకి సంబంధించి ఐదు బిల్లులు పెండింగ్ లో ఉన్నాయని అన్నారు. తక్షణమే వాటిని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఒక బిల్లు పెండింగ్ లో ఉన్న దాన్ని విజయ డైరీ సంస్థ వెంటనే చెల్లించాలని అన్నారు. నష్టాల పేరుతో మదర్ డైరీ సంస్థ యొక్క ఆస్తులను విక్రయించొద్దని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 50 కోట్ల రూపాయలు గ్రాంట్స్ రూపేనా ఇచ్చి మదర్ డైరీని ఆదుకోవాలని కోరారు. సబ్సిడీపై దాణను ప్రభుత్వమే సరఫరా చేయాలని అన్నారు. పాడి గేదెలకు, పాడి రైతులకు బీమా సౌకర్యం కల్పించి ప్రభుత్వమే ఆ బీమా మొత్తాన్ని చెల్లించాలని అన్నారు. పై సమస్యల పరిష్కారం కోసం ఈనెల 24న ఆలేరులో జరిగే రాష్ట్ర సదస్సులో పాడి రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నాయకులు ఒంటిపెంటి గోపాల్ రెడ్డి, వేముల బిక్షం, ఎరుకల స్వామి, ఎరుకల యాదయ్య, కొమ్మయిగూడెం యాదయ్య, నాయని కృష్ణారెడ్డి, బండి స్వామి, నోముల సుదర్శన్, నరసయ్య, కూరేళ్ల స్వామి, తండ మల్లేష్, గరిశకోట యాదగిరి, కన్నెబోయిన స్వామి, ఎండి షకిల్, జినుకల యాదయ్య, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

---

# భూభారతి చట్టంతో రైతుల సమస్యలు పరిష్కారం



**భువనగిరి ప్రతినిధి, ఏప్రిల్ 21 (మనం న్యూస్):** భూభారతి చట్టంతో ఎంతోకాలంగా ఇబ్బందులు పడుతున్న సమస్యలకు చక్కని పరిష్కార మార్గం లభించిందని ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య తెలిపారు. సోమవారం బొమ్మల రామారం, రాజ పేట మండలాలలో పర్యటించి ఏర్పాటు చేసిన భూ భారతి అవగాహన సదస్సు లలో పాల్గొన్నారు. బొమ్మల రామారం మండల కేంద్రంలోని రెవెన్యూశాఖ అధ్యర్యంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన భూభారతి ఆర్ ఓ ఆర్ చట్టం అవగాహన సదస్సు లో జిల్లా కలెక్టర్ హనుమంతరావు తో కలిసి ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ , ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ భూమి ఉన్న ప్రతి ఒక్కరికి హక్కు కల్పించాలని గొప్పఉద్దేశంతో ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకొచ్చిందన్నారు. ఈ చట్టం గ్రామాలలో విస్తృత ప్రచారం చేపట్టి అవగాహన కల్పిస్తున్నామన్నారు. గతంలో భూమి సమస్యలు అధికంగా ఉండేవని, సమస్యలు పరిష్కారం కాక కోర్టుల చుట్టూ తిరిగి డబ్బుతో పాటు సమయం వృధా అయ్యేదన్నారు. భూభారతి తో ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా పేరుకుపోయిన పలు సమస్యలకు పరిష్కారం చూపాలని, నిజమైన రైతుకు మేలు చేసే విధంగా ప్రభుత్వం ఆలోచన చేసిందన్నారు. భూభారతి ద్వారా నేడు సమస్యలకు పరిష్కారం లభించనున్నదన్నారు. అవగాహన పొందిన వారు మీ గ్రామాలలో రైతులకు అవగాహన కల్పించి భూ సమస్యలు సులభతరంగా పరిష్కరించుకునే విధంగా కృషి చేయాలన్నారు. రైతులకు ప్రభుత్వం భూ భారతి చట్టంతో పెద్ద పీట వేసిందన్నారు. రైతుల భూ సమస్యలు మార్పులు చేర్పులు, మ్యుటేషన్, ఇతర సమస్యలకు ఈ భూభారతి చట్టం ఉపయోగపడుతుందన్నారు. భూ సమస్య లేని గ్రామాలు ఇకపై ఉండవన్నారు. భూమి పై యజమాన్యుడికి సర్వహక్కులు భూభారతి చట్టం కల్పించనున్నదన్నారు. ముఖ్యమంత్రి సుదీర్ఘంగా దృఢమైన ఆలోచన చేసి ఈ చట్టాన్ని తీసుకొచ్చినందుకు రుణపడి ఉంటామన్నారు. ప్రతి మనిషికి ఆధార్ మాదిరిగానే భూమి ఉన్న ప్రతి ఒక్కరికి భూధర్ కార్డులు ప్రభుత్వం అందిస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ భూ సమస్య పై ఒక వ్యక్తి చేసుకున్న దరఖాస్తు దానిలో కబ్జా జరిగినా, పట్టా ఇతరుల పేరు మీద నమోదు అయినా, దాన్ని పరిష్కారం కు గతంలో ధరణి లో లేనందున కోర్టుకు పంపడం జరిగేదన్నారు. అక్కడ కూడా కొన్ని సమస్యలు రకరకాల సమస్యలతో పరిష్కారం కాకపోయేవని, ఇప్పుడు భూభారతి చట్టం ద్వారా ఇబ్బందులు పోతాయన్నారు. ఇకనుండి ప్రతి డిసెంబర్ మాసంలో రెవెన్యూ రికార్డుల లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. సెక్షన్ 12 ప్రకారంగా పహాని పొందవచ్చని, సెక్షన్ 4 ప్రకారం తప్పులు సరిదిద్దడం జరుగుతుందన్నారు.భూభారతి అప్పిలేట్ అధికారిగా ఆర్డిఓ ఉంటారని, ఏమైనా భూ సమస్యల పై అన్యాయం జరిగితే ఆర్డిఓ సవరించి చట్టం ద్వారా న్యాయం జరిగేలా చేస్తారన్నారు. భూభారతి రైతులకే ధైర్యం కాదని అధికారులకు కూడా భూ సమస్య పరిష్కరమయినందుకు సంతృప్తి కలుగుతుందన్నారు. ప్రజలు భూ సమస్యల వల్ల కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగకుండా ఏమైనా భూ సమస్య ఉంటే ఇకనుండి సులభతరంగా పరిష్కరించుకోవచ్చని, స్థానిక తహసిల్దార్ పరిధిలో కాకపోతే ఆర్డీవో పరిధిలో పరిష్కారం జరుగుతుందని, ఆర్డీవో పరిధిలో కూడా పరిష్కారం కాకపోతే కలెక్టర్ స్థాయిలో పరిష్కరిస్తారని, కలెక్టర్ స్థాయి లో కూడా కాకపోతే సీసీఎల్ఏ ద్వారా పరిష్కారం అవుతుందన్నారు. భూభారత్ చట్టం అప్పీల్ ను తీసుకురావడం ద్వారా పేదలకు తప్పనిసరిగా న్యాయం జరుగుతుందన్నారు. నిజమైన నిరుపేదల అన్ని రకాల భూ సమస్యలకు భూ భారతి చట్టం శాశ్వత పరిష్కారం చూపుతుందన్నారు. ఈ అవగాహన సదస్సులో భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, బొమ్మల రామారం, రాజాపేట తహసిల్దార్లు శ్రీనివాసరావు, అనిత, ఎంపీడీఓలు త్రివిక్రమ్, నాగ వాణి , ప్రత్యేక అధికారులు జ్యోతి కుమారి, శాంత కుమారి, అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

---

# సివిల్ స్కోర్ తో సంబంధం లేకుండా రాజీవ్ యువ వికాసం పథకాన్ని అందించాలి



- **బ్యాంకర్ల సమావేశంలో జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు**

**సంగారెడ్డి, ఏప్రిల్ 21(మనంప్రతినిధి):** కలెక్టరేట్‌లో రాజీవ్ వికాసం పథకం పై బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ సివిల్ స్కోర్ తో సంబంధం లేకుండా అర్హులైన వారికి ఈ పథకం వర్తింపజేయాలన్నారు. ఈ పథకం లో అర్హులైన నిరుద్యోగులకు ఎలాంటి షరతులు లేకుండా రాజీవ్ యువ వికాసం పథకాన్నిఅందించాలన్నారు. నిరుద్యోగ యువతను స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా అమలు తలపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి జిల్లాలో అనూహ్య స్పందన లభించిందనీ ఆయా వర్గాలకు చెందిన నిరుద్యోగుల నుంచి భారీగా దరఖాస్తులు వచ్చాయన్నారు. అన్ని వర్గాల నుంచి అనూహ్య స్పందన లభించగా రూ.50వేలు మొదలుకుని రూ.4లక్షల వరకు రుణం పొందేందుకు పథకాలను ప్రభుత్వం నిర్వహించిందని ఈనెల 14వ తేదీతో దరఖాస్తు సమర్పణకు ప్రభుత్వం ఆన్లైన్లో చివరి తేదీగా నిర్ణయించిందన్నారు. జిల్లా మొత్తంలో 51,657మంది దరఖాస్తులు సమర్పించారని అత్యధికంగా బీసీ వర్గాల నుంచి 6,546 యూనిట్లకుగాను 23,681, ఎస్సీ విభాగం లో 7,415 యూనిట్లకు 14,480, మైనార్టీ విభాగం లో 2,456 యూనిట్లకు 8,378, ఎస్టీ విభాగంలో 2,502 యూనిట్లకు 4,232, ఈబీసీలో 1,654 యూనిట్లకు 817 దరఖాస్తులను సమర్పించాలని తెలియజేశారు.రాజీవ్ యువ వికాసం పథకాన్ని నాలుగు కేటగిరీ జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా యూనిట్లను మంజూరు చేసి వారికి ప్రొసీడింగ్స్ అందచేయనున్నారని, ఈ పథకంలో మొదట నిస్స హాయులు, వితంతువులు, ఒంటరి మహి ళలు, దివ్యాంగులు, నిరుద్యోగులు, ఇదివరకు ప్రభుత్వం నుంచి స్వయం ఉపాధి పథకాల రుణాలు పొందని వారికి ప్రాధాన్యతా క్రమం లో మంజూరు చేయనుందని పేర్కొన్నారు. పథకం కింద అర్హత పొందిన వారికి రెండు దఫాలుగా వారి ఖాతాల్లో నగదు జమకానుంది. తొలుత సగభాగం యూనిట్లు కొనుగోలు చేసే సమ యంలో, మిగిలిన సగభాగం యూనిట్లు కొను గోలు చేసిన తర్వాత అందజేయనున్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్ర శేఖర్, పిడి డిఆర్డిఏ జ్యోతి, ఈ డి ఎస్ సి కార్పొరేషన్ రామాచారి, సాంఘిక సంక్షేమ శాఖ/ గిరిజన సంక్షేమ శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జగదీష్,ఎల్ డి ఎం గోపాల్ రెడ్డి, జిల్లా అల్ప సంఖ్య సంక్షేమ అధికారి దేవుజా , వివిధ బ్యాంక్ అదికారులు పాల్గొన్నారు.

## పుడమి తల్లికి ఒళ్లంతా గాయాలు...!!

ఎత్తయిన పర్వతాల సుందర రూపంతో
అందమైన నడకల నదుల సోయగం తో
విశాలమైన వక్షస్థల మైదానాలతో
చూడ చక్కని సుందర శిల్ప లావణ్యమైన
నేలతల్లి..
నేడు పుడమి తల్లికి ఒళ్లంతా గాయాలు
కాలుష్యపు క్యాన్సర్ తో సతమతమవుతూ
స్వచ్ఛమైన గాలి లేక వెంటిలేటర్ పై జీవిస్తుంది
మనిషి పెట్టిన విషం తిని అలమటిస్తుంది..

ప్రాణులకు స్తన్యం ఇచ్చినటువంటి తల్లి
ఎదపై పుండ్లతో నిత్యం బాధపడుతూ
సహజత్వం కోల్పోయి కురూపి గా మారెను
అందమైన అమ్మ ఆకారం కళ హీనంగా
తయారయ్యే..
ఎన్నో జీవులకు గర్భం ఇచ్చిన మాతృమూర్తి
వారి పోషణకై నిరంతరము తపించిన కన్నతల్లి
అణు విస్ఫోటాలతో తల్లడిల్లుతుంది
ఆకలికి ఆహారం కరువై విలవిలలాడుతుంది...

పుడమి కనక గర్భము తో తులతూగుతుంటే
ఆశపరులు త్రవ్వి ధనము పోగు చేస్తుంటే
తనువంతా చిల్లులు పడి సతాయిస్తుంటే
నిత్యం మౌనంగా మూగ రోదన చేస్తూ
జీవిస్తుంది..
విశ్వంలో అందమైన అపురూపం నా భూగ్రహం
నేడు అనాథలా తయారై తిరుగుతుంది
అందులో పుట్టి ప్రత్యామ్నాయం చూస్తున్నాం
నేడు మనుగడ కోసం ప్రకృతిని ఆశిస్తున్నాం...

దాహం అంటే నీరు ఇస్తుంది జీవులకు
ఆకలంటే అన్నం పెడుతుంది సర్వప్రాణులకు
సచ్చే వరకు మోసి తనలోనే కలుపుకుంటుంది
ఏమిచ్చి తీర్చుకోగలం ఈ నేల తల్లి రుణం....
చిన్న మొక్క నాటి ప్రేమగా పలకరించండి
ఆనందంగా మొక్క నాటి అపురూపంగా పెంచండి
స్వచ్ఛమైన గాలిని పుడమి తల్లికి అందించండి
నేల తల్లికి బలం చేకూర్చే వనాన్ని
సమకూర్చండి..

**- కొప్పుల ప్రసాద్**
9885066235

# భూగ్రహ రక్షణ మనందరి తక్షణ బాధ్యత



ప్రపంచ ధరిత్రి దినోత్సవం పర్యావరణ పరిరక్షణకు మద్దతును ప్రదర్శించడానికి ఏప్రిల్ 22న జరిగే ప్రపంచ వార్షిక కార్యక్రమం. ఇది మొదటిసారి ఏప్రిల్ 22, 1970న నిర్వహించబడింది, ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా (earthday.org) ద్వారా 193 కంటే ఎక్కువ దేశాల్లోని 1 బిలియన్ మంది వ్యక్తులతో సహా అనేక రకాల కార్యక్రమాలు జరుగుతున్నాయి. 1969లో శాన్ ఫ్రాన్సిస్కోలో జరిగిన యునెస్కో (UNESCO) సమావేశంలో, శాంతి కార్యకర్త జాన్ మెక్కానెల్ భూమిని, శాంతి భావనను గౌరవించే రోజును ప్రతిపాదించాడు. దీనిని మొదట మార్చి 21, 1970న, ఉత్తర అర్ధ గోళంలో వసంతకాలం మొదటి రోజున పాటించాలని ప్రతిపాదించారు. ఐక్యరాజ్యసమితిలో సెక్రటరీ జనరల్ యు థాంట్ సంతకం చేసారు. ఒక నెల తర్వాత, యునైటెడ్ స్టేట్స్ సెనేటర్ గేలార్డ్ నెల్సన్ ఏప్రిల్ 22, 1970న దేశవ్యాప్త పర్యావరణ బోధనను నిర్వహించాలనే ఆలోచనను ప్రతిపాదించారు. నెల్సన్ మరియు హేస్ ఈ కార్యక్రమంకి ధరిత్రి దినోత్సవం (ఎర్త్ డే) అని పేరు పెట్టారు. 2025 ప్రపంచ భూమి దినోత్సవం యొక్క అధికారిక సారాంశం 'మన శక్తి, మన గ్రహం'. ఇది పునరుత్పాదక శక్తికి మారడం, స్థిరమైన భవిష్యత్తును నిర్మించడం అనే సమిష్టి బాధ్యతపై దృష్టి పెడుతుంది. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అయ్యే పునరుత్పాదక శక్తి మొత్తాన్ని మూడు రెట్లు పెంచడం, ముఖ్యంగా సౌర, పవన భూఉష్ణ వంటి శుభ్రమైన వనరులను నొక్కి చెప్పడం ముఖ్య లక్ష్యం.

జీవుల మనుగడకు అనుకూలమైన గ్రహం భూమి. కానీ అది చాలా సమస్యలను ఎదుర్కొంటోంది. వాతావరణ మార్పుల కారణంగా నాసా (NASA) ప్రకారం, భూమిపై గ్లోబల్ వార్మింగ్ సగటు ఉపరితల ఉష్ణోగ్రత 59 డిగ్రీల ఫారెన్హీట్ (15 డిగ్రీల సెల్సియస్) వద్ద ఉంది. గాలి, నీరు, నేల, ధ్వని కాలుష్యాలు పెరుగుతున్నాయి. 1970 నుండి జీవవైవిధ్య నష్టం 73% గా ఉంది. సంవత్సరానికి 10 మిలియన్ హెక్టార్లలో అటవీ నిర్మూలన జరుగుతోంది. పెరుగుతున్న మానవ జనాభా, పెరుగుతున్న వినియోగం సహజ వనరులపై అపారమైన ఒత్తిడిని కలిగిస్తుంది, ఇది నీటి కొరత, ఆహార అభద్రత, ఆవాసాల నాశనానికి దారితీస్తుంది. మరోవైపు, ప్లాస్టిక్ ఉత్పత్తి, పారవేయడం మహా సముద్రాలు, పల్లపు ప్రాంతాలు, పర్యావరణ వ్యవస్థలలో కాలుష్యానికి, వన్యప్రాణులకు, ఆహార గొలుసులకు అంతరాయం కలిగిస్తుంది. 1970ల చివరి నుండి, ఓజోన్ స్థాయిలు సగటున 4% తగ్గాయి. ప్రపంచవ్యాప్తంగా, జనాభాలో గణనీయమైన భాగం నీటి కొరతను అనుభవిస్తోంది. దాదాపు 25% మంది నీటి ఒత్తిడి, కొరతను ఎదుర్కొంటున్నారు. 2025 నాటికి, ప్రపంచ జనాభాలో మూడింట రెండు వంతుల మంది నీటి కొరతను ఎదుర్కొంటారని అంచనా.ఈ సమస్యలు పర్యావరణం మాత్రమే కాదు, సామాజిక, ఆర్థిక పరిణామాలను కూడా కలిగి ఉన్నాయి, దీనికి ప్రపంచ సహకారం, స్థిరమైన పరిష్కారాలు అవసరం.

ప్రపంచ దేశాలు స్థిరమైన అభివృద్ధి, వాతావరణ చర్య మరియు ప్రపంచ సహకారం వంటి అంశాలపై దృష్టి సారించి అనేక కార్యక్రమాలు శిఖరాగ్ర సమావేశాలను అమలు చేస్తున్నాయి. ఈ చొరవలు ప్రపంచవ్యాప్త సవాళ్లను ఎదుర్కోవడం అంతర్జాతీయ సహకారాన్ని ప్రోత్సహించడం

లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఐక్యరాజ్యసమితి అనేక కార్యక్రమాలు శిఖరాగ్ర సమావేశాలను మెరుగైన వర్తమానాన్ని అందించడం, భవిష్యత్తును కాపాడటంపై కొత్త అంతర్జాతీయ ఏకాభిప్రాయాన్ని ఏర్పరచడం లక్ష్యంగా పెట్టుకున్న ఉన్నత స్థాయి కార్యక్రమం ప్రారంభించింది..
2030 ఎజెండా స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు యొక్క తదుపరి, సమీక్ష కోసం మహమ్మారి వల్ల కలిగే అభ్యాస నష్టాలను పరిష్కరించడానికి భవిష్యత్తు కోసం విద్యను తిరిగి ఊహించుకోవడానికి ఉన్నత స్థాయి కార్యక్రమం ప్రారంభించింది. క్యోటో ప్రోటోకాల్ ఆరు గ్రీన్హౌస్ వాయువుల ఉద్గారాలను తగ్గించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం (UNEP) దేశాలు వాతావరణ స్థిరత్వాన్ని పెంపొందించడానికి, ప్రకృతితో సామరస్యంగా జీవించడానికి కాలుష్య రహిత భవిష్యత్తులను సాధించడానికి, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలకు మద్దతు ఇవ్వడానికి సహాయపడతాయి. ప్రైవేట్ రంగం స్థిరమైన పద్ధతులు పునరుత్పాదక శక్తిలో ఎక్కువగా పెట్టుబడి పెడుతోంది, పౌర సమాజం, ప్రభుత్వేతర సంస్థలు అవగాహన పెంచడంలో పర్యావరణ చొరవలకు మద్దతు ఇవ్వడంలో కీలక పాత్ర పోషిస్తాయి. యునైటెడ్ కింగ్డమ్, నార్వే, ఫ్రాన్స్ న్యూజిలాండ్ 2050 నాటికి నికర సున్నా ఉద్గారాలను చేరుకోవడానికి చట్టబద్ధంగా కట్టుబడి ఉన్న కొన్ని దేశాలు. అయినప్పటికీ, మెజారిటీ దేశాలు వాటి రాజకీయ ఆర్థిక ప్రభావాల కారణంగా భూగ్రహాన్ని రక్షించడానికి ఆసక్తి చూపడం లేదు.



భారత ప్రభుత్వం గ్రహాన్ని రక్షించడానికి వివిధ చర్యలను అమలు చేసింది, వాటిలో పునరుత్పాదక శక్తిపై దృష్టి పెట్టడం, వాయు కాలుష్యాన్ని ఎదుర్కోవడం, స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహించడం, వాతావరణ మార్పుపై జాతీయ కార్యాచరణ ఉన్నాయి. అదనంగా, శిలాజేతర ఇంధన విద్యుత్ ఉత్పత్తికి లక్ష్యాలను పెంచడానికి ఉద్గార తీవ్రతను తగ్గించడానికి ప్రభుత్వం దాని జాతీయంగా నిర్ణయించిన సహకారాలను (ఎన్డీసీలు) నవీకరించింది.

2008లో ప్రారంభించబడిన నేషనల్ యాక్షన్ ప్లాన్ ఆన్ క్లైమేట్ చేంజ్ ప్రణాళిక, నేషనల్ సోలార్ మిషన్, నేషనల్ మిషన్ ఫర్ ఎన్హాన్స్డ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ, నేషనల్ మిషన్ ఫర్ ఎ గ్రీన్ ఇండియాతో సహ ఎనిమిది జాతీయ మిషన్లను వివరిస్తుంది. 2030 నాటికి శిలాజేతర ఇంధన ఉత్పత్తికి తన నిబద్ధతను 50%కి పెంచడానికి, 2005 స్థాయిలతో పోలిస్తే ఉద్గార తీవ్రతను 45% తగ్గించడానికి భారతదేశం తన జాతీయంగా నిర్ణయించిన సహకారాలను లను నవీకరించింది, 2030 నాటికి 2.5-3 బిలియన్ టన్నుల కార్బన్ సింక్ను లక్ష్యంగా చేసుకుంది. భారతదేశం 2030 నాటికి 450 గిగావాట్ పునరుత్పాదక శక్తిని లక్ష్యంగా చేసుకుంది.

దేశవ్యాప్తంగా వాయు కాలుష్యాన్ని పరిష్కరించడానికి సమగ్ర ప్రణాళికగా ప్రభుత్వం నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ను ప్రారంభించింది. వాహన ఉద్గారాలను తగ్గించడానికి భారతదేశం బిఎస్-IV నుండి బిఎస్-VI ఇంధన ప్రమాణాలకు ఒక పెద్ద ముందడుగు వేసింది.

కంప్రెస్డ్ బయో-గ్యాస్ ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. బొగ్గు ఆధారిత థర్మల్ పవర్ ప్లాంట్ల నుండి ఫ్లై యాష్ యొక్క సరైన వినియోగాన్ని నిర్ధారించడానికి విద్యుత్ మంత్రిత్వ శాఖ ఫ్లై యాష్ వినియోగ కార్యాచరణ ప్రణాళికను అమలు చేసింది.

భూమిని సమర్థవంతంగా రక్షించడానికి, వ్యక్తిగత చర్యలు, ప్రభుత్వ విధానాలు మరియు ప్రపంచ సహకారాన్ని కలిగి ఉన్న బహుముఖ విధానం అవసరం.

మన కార్బన్ పాదముద్రను తగ్గించడం, నీరు శక్తి వంటి వనరులను పరిరక్షించడం, వ్యవసాయం పరిశ్రమలలో స్థిరమైన పద్ధతులను ప్రోత్సహించడం, అంతర్జాతీయ ఒప్పందాలు, సాంకేతిక పురోగతి ద్వారా వాతావరణ మార్పులను పరిష్కరించడం వంటి ముఖ్యమైన చర్యలు ఉన్నాయి. ఈ ప్రపంచానికి అవసరమైన భూ రక్షణ చర్యల కోసం కఠినమైన అమలుతో కూడిన ప్రణాళికాబద్ధమైన దీర్ఘకాలిక వ్యూహంలలో దేశాలు విశాల దృక్పథంతో ఉండాలి.

**(నేడు ప్రపంచ ధరిత్రి దినోత్సవం)**

**- డాక్టర్. పి.ఎస్. చారి**
8309082823

# యంగ్ ఇండియా బ్రాండ్ అంబాసిడర్ తెలంగాణ



మన బలాలను తెలుసుకొని ముందడుగు వేయడం, బలహీనతలకు చికిత్సలు ఆలోచించడం విజ్ఞులు చేసే పని. నేటి భారతావని అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న వేళ సరైన సమాధానాలు వెతకడంతో పాటు మన బలాలను గుర్తించి సుస్థిరాభివృద్ధి దిశగా మలుచు కోవడం వివేకుల ఆలోచనలు అవుతాయి. 144 కోట్ల జనాభా మనకు వరమా, శాపమా ! అని చర్చించుకుంటున్న వేళ మన జనాభా సగటు వయస్సు 28.8 సంవత్సరాలు నమోదు కావడం శుభ పరిణామంగా తీసుకోవాలి. అపార మానవ వనరుల సగటు వయస్సు 28.8 ఏండ్లు అయినపుడు, భారతావని నిండా యువశక్తి ప్రవాహం కొనసాగుతున్నది, యువ భారత్ అంటూ సగర్వంగా పిలువబడుతున్నది. దేశ జనాభాలో 15 - 29 ఏండ్ల వయస్సు ఉన్న యువత 42 కోట్లు ఉండడంతో పాటు 35 ఏండ్ల లోపు వయస్సు ఉన్న జనాభా 65 శాతం ఉండడం మన దేశ అమూల్య వనరులుగా భావించాలి. దేశ జనాభా సగటు వయస్సులో జపాన్ 50 ఏండ్లు, అమెరికా 38.7 ఏండ్లు ఉండడం ఆయా దేశాల అధిక వయోవృద్ధుల జనాభాను సూచిస్తున్నది. వృద్ధ జపాన్ లాంటి పదాలను ఉపయోగించాల్సిన స్థితి వస్తున్నది.

**యంగ్ ఇండియా బ్రాండ్ అంబాసిడర్గా తెలంగాణ**

28వ రాష్ట్రంగా అవతరించిన తెలంగాణ 11వ అతి పెద్ద, 12వ అతి పెద్ద జనాభా, జిడిపీలో 8వ ర్యాంకు కలిగిన రాష్ట్రంగా తెలంగాణ అభివృద్ధి పథంలో ముందంజలో ఉన్నది. తెలంగాణ జనాభా దాదాపు 3.5 కోట్లు ఉండడం, ఇందులో దాదాపు 2.4 కోట్ల జనాభా యువత 15 - 40 ఏండ్లు ఉండడం, ఉన్నత విద్యలో నమోదు నిష్పత్తి (జిఈఆర్) 28.4 శాతం ఉండడం, యువ జనాభా అధికంగా ఉన్న తెలంగాణలో ఉన్నత విద్యా సంస్థలు ఎక్కువగా ఉండడంతో మన యువత విద్యతో పాటు నైపుణ్యాలను ఒడిసి పట్టుకొని గౌరవప్రద ఉద్యోగ ఉపాధులను పొందితే నేటి తెలంగాణ రేపటి భారతానికి యంగ్ ఇండియా అంబాసిడర్గా మారబోతుందనడంలో అతిశయోక్తి లేదు.ప్రస్తుతం తెలంగాణలో 1,446 కళాశాల్లో 4.58 లక్షల యువత ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. 388 ఇంజనీరింగ్ కళాశాలలు, 62 ప్రభుత్వ/ప్రైవేట్ మెడికల్ కళాశాలలు తెలంగాణ యువతకు విద్య, నైపుణ్యాలను బోధించే ప్రయత్నాలు చేస్తున్నాయి.

**యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ స్థాపన**

ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కారు యంగ్ ఇండియా నినాదం తీసుకొని యువతకు విద్యతోపాటు నైపుణ్యాలను పెంపొందించే దిశగా పలు వాంఛనీయ చర్యలను తీసుకోవడం సముచితంగా ఉన్నది. ఇదే క్రమంలో ఇటీవల దేశంలోనే ప్రతిష్టాత్మక యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని 15 బహుళజాతి కంపెనీల భాగస్వామ్యంతో ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) ప్రాతిపదికన ఏర్పాటు చేయడం ఆహ్వానించదగిన పరిణామం. తొలి బ్యాచ్గా 9 కోర్సులను ప్రారంభించి 212 మంది విద్యార్థినీవిద్యార్థులను ఎంపిక చేసి నైపుణ్య వికాస శిక్షణను ఇవ్వడం కొనసాగుతున్నది. నేడు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా ఫార్మసీ, ఈ-కామర్స్ లాజిస్టిక్స్, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్సియల్ సర్వీసెస్, కన్స్ట్రక్షన్, రిటేల్



ఆపరేషన్స్ అండ్ మేనేజ్మెంట్ , ఆనిమేషన్, విజ్వువల్ ఎఫెక్ట్స్, గేమింగ్ అండ్ కామిక్స్, వేర్హౌజ్ ఎగ్జిక్యూటివ్స్, కీ కన్సైనర్ ఎగ్జిక్యూటివ్ కోర్సులను అందిస్తున్నది. రానున్న రోజుల్లో నర్సింగ్ ఎగ్జిక్యూటివ్, ఫార్మా అసోసియేట్ కోర్సులను కూడా ప్రారం భించనున్నది. ఈ కోర్టులు పూర్తి చేసిన యువతకు ఆయా భాగస్వామ్య కంపెనీలు ఉద్యోగ నియామకాలను చెపట్టనున్నది. నేటి తెలంగాణ యువతకు ఇదొక అపూర్వ ఉద్యోగాలు అందించే అక్షయ పాత్రగా యంగ్ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ మారుతున్నదని నమ్మాలి.

**యంగ్ ఇండియా ఫిజికల్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ స్థాపన**

ఫిజికల్ ఎడ్యుకేషన్ నినాదం హెల్దీ మైండ్ ఇన్ హెల్దీ బాడీ (ఆరోగ్యకర దేహంలో ఆరోగ్యకర మెదడు) నేటి యువతకు శారీరక ప్రాధాన్యాన్ని స్పష్టం చేస్తున్నది.

5.18 కోట్ల జనాభా కలిగిన దక్షిణ కొరియాకు 2024 ఒలంపిక్స్లో 32 పతకాలు గెలవడం, 12.37 కోట్ల జనాభా కలిగిన జపాన్ 45 పతకాలు చెజిక్కించుకోగా, 140 కోట్లకు పైగా జనాభా కలిగిన భారత్కు 6 పతకాలు మాత్రమే రావడం విచారకరం. యువ భారత దృష్టిని క్రీడల వైపు మరల్చుతూ రానున్న ఓలంపిక్స్లో భారత జట్టు తరపున అధిక మొత్తంలో పతకాలు సాధించుటలో తెలంగాణ యువత ముందు నిలవడానికి సహకరించే యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ స్థాపించడం హర్షదాయకం. క్రీడల్లో ఆసక్తి కలిగిన తెలంగాణ యువత ఈ యూనివర్సిటీ ద్వారా తమ క్రీడా నైపుణ్యాలను పెంచుకొని ఓలంపిక్ పతకాలు సాధించే స్థాయికి చేరుకోవాలనే సదాశయంతో క్రీడా విశ్వవిద్యాలయానికి హకీంపేట సమీపాన ఫ్యూచర్ సిటీ పేరుతో 200 ఎకరాల ప్రాంగణాన్ని తీసుకురావడం హర్షదాయకం. యువతలో క్రీడా నైపుణ్యాలను పెంచడం, క్రీడా పరిశోధనలకు తలుపులు తెరవడం, క్రీడల ద్వారా ఆర్థికాభివృద్ధిని సుసాధ్యం చేయడం జరుగుతుందని ఆశిస్తున్నారు. సాలీనా 365 సీట్లతో వివిధ క్రీడల్లో శిక్షణలు ఇవ్వడానికి పథక రచన జరుగుతున్నది. ఈ యూనివర్సిటీ పూర్తి స్థాయిలో పని చేసినపుడు భారత క్రీడా రంగానికే తెలంగాణ బ్రాండ్ అంబాసియర్ కానున్నదని విశ్వసించడంలో సందేహం లేదు.

**సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ**
**యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ స్థాపన**

వీటికి తోడుగా ములుగులో సమ్మక్కా-సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ద్వారా తెలంగాణ యువతకు ఉన్నత విద్యలో, ముఖ్యంగా గిరిజన యువతకు పెద్ద పీట వేయడం జరుగుతుంది. అదే విధంగా ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన హైదరాబాద్ కోటి వుమెన్స్ కళాశాలను చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీగా మార్చడం కూడా మహిళా విద్యకు పెద్ద ఎత్తున ప్రాధాన్యం ఇవ్వడం సంతోషదాయకం.

ఇటీవల యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ కూడా ఏర్పాటు చేసి పోలీస్ సిబ్బంది పిల్లలకు 50 శాతం, ఇతర విద్యార్థినీవిద్యార్థులకు 50 శాతం సీట్లు కేటాయించి నాణ్యమైన విద్యను అందించే కృషి చేయడం జరుగుతుంది. ఈ విధంగా తెలంగాణ ప్రభుత్వం యువ శక్తిని దేశాభివృద్ధికి వినియోగించుకోవడానికి పూనుకోవడం సముచితంగా ఉన్నది.

యువశక్తికి వరంగా మారడానికి తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు రానున్న రోజుల్లో మన రాష్ట్రాన్ని భారతంలోనే ప్రత్యేక స్థానంలో నిలుపుటకు ఉపయోగపడతాయని నమ్ముదాం, యువ తెలంగాణను నైపుణ్య విద్యా కేంద్రంగా మారుదాం.

**- డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# దళితులకు బిజెపి దగ్గరయ్యేనా?

ఇంకొన్ని గంటల్లో దేశంలోని షెడ్యూల్ కులాలు డా బాబాసాహెబ్ అంబేద్కర్ 134వ జయంతోత్సవం జరుపుకోవడానికి ఉత్సాహంగా ఉన్న సమయంలో అగ్ర నాయకత్వం తమ పార్టీ కార్యకర్తలకు అంబేద్కర్ జయంతి వారోత్సవాలు జరపాలని పిలుపుని చ్చారు. దక్షిణ భారతదేశంలో అత్యధిక ఓటర్లు అయిన ఎస్సీ సామాజిక వర్గాలకు దగ్గర అవడానికి బీజేపీకి ఉన్నట్లు ఉండి అంబేద్కర్ మీద ప్రేమ పుట్టిందా అనే అనుమానం ప్రజల్లో నెలకొంది. ప్రజాస్వామ్యంలో మెజారిటీ కావాలంటే తమలాగే సారూప్యత ఉన్న కులాలతో కలుపుకు పోవాలని మాన్యశ్రీ కాన్షిరామ్ బహుజన్ సమాజ్ పేరిట (ఓ)బిసి లను రిప్రజెంట్ చేస్తూ పార్టీ ని నిర్మించి అణగారిన వారి గొంతుకగా దేశ రాజకీయాల్లో పెను తుఫాన్ సృష్టించాడు. నిజానికి బిసి కులాలను కలుపుకు పోవలనేది అంబేద్కర్ ఆలోచనే.

వెనుకబడిన కులాలను కలుపుకు పోవాలని బాబాసాహెబ్ డా అంబేద్కర్ 1952 అక్టోబర్ లో జరిగే ఎన్నికల కోసం 27 అక్టోబర్ 1951 పంజాబ్ లోని జలందర్ పట్టణంలో దళితులను ఉద్దేశించి ప్రసంగిస్తూ చెప్పిన మాట. అదే సమయంలో ఆయన ఒక అనుమానం కూడా వ్యక్తం చేశాడు. బిసిలు దళితులతో కలిస్తే వారి సామాజిక స్థాయి దళితుల లాగా అవుతుందని వారి ఆలోచన అని వ్యక్తం చేసాడు.

స్వాతంత్ర్య భారత దేశంలో దళిత ఓటు బ్యాంకు మొదటి నుండి కాంగ్రెస్ సొంతం చేసుకుంది. 1980 నుండి కాంగ్రెస్ తన ఓటు బ్యాంకును వివిధ ప్రాంతీయ పార్టీలకు జార విడుచుకుంటూ వస్తుంది. అదే సమయంలో బిజెపి కూడా ఉత్తర భారత దేశంలో సంఘ్ పరివార్ శక్తుల ద్వారా బిసి కులాలను ఆకర్షించింది. ఉత్తర ప్రదేశ్ లో కళ్యాణ్ సింగ్, ఉమాభారతి లాంటి వారు ఒక ఉదాహరణ.

1990లో కుల రాజకీయాలను మత రాజకీయాలుగా చెయ్యడంలో బిజెపి హిందుత్వ రాజకీయలు విజయం సాధించాయి. ఇదే సమయంలో బహుజన్ సమాజ్ పార్టీ దక్షిణ భారత దేశంలోని అతి పెద్ద రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ లో పాగా వేయడానికి ఒక ప్లాట్ ఫామ్ క్రియేట్ చెయ్యబడింది. దురదృష్టవశాత్తు అది కార్యరూపం దాల్చలేదు. దీనితో బహుజన్ సమాజ్ పార్టి బెహన్ జి మాయావతి నేతృత్వంలో ఉత్తరప్రదేశ్ కె పరిమితమైంది. ఒక వైపు జనతాదళ్ విఫలం అవడం, కాంగ్రెస్ బలమైన నాయకులు ప్రాంతీయ పార్టీలు పెట్టుకోవడం మాన్యశ్రీ కాన్షిరామ్ చనిపోవడం తో దళిత ఓటు చెల్లా చెదురై పోయింది. మాన్యశ్రీ కాన్షిరామ్ నే బీజేపీ తో పోత్తు పెట్టుకుని దళితులకు బిజెపి ని పరిచయం చేశాడు. అదే సందర్భంలో తెలంగాణ కు చెందిన బంగారు లక్షణ అనే మాదిగ కుల వ్యక్తిని పార్టి జాతీయ అధ్యక్షుడుగా చేసింది.

ప్రపంచ మార్కెట్లు భారత దేశం పై కన్నేసి లిబరలైజేషన్, ప్రైవేటై జేషన్, గ్లోబలైజేషన్ను భారతీయులకు పరిచ యం చేసింది. దీనితో రాజకీయాలు ముక్కచెక్కలై పోవడం ప్రపంచ వ్యాప్తంగా జరిగినట్లే ఇండియాలో కూడా జరిగింది. ఆధునికానంతరవాదం ప్రపంచ దేశంలో మార్క్సిస్టులకు కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా మారుతూ వచ్చింది అలాగే భారత దేశంలో దళితులను కమ్యూనిస్టుల నుండి, మార్క్సిస్టుల నుండి దూరం చేసింది. ఇందుకు బాబాసాహెబ్ రచనలు ప్రసంగాలు మరింత దోహత పడ్డాయి.

ప్రజల్లో చీలిక తేవడంలో పెట్టుబడిదారులు విజయం సాధించారు. అధినికానంతర వాద



సంస్కృతి, అస్తిత్వ ఉద్యమాలు భారత దేశంలో కూడా ప్రారంభించారు. దీనితో ఏ కులం,ఆ కులం, ఏ మతం ఆ మత రాజకీయాలు మొదలినాయి. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్ లో ఎస్సి వర్గీకరణ ద్వారా మాదిగలు తమ ఆస్తిత్వ ఉద్యమం, తమకు అనుకూలమైన పార్టి కి మద్దత్తు పలికే స్థాయికి పోయింది, అది బిజెపినా లేక తెలుగుదేశం కాలేక కాంగ్రెస్కా అనేది అప్రస్తుతం. అలాగే ఉత్తరప్రదేశ్లో పాసీ అనే కులం. బిజెపికి దగ్గరైంది. బీహార్ లో పాశ్వాన్లు, మహారాష్ట లో రిపబ్లికన్ పార్టీలు కేంద్రంలో బిజెపి కి మద్దత్తు పలుకుతున్నాయి. డా.అంబేద్కర్ రచనలు చదివి దళిత మేధావులు కమ్యూనిస్టు, మావోయిస్టులు ల నుండి దూరంగా వచ్చేసారు గానీ మతత్వ శక్తులను దూరం పెట్టలేకపోయింది. ఈ పరిణామాల గమనించిన బిజెపి దళితుల కోసం బాబాసాహెబ్ అంబేద్కర్ను పూజించడం మొదలు పెట్టింది. దళితుల ఇంటికి వెళ్లి సహపంక్తి భోజనాలు చెయ్యడం ప్రారంభించారు.

దళితులంటే జాతవ్ మరియు చమర్స్ మాత్రమే కాదని దళితుల్లోని అభివృద్ధి చెందని కులాల యువతకు ప్రాధన్యత ఇచ్చారు. మరోవైపు బిఎస్పిని నిర్వీర్యం చేస్తూ పార్టీ అధినాయకత్వంను అవినీతి కేసులో అరెస్ట్ చేస్తామనే సిగ్నల్ పంపి 2014 నుండి ఆ పార్టీ కార్యకలాపాలు లేకుండా చేశారు. మరో వైపు దేశ వ్యాప్తంగా దళితుల్లోని ఆల్ ఇండియా సర్వీస్ మాజీ ఉద్యోగులను ఎరవేసి తన వైపు తిప్పు కున్నారు. దళితుల్లోని నిరుద్యోగ యువతను, కుల సంఘాలను ఈ ఆల్ ఇండియా మాజీ సివిల్ సర్వీసు ఉద్యోగులు చేరదీసి బిజెపిలో దళితుల రిప్రజెంటేషన్ ఉండాలని కాంగ్రెస్, మరియు ఇతరులు దళితులకు ఏమి చేసిందని మాట్లాడించ డం చేశారు. అస్తిత్వ (కుల, మత, ప్రాంతాల) ఉద్యమం పేరిట బిజెపికి మద్దతు పలుకుతూ తమ గోతిని తామే తొవ్వుకుంటున్నారు. 'దృఢ నిశ్చయులమై మనం నిర్మాణయుతంగా లేకపోతే పదేళ్ల తర్వాత మనుస్మృతి రాజ్యం ఏర్పడే ప్రమాదం ఉందని డా.బాబాసాహెబ్ అంబేద్కర్ 27 అక్టోబర్ 1951, జలందర్, పంజాబ్లో ఎన్నికల సభలో మాట్లాడుతూ చేసిన హెచ్చరిక.

75 ఐదు సంవత్సరాల క్రితమే అంబేద్కర్ జరగబోయే పరిణామాలు చెప్పారు. దళితులు నిర్లక్ష్యం వహిస్తే తిరిగి వేదకాలం నాటి బాధల్లో పడేప్రమాదం ఉంది.

**- బల్లికిరవ. వెంకట్**
9652680802

## శవదీవెన

మీరిద్దరూ ప్రేమించుకున్నారు
సరే!
పెద్దల అనుమతీ
పొందాలనుకున్నారు
ఇంతలో...
జరగరానిది జరిగిపోయింది

ఓ సాహసీ!
తండ్రిశవం ఎదురుగానే
తాళి కట్టేసావు,
తండ్రి దీవెన పొందాలనుకుని
సాంప్రదాయరాహిత్యానికి
పూనుకొన్నావు

ఇటు నాన్న... అటు ప్రేమ
ఈ శుభాశుభాల సంధిలో
గెలిచింది నీ నిర్ణయం
నివ్వెరపోయింది ప్రేమలోకం
ఈ ఉదంతం ప్రేమపుటల్లో
సువర్ణాక్షరాలే

నీ పితృభక్తి అనితరసాధ్యం
మరి గెలవాలి
నీ సతికుటుంబమనసును
కూడా!

**(తమిళనాడులో తండ్రి దీవెనలు కోరి తండ్రి మృతదేహం ఎదుట ప్రియురాలిని పెళ్లాడిన కుమారుడు... ఘటనకు స్పందనగా)**

**- వేమూరి శ్రీనివాస్**
9912128967

## తీరం దాటుతున్న అలలు

అధికారం
సముద్ర తీరం వెంట
నిర్మించుకున్న ఇసుక గూడు!
ఎన్నికలకు
కాలనీయమం ఉండవచ్చు
అలలకు పెను తుఫానులకు లేదు!
అబద్ధాలు
ఆవలి తీరం దాటించవచ్చు
అలలు తీరం దాటితే అల్లకల్లోలమే!
గాయాలకు
మందేదో తెలియనప్పుడు
వైద్యం వికటిస్తుంది!
గాలిలో దీపాన్ని
ఎంతకాలం కాపాడుకుంటావు
రెపరెపలాడుతూనే కొండెక్కుతుంది!
కర్ణాకర్ణిక వింటున్న
అసంతృప్తి లోలోన
అగ్నిపర్వతమై మండుతున్నది!
లావా ఎగజిమ్ముతున్నప్పుడు
ఎదురు నిలవాలని కోవడం
ఒక వెర్రి బాగులతనం!!

**- కోట్ల వెంకటేశ్వర రెడ్డి**
9440233261

# నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం



**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

**గంగాధర, ఏప్రిల్ 21, (మనం న్యూస్):** గూడు లేని నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చడం కోసమే ప్రభుత్వం ఇందిరమ్మ పథకాన్ని ప్రారంభించిందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర మండలం కురిక్యాల గ్రామంలో లబ్ధిదారులు అవుదుర్తి కళా-కిషన్, అవుదుర్తి కళ్యాణి-ఎల్లయ్య, బాలగోని భాగ్య-గంగయ్య, కనుకుంట్ల మహిత-రాజశేఖర్, గూడేపు లక్ష్మి - రాజయ్య, తీగల మాధవి-రాజశేఖర్, ఎలగందుల భాగ్య లు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను సోమవారం కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా పైలెట్ ప్రాజెక్టుగా గంగాధర మండలం కురిక్యాల గ్రామాన్ని ఎంపిక చేసినట్లు, గ్రామంలో అర్హులైన వారికి వంద శాతం ఇండ్లను అందజేస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మొదటి విడత ఆర్థిక సహాయం లక్ష రూపాయలు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేస్తూ లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణాన్ని పూర్తిచేసేలా చూడాలన్నారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జాగిరపు రజిత శ్రీనివాస్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, ఎంపీడీవో రాము , పంచాయతీ కార్యదర్శి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో వచ్చే ప్రతి సమస్యను పరిశీలించి న్యాయం చేయాలి

- **మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, ఏప్రిల్ 21(మనం న్యూస్):** మంచిర్యాల జిల్లా లోని వివిధ ప్రాంతాల నుంచి వివిధ రకాల సమస్యల పరిష్కారం కోసం 'ప్రజావాణి' కి వచ్చే ప్రజల ప్రతి సమస్యను పరిశీలించి వారికి న్యాయం జరిగేలా చూడాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం నస్పూర్ గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పాల్గొన్నారు. తమ సమస్యల దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి కి వచ్చే ప్రతి సమస్యను పెండింగ్లో ఉంచకుండా దానికి సమాధానాలు ఇచ్చే బాధ్యత అధికారులు అన్నారు. అందరం ప్రజావాణి ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు ప్రజావాణి కి వచ్చిన దరఖాస్తులలో ఏ ఏ డిపార్ట్మెంట్ లో ఎన్ని రకాల దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

వాటిని త్వరగా పరిష్కరించాలన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు పాల్గొన్న అదనపు కలెక్టర్ సభావత్ మోతిలాల్, మంచిర్యాల బెల్లంపల్లి ఆర్డీవోలు హరికృష్ణ శ్రీనివాసరావు లు కూడా ప్రజల వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వాటిని పరిశీలించి సంబంధిత అధికారుల వద్దకు పంపించారు ఈ సందర్భంగా బెల్లంపల్లికి చెందిన కొలిపాక శ్రీనివాస్ అనే కాంగ్రెస్ పార్టీ నాయకుడు బెల్లంపల్లిలో జరుగుతున్న భూకబ్జాలపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. బెల్లంపల్లి మున్సిపల్ 34 వార్డులో కబ్జాల వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, మెయిన్ రోడ్డు షాపులు అద్దెకు ఇవ్వడం వల్ల దారి బంద్ అయిందని, మెయిన్ రోడ్ లోని రామటాక్స్ ముందు ప్రధాన దారిని కూడా కబ్జా చేశారని, అక్రమ నిర్మాణాలు నిర్మిస్తున్నారని వాటి పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇక జైపూర్ చెందిన ముదిగోల్ల లక్ష్మి అనే మహిళ తాను ఫ్యామిలీ ప్లానింగ్ చేసుకుంటే జైపూర్ శివారులో గల సర్వే నంబరు 781 లో ఒక ఎకరం భూమి ఇచ్చారని ఎంసీ వచ్చి మోకాపై చూపించిన తర్వాత గత పది సంవత్సరాల నుంచి కాస్తు చేసుకుంటున్నానని ఆ తర్వాత ఇతరులు వచ్చి ఇది మా పట్టా భూమి అని తీసుకున్నారని నేను ఎక్కడ తిరిగినా నాకు న్యాయం జరగడం లేదని నా భూమి రావడం లేదని తన భూమిని తన కిచ్చి న్యాయం చేయాలని కలెక్టర్ ను కోరింది. బెల్లంపల్లికి చెందిన ఎండి అఫ్సర్ ఖాన్ అనే కాంట్రాక్టు బస్తి కి చెందిన ఎండి అఫ్సర్ ఖాన్ తాను తనకు ఇన్కమ్ సర్టిఫికెట్ కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకున్నానని కొత్త రేషన్ కార్డు కూడా అప్లై చేశానని, తనకు ఇన్కమ్ సర్టిఫికెట్ వస్తేనే రేషన్ కార్డు వస్తుంది కాబట్టి తనకు ఇఆ సర్టిఫికెట్ ఇప్పిస్తానని బెల్లంపల్లి తహసిల్ కార్యాలయంలో కాంట్రాక్టు బేసిస్ పై పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ తనను సంప్రదించి 25 వేల రూపాయలు ఖర్చు అవుతాయని చెప్పారని, తనకు అంత ఆర్థిక స్తోమత లేదని తను డబ్బులు ఇవ్వలేనని అతనికి చెప్పగా నీకు ఇన్కమ్ సర్టిఫికేట్ జారీ కాకుండా చూస్తానని బెదిరింపుల గురి చేశాడని కావున ఈ విషయంపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కోరాడు. కాసిపేట మండలం పెద్దనపల్లి గ్రామానికి చెందిన కొక్కరి లక్ష్మి అనే మహిళ తనకు పెద్దనపల్లి శివారులో సర్వే నెంబరు 5/1/1/136 లో ఒక ఎకరం మూడు గంటల భూమిని గతంలో కొన్నానని కానీ నా పేరు పై పట్టా రాలేదని, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నేషనల్ హైవే 36 కోసం నా భూమి నుంచి 32 గంటల భూమిని తీసుకున్నారని నష్టపరిహారం ఇచ్చారని మిగతా 11 గంటల భూమికి తనకు పట్టా పాస్ బుక్ మంజూరు చేయాలని కోరింది. అలాగే జైపూర్ లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ఎక్స్ పాన్షన్ కోసం రియాబిలీడే షన్ అండ్ రీసెర్లమెంటు ఆ రెండు ఆర్ ప్యాకేజీ కింద పెద్దనపల్లి విలేజ్ లోని భూములను తీసుకున్నారని నష్టపరిహారం ఇవ్వాలని బాధితులు డి భాస్కర్ ఎం రాజా గౌడ్ రాజేందర్ రెడ్డి తదితరులు కోరారు. సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కు కూడా మా వినతి నీ పంపించడం జరిగిందని అయినా కూడా న్యాయం జరగలేదని వారు కలెక్టర్ తీసుకొచ్చారు.

# అన్ని రంగాల అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్



- **గ్రామాలలో మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టిన మంత్రి**

**చిగురుమామిడి, ఏప్రిల్ 21 (మనం న్యూస్):** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామంలో వెలసి ప్రసిద్ధిగాంచిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రాష్ట్ర రవాణా శాఖ,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ పెళ్లిరోజు సందర్భాన్ని పురస్కరించుకొని హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కంది తిరుపతిరెడ్డి,కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిటుమల్ల రవీందర్, అర్చకులు శేషం నవీన్ ఆచార్యులు మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ వారి సతీమణి పొన్నం మంజుల పెండ్లి రోజున పురస్కరించుకొని శ్రీ వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం మార్కెట్ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి,కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిటు మల్ల రవీందర్ సంయుక్తంగా మాట్లాడుతూ మంత్రి అనతి కాలంలోనే హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఇప్పటికే గ్రామాలలో మౌలిక సదుపాయాల కోసం సీసీ రోడ్లతో పాటు పాఠశాలల భవనాలకు ఈదులు కేటాయిస్తూ ఈ ప్రాంత అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని పేర్కొన్నారు హుస్నాబాద్ లో డిగ్రీ కళాశాల తో పాటు శాతవాహన యూనివర్సిటీ హాస్పిటల్ తదితర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని చెప్పారు తెలంగాణ కోసం పోరాటం లో కీలక పాత్ర పోషించిన మహా నాయకుడు అని చెప్పారు బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం పనిచేస్తున్న మంత్రి ఎల్లకాలం ఆయురారోగ్యాలతో వాళ్ళ కుటుంబ సభ్యులు ఉండాలని శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో కాంగ్రెస్ కార్యకర్తలు అందరూ కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు వారు చెప్పారు. ఈ ప్రత్యేక పూజ కార్యక్రమంలో,

కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఐరెడ్డి రెడ్డి సత్యనారాయణ రెడ్డి, హుస్నాబాద్ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ లు,వొరుగంటి భారతీదేవి, కుతుబుద్దీన్ , సుందరగిరి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఎనగందులలక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీజిల్లా నాయకులు చల్లేటి శంకరయ్య, మాజీ సర్పంచ్,శ్రీ మూర్తి రమేష్, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు షాబుద్దీన్, కక్కర్లరవీందర్, శ్రీనివాస్ రెడ్డి, కానవేణి శివ, అందే సురేష్ పచిమట్ల జగన్ , గందె రాజయ్య, జీల సంపత్, శ్రీ మూర్తి రాజు, శ్రీనివాస్, శ్రీరామోజు రాజ్ కుమార్, ఎలగందుల శివ, జీల శ్రీకాంత్ ,కొమ్ము సందీప్, బిక్షపతి ,లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే



**మెట్ పల్లి, ఏప్రిల్ 21 ( మనం న్యూస్):** ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను. మండలం లోని సత్తక్కపల్లె,మేడిపల్లి గ్రామాల లో సోమవారం. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మెట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. రైతులు శ్రమించి పండించిన పంటలను దళారులకు అమ్మి నష్టపోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మారు సాయి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మెట్ పల్లి పట్టణ మాజీ అధ్యక్షుడు కుతుబ్ పాషా, ఏఈఓ ,ఏపిఎం, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, బీఆర్ఎస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వడ దెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి



**మంచిర్యాల, ఏప్రిల్ 21(మనం న్యూస్):** జిల్లాలో మూడు విడతలలో తప్పిపోయిన పిల్లలకు గర్భవతులకు వ్యాక్సినేషన్ చేయడం జరుగుతుందని, ఇది ఏప్రిల్ నెలలో 21 వ తేదీ నుండి 26 వరకు, మే నెలలో 21 నుంఛి 26 వరకు, జూన్ నెలలో 23వ తారీకు నుంఛి 30 వ తారీఖు వరకు నిర్వహిస్తున్నట్లు మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్ రాజ్ తెలిపారు. మంచిర్యాల జిల్లాలో క్యాచ్ అప్ టీకాలు కార్యక్రమంలో భాగంగా సంజీవయ్య కాలనీలో మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్ రాజ్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సోమవార ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో 136 వ్యాక్సినేషన్ శిబిరాల ద్వారా 240 పిల్లలకు 41 మంది గర్భవతులకు టీకాలు ఇవ్వడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని, కమిషనర్ వైద్య ఆరోగ్యశాఖ ఆదేశానుసారము ఈ కార్యక్రమాన్ని డాక్టర్ ఎస్ అనిత ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, మరియు జిల్లా టీకా అధికారి ఆధ్వర్యంలో జరుగుతుందని తల్లిదండ్రులు పిల్లలకు సరైన సమయంలో టీకాలు ఇప్పించగలరని గర్భవతులు సరైన సమయంలో టీకాలు తీసుకోవాలని దీని ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. జిల్లాలో రెగ్యులర్ గా ప్రతి బుధవారము ఉపకేంద్రం పరిధిలో, ప్రతి శనివారము గ్రామాలలో వ్యాక్సినేషన్ చేయడం జరుగుతుందని, మన జిల్లాలో వ్యాక్సినేషన్ను పూర్తి చేసినామని, ఇతర ప్రాంతాల నుంఛి వచ్చేవారు, పనికి వచ్చేవారు, ఇతర ప్రాంతాల నుండి వచ్చే వారికి ఈ అవకాశాన్ని ఉపయోగించుకోగలరన్నారు . అదేవిధంగా జిల్లాలో ఎండల తీవ్రత పెరుగుతున్నందున జాగ్రత్తలు పాటించాలని వడ దెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా చిన్నపిల్లలు, గర్భవతులు, బాలింతలు, వయసు పైబడిన వారు షుగర్ వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు పడాలని, ఎండకు ఎలాంటి ప్రయాణాలు చేయరాదని, అదేవిధంగా బయటకు వెళ్లిన వారు టోపీ గాని, రుమాలు గానీ ధరించాలన్నారు . అదేవిధంగా స్వచ్ఛంద సంస్థలు కూడా జిల్లాలో చాలా ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం సంతోషకరమైన విషయమమని , వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ప్రతి గ్రామంలో ఓఆర్ఎస్ డిపోలు ఏర్పాటు చేయడం జరిగిందని , కాబట్టి ప్రజలు తమకు తాము జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివప్రతాప్, బుక్క వెంకటేశ్వర్ జిల్లా మాస్ మీడియా అధికారి, నాందేవ్, అల్లాడి శ్రీనివాస్, జగదీష్, లక్ష్మణస్వామి ,మూర్తి, ఆరోగ్య కేంద్రము పాత మంచిర్యాల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# పంట నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం ఇవ్వాలి



- **ఎంపీ ధర్మపురి అరవింద్**

**మెట్ పల్లి, ఏప్రిల్ 21 (మనం న్యూస్):** కోరుట్ల నియోజకవర్గంలోని మెట్ పల్లి డివిజన్. ఇబ్రహీంపట్నం మండలం కోజన్ కొత్తూరు గ్రామంలో. గత రెండు రోజుల క్రితం కురిసిన అకాల వడగండ్ల వర్షానికి. నష్టపోయిన పంటలను సోమవారం నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్. స్థానిక భారతీయ జనతా పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన క్షేత్రస్థాయిలో పంట నష్టం పై సత్వరమే సర్వే నిర్వహించి, నష్టపోయిన పంటకి ఎకరానికి 50వేల రూపాయలు నష్టపరిహారం అందజేయాలని కలెక్టర్ ద్వారా ప్రభుత్వాన్ని కోరినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట భారతీయ జనతా పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు డాక్టర్ యాదగిరి బాబు, భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ చిట్నేని రఘు తదితరులున్నారు.

# బిఐఎస్ మార్కు గల ఉత్పత్తులను మాత్రమే కొనుగోలు చేయాలి

- **మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల,ఏప్రిల్ 21( మనం న్యూస్):** ప్రతి ప్రతి వినియోగదారుడు నకిలీ ఉత్పత్తుల నుంచి రక్షణ కోసం బిఐఎస్ మార్కు గల ఉత్పత్తులను మాత్రమె కొనుగోలు చేయాలని, ప్రతి వినియోగదారుడు బిఐఎస్ కేర్ యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలని, ఈ యాప్ ద్వారా వెండి, బంగారు నగలు, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వస్తువులు బ్యూరో ఆఫ్ ప్రమాణాల ప్రకారము ఉన్నాయా లేవా అని తెలుసుకోవచ్చని, మోసాల బారి నుంచి బయట పడవచ్చని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ వినియోగదారులకు సూచిస్తూ కోరారు. సోమవారం నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయ కార్యాలయంలో జరిగిన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండరడ్స్ ( బిఐఎస్) క్వాలిటీ కనెక్ట్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ బి ఐ ఎస్ కు చెందిన వరల్ కన్స్యూమర్ రైట్స్ డే -2025 బ్రోచర్లను ఆవిష్కరించారు క్యాట్కో ప్రతినిధులు మాణిక్ మిత్ర బృందాలుగా ఏర్పడి తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బిఐఎస్ స్టాండరడ్స్ ను ప్రమోట్ చేస్తున్న కార్యక్రమం ఇది. గత కొన్ని రోజులుగా కొనసాగుతున్నది. అన్ని జిల్లాల్లో వివిధ శాఖలకు చెందిన ఆయా జిల్లాల్లో ఉన్న అధికారుల తో బిఐఎస్ క్వాలిటీ కనెక్టు కాంపెనింగ్ 7.0 ప్రోగ్రాం లో భాగంగా కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల జిల్లాలో కూడా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల్లో బిఐఎస్ సేవల గురించి మరింత అవగాహన పెంచుకోవడానికి ఇలాంటి సమావేశాలు ఉపయోగపడతాయని అన్నారు. గృహాలు, యువత మరియు ప్రభుత్వ అధికారులలో భారతీయ ప్రమాణాలు గురించి అవగాహన పెంచడం ఈ కార్యక్రఅమ అని, ఇది నాణ్యత మరియు భద్రత రోజువారి జీవితంలో అంతర్భాగంగా ఉండేలా చేస్తుందన్నారు. ఇంతకు ముందున్న ఐఎస్ఐ మార్కు బిఐఎస్ గా మారిందని, ప్రతి వినియోగదారుడు ఈ విషయాన్ని తెలుసుకోవాలని బిఐఎస్ కెర్ యాప్ ను డౌన్లోడ్ చేసుకొని తాము కొన్న బంగారము లేదా మొబైల్, గడియారము ఇలా అన్ని రకాల వస్తువుల నాణ్యత ప్రమాణాలను అందులో చెక్ చేసుకోవచ్చని, వాటి నాణ్యత ప్రమాణాలు ఉన్నాయా లేవా వాటికి సర్టిఫికెట్ ఉందా లేదా సరిచూసుకోవచ్చని, తద్వారా తాము కొన్న వస్తువుల నాణ్యత విషయంలో మోసపోవడం అనేది ఉండదని, ఒకవేళ మోసపోతే, తగు జాగ్రత్తలు తీసుకోవడానికి ఈ యాప్ ఉపయోగపడుతుందన్నారు.

ఈ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో పాటు అదనపు కలెక్టర్ మోతిలాల్, బిఎస్ఐ మంచిర్యాల జిల్లా ప్రతినిధి రాళ్ల బండి రాజన్న, జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ రాజు వేర్, ఆర్టీవో సంతోష్ కుమార్, ఆర్డీవోలు హరికృష్ణ శ్రీనివాసరావు, ఈ డి ఎస్ సి కార్పొరేషన్ దుర్గాప్రసాద్, లీడింగ్ బ్యాంకింగ్ మేనేజర్ కే తిరుపతి ఇతర అధికారులు. పాల్గొన్నారు.

# క్రీడా సామాగ్రి పంపిణీ

**వాజేడు, ఏప్రిల్ 21 (మనంన్యూస్):** ప్రభుత్వం విద్యార్థుల సమగ్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని పంపిణీ చేసిన క్రీడా సామాగ్రిని సద్వినియోగం చేసుకోవాలని వాజేడు మండల విద్యాధికారి తేజావత్ వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సోమవారం మండల పరిధిలో గల 50 పాఠశాలలకు క్రీడా సామాగ్రి కంపెనీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పిల్లలకు చదువుతోపాటు ఆటపాటలు కూడా ముఖ్యమని ప్రభుత్వం పిల్లల శారీరక అభివృద్ధి కోసం ప్రతి పాఠశాలకు క్రీడ సామాగ్రిని కొనుగోలు చేసేందుకు నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఆ నిధులతో మండలంలోని ప్రతి పాఠశాలకు కావలసిన నాణ్యమైన క్రీడా సామాగ్రిని తెప్పించి పంపిణీ చేయడం జరిగిందని వెంకటేశ్వరరావు అన్నారు. ఈ క్రీడా సామాగ్రిని ఉపాధ్యాయులు సక్రమంగా ఉపయోగించి విద్యార్థులు జిల్లా రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొని



పాఠశాలకు మండలానికి పేరు తెచ్చే విధంగా కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయునిపై ఉందని ఉపాధ్యాయులకు సూచించారు. వాజేడు మండలంలోని పాఠశాలలకు క్రీడా సామాగ్రినీ జిల్లా పరిషత్ మండల పరిషత్ కె జి బి గురుకుల, ఆశ్రమ అన్ని పాఠశాలలకు వివిధ క్రీడలకు సంబంధించిన క్రీడ సామాగ్రి అందిస్తున్నట్లు వెంకటేశ్వరరావు తెలి పారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠ శాలల ఉపాధ్యాయులు బోధ బోయిన శ్రీనివాస్ , భావ్‌సింగ్, ఇమ్రాన్, మనోజ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

# ఘనంగా విద్యాపీఠ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**కరీంనగర్ టౌన్,ఏప్రిల్21 (మనంన్యూస్) :** స్థానిక కరీంనగర్ లోని సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో విద్యాపీఠ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.కమిటీ సభ్యులు శ్రీ దీన్ దయాళ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.కమిటీ సభ్యులు గట్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొని ఆవిర్భావ నిధి సమర్పించారు.విద్యార్థుల కోలాటం అందరిని ఆనందింపచేసింది. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు బల్మూరి కరుణాకర్ రావు, కార్యదర్శి



ఇంజనీర్ కోల అన్నా రెడ్డి, సమితి అధ్యక్షులు డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, విభాగ్ కార్యదర్శి మేచినేని దేవేందర్ రావు, రాపర్తి శ్రీనివాస్, డాక్టర్ నాళ్ళ సత్య విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక చర్యలు

- **జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, ఏప్రిల్ 21(మనం న్యూస్):** ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, హరికృష్ణ లతో కలిసి అర్జీదారుల నుండి నుండి దరఖాస్తులు స్వీకరించారు. భీమిని మండలం చిన్నగుడిపేట గ్రామానికి చెందిన రెడ్డి స్వామి తన భూవివాదం విషయంలో తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. హాజీపూర్ మండలం నంనూర్ గ్రామానికి చెందిన ఆత్మకూరి అనూష తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి పట్టణం కాంట్రాక్టర్ బస్తీకి చెందిన ఎండి. అప్సర్ ఖాన్ బెల్లంపల్లి పట్టణంలోని ప్రభుత్వ భూములను అక్రమంగా విక్రయించడంతో పాటు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాసిపేట మండలం పెద్దనపల్లి గ్రామానికి చెందిన కొక్కర లక్ష్మి తాను గతంలో కొనుగోలు చేసిన భూమి నుండి జాతీయ రహదారి విస్తరణలో కొంత భూమి పోయిందని, మిగిలిన భూమికి పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. హాజీపూర్ మండలం ర్యాలీ గ్రామానికి చెందిన బియ్యాల శంకర్ తనకు గ్రామ శివారులో గల భూమికి సంబంధించి పట్టాదారు పాస్ పుస్తకం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జన్నారం మండల కేంద్రానికి చెందిన ఎస్. అంజయ్య తనకు గ్రామ శివారులో పట్టా భూమి ఉందని, ఇట్టి భూమి నిషేధిత జాబితాలో చేర్చబడిందని, సవరించి తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు.



మందమర్రి పట్టణంలోని విద్యానగర్కు చెందిన ఆవుల నిర్మల తన తండ్రికి హాజీపూర్ మండలం వేంపల్లి శివారులో లావుని పట్టా భూమి ఉందని, ఆన్లైన్ రికార్డులలో ఇతరుల వివరాలు చూపుతున్నాయని, ఈ విషయంపై విచారించి తన తండ్రి మరణించినందున ఇట్టి భూమిని తన పేరిట విరాసత్ చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మందమర్రి మండలం ఊరు మందమర్రి గ్రామానికి చెందిన మెరుగు పోసు తనకు వంశ పారంపర్యంగా సంక్రమించిన భూమికి సంబంధించి హద్దులు నిర్ణయించాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నామని, ఇట్టి భూమికి సంబంధించి హైకోర్టు నందు కేసు కొనసాగుతుందని, భూమి హద్దులు సమర్పించవలసి ఉన్నందున త్వరగా హద్దులు నిర్ణయించి ఇవ్వగలరని కోరుతూ దరఖాస్తు అందజేశారు. అనంతరం బి.ఐ.ఎస్. కేర్ యాప్కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అన్ని ప్రభుత్వ శాఖలు మార్కెట్ లోని ఉత్పత్తులు, బి.ఐ.ఎస్. ప్రమాణాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఉత్పత్తుల నాణ్యత ప్రాముఖ్యత గురించి తెలిసి ఉండాలని, ఉత్పత్తుల నాణ్యత ప్రమాణాలను తెలుసుకునేందుకు కేర్ యాప్ ఉపయోగపడుతుందని, ప్లే స్టోర్ ద్వారా యాప్ ను డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ యాప్ ద్వారా ఉత్పత్తి ప్రామాణికత, లైసెన్స్ గడువు, లైసెన్సారుని వివరాలు తెలుసుకోవచ్చని, హెచ్.యు.ఐ.డి. హాల్ మార్క్ గల ఆభరణాల ప్రామాణికత తెలుస్తుందని తెలిపారు. వినియోగదారులు తాము కొనుగోలు చేసే వస్తువుల విషయంలో బి.ఐ.ఎస్. యాప్ ద్వారా సరైన వాటిని కొనుగోలు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.ఐ.ఎస్. జిల్లా ప్రతినిధి రాళ్ళబండి రాజన్న, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ధన్ బాద్ లోని సీఎంపిఎఫ్ ఆఫీస్ ఎదుట రిటైర్డ్ బొగ్గు కార్మికులు నిరసన




**మంచిర్యాల,ఏప్రిల్ 21 (మనం న్యూస్):** ధన్ బాద్ లోని సీఎంపిఎఫ్ సీఎంపిఎఫ్ ప్రధాన కార్యాలయం ముందు రిటైర్డ్ కోల్ మైన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం రిటైర్డ్ బొగ్గు కార్మికులు నిరసన తెలిపారు .బిసిసిఎల్ జోన్ ముందు ప్రదర్శన చేసి బొగ్గు కార్యదర్శి అండ్ బిఓటి ఛైర్మన్కు ఒక మెమోరాండం ఇచ్చారు . ఈ సందర్భంగా ప్రదర్శనకారులను ఉద్దేశించి యూనియన్ ప్రధాన కార్యదర్శి బిందేశ్వరి ప్రసాద్ మాట్లాడుతూ, 1998 నుంచి సిఐఎల్లో పెన్షన్ పథకం అమలులో ఉందని, కానీ నేటికీ వేలాది మంది రిటైర్డ్ బొగ్గు కార్మికులకు వెయ్యి రూపాయల కంటే తక్కువ పెన్షన్ లభిస్తోందని ఈ పింఛనును సవరించాలన్నారు . బిఓటిలో యూనియన్ ప్రాతినిధ్యం కూడా ఉండాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ప్రదర్శనకారులను ఉద్దేశించి ఇతర నాయకులు శ్రీమతి రేఖా బోస్, శ్రవణ్ కుమార్, రంజాన్ మియాన్, హరిపాడ్ రావణి, చిమన్, ఓపీ విశ్వకర్మ, అశోక్ సిన్హా, అరుణ్ కుమార్, రామావతార్ గోప్, భూపేంద్ర సింగ్, శ్రీకాంత్ పాండే, ప్రకాష్ కుమార్, ఎస్ఎన్ పాండే తదితరులు ప్రసంగించారు. కార్యక్రమానికి రాంశంకర్ ఉమే చంద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పట్టిన ప్రధాన డిమాండ్ల లో లక్ష కోట్ల అక్రమ రవాణాపై సీబీఐ విచారణ జరపాలని, డిఎచ్ ఎఫ్ ఎల్ లో 727 కోట్ల రూపాయల కుంభకోణం, పెన్షన్ లెక్కింపులో ఎస్ డి ఏ ను జోడించాలని, సవరించిన పిపిఓ ని వీలైనంత త్వరగా ఇవ్వాలని, కనీస పెన్షన్ 5 వేలు చేయాలని కోరుతూ వినతి పత్రం ఇచ్చారు .

# పెండింగ్ భూ సమస్యలకు భూ భారతితో మోక్షం

- కొత్త చట్టంలో అప్పీలు వ్యవస్థ
30 రోజుల్లో మ్యూటేషన్
- దరఖాస్తుల పరిష్కారం
- రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
- చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం





**గంగాధర, ఏప్రిల్ 21, (మనం న్యూస్):** ధరణి కారణంగా యేండ్ల తరబడి పెండింగ్ లో ఉన్న రైతు భూ సమస్యలకు భూ భారతి చట్టం ద్వారా మోక్షం కలగనుందని చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం అన్నారు. సోమవారం గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలోని ఎస్.ఆర్. ఎల్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన భూ భారతి నూతన ఆర్ఓఆర్ చట్టంపై అవగాహన కార్యక్రమానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి చట్టం రైతుల పాలిట శాపంగా మారిందని అన్నారు. ఏ తప్పూ చేయకుండానే రైతులను, అధికారులను ధరణి దోషులుగా నిలబెట్టిందని పేర్కొన్నారు. ధరణి చట్టంలోని లోపాలు రైతులు, అధికారుల మధ్య గొడవలు సృష్టించేలా చేశాయని, రైతులను ఆత్మహత్యలకు ఉసిగొల్పాయని అన్నారు. రైతుల పాలిట శాపంగా మారిన ధరణిని తొలగిస్తామని ఎన్నికలకు ముందు తమ పార్టీ మాట ఇచ్చిందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఎంతోమంది మేధావులు, రాజకీయ నాయకులు, రైతు సంఘాల నాయకులు, అధికారులతో చర్చించి మెరుగైన ఆర్ఓఆర్ చట్టాన్ని రూపొందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారని తెలిపారు. వారి సూచనలు, సలహాలు మేరకు భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి భూ భారతి చట్టాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని వివరించారు. ఈ చట్టం ద్వారా పేరుకుపోయిన భూ సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని అన్నారు. భూ భారతి చట్టంలో అప్పీలు వ్యవస్థ ఉండడం ద్వారా రైతులు అన్ని స్థాయిల్లో ఉన్న అధికారులకు అప్పీలు చేసుకోవచ్చని అన్నారు. కోర్టుల చుట్టూ తిరగాల్సిన పనిలేదని చెప్పారు. వారసత్వ భూముల మ్యూటేషన్ కు ఈ చట్టంలో సత్వర పరిష్కారం లభిస్తుందని అన్నారు. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.72 వేల కోట్ల రుణమాఫీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తమ ప్రభుత్వం సుమారు రూ.21 వేల కోట్ల రైతు రుణమాఫీ చేసి, దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు.

గత ప్రభుత్వం వరి వేయొద్దని హెచ్చరిస్తే తమ ప్రభుత్వం వరిని ప్రోత్సహించడంతోపాటు సన్న వడ్లను పండించే రైతుకు క్వింటాలకు రూ.500 బోనస్ కూడా ఇస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. చొప్పదండి నియోజకవర్గం పరిధిలోని బోయిన్ పల్లి కుడి, కాల్వ ఎడమ కాలువలో నీటిపారుదల వ్యవస్థకు కృత నిశ్చయంతో ఉన్నామని తెలిపారు. నారాయణపూర్ జలాశయ పరిధిలో భూమి కోల్పోయిన వారికి త్వరలో నష్టపరిహారం జమ అవుతుందని అన్నారు. ప్రజల, రైతుల సంక్షేమ తమ ప్రభుత్వ ధ్యేయంగా చెప్పారు.

**భూ భారతితో రైతాంగ సమస్యలకు సత్వర పరిష్కారం: కలెక్టర్ సత్పతి**

తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టంతో రైతాంగ సమస్యలు సత్వరమే పరిష్కారం అయ్యేందుకు మార్గం సుగమమైందని కలెక్టర్ సత్పతి పేర్కొన్నారు. ధరణిలోని పొరపాట్లని సవరించేందుకు కలెక్టర్ కి మినహా ఏ అధికారికీ అవకాశం లేదని చెప్పారు. దీనివల్ల తాసిల్దార్ స్థాయిలో పరిష్కారమయ్యే చిన్న సమస్యలు కూడా వేల సంఖ్యలో పేరుకుపోయేవని అన్నారు. తాను విధుల్లో చేరేటప్పుడు 11 వేల భూ సమస్యల దరఖాస్తులు పెండింగ్లో ఉండేవని అన్నారు. చిన్న చిన్న సమస్యలు కూడా తహసిల్దార్లు, ఆర్డీవోలు పరిష్కరించలేని పరిస్థితి ఉండేదని పేర్కొన్నారు. ఆరు నెలల క్రితం ప్రభుత్వం అధికారాలను విభజించడం వల్ల ప్రస్తుతం 2300 దరఖాస్తులు మాత్రమే పెండింగ్లో ఉన్నాయని, వీటిని కూడా త్వరలోనే పరిష్కరిస్తామని అన్నారు. భూ భారతి చట్టం ద్వారా ప్రభుత్వం భూ సమస్యలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చిందని తెలిపారు. ఈ చట్టం ద్వారా పొరపాట్ల సవరణకు అవకాశం ఉందని, మ్యూటేషన్ దరఖాస్తులు త్వరితగతిన పరిష్కారం అవుతాయని తెలిపారు. పెండింగ్లో ఉన్న సాదా బైనామా దరఖాస్తులకు కూడా మోక్షం కలగనుందని అన్నారు. రెండింతల అప్పిలు వ్యవస్థతో రైతులు, ప్రజలు భూ సమస్యలపై కోర్టు వరకు వెళ్లవలసిన అవసరం దాదాపు ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఆర్డీవో మహేశ్వర్, తహసిల్దార్ అనుపమ, ఎంపీడీవో రాము, రైతులు పాల్గొన్నారు.

## ఉద్యమ స్ఫూర్తితో కదలిరండి

- గత పదేళ్ల సుపరిపాలన
- హామీల అమలులో హస్తం విఫలం
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గవ్వ వంశీధర్ రెడ్డి



**కోహెడ,ఏప్రిల్ 21,(మనం న్యూస్):** 27 న వరంగల్ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం ఎల్కతుర్తిలో నిర్వహించబోయే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఉద్యమ స్ఫూర్తితో కదలివచ్చి జయప్రదం చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గవ్వ వంశీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ రజతోత్సవ పోస్టర్‌ను బీఆర్ఎస్ నాయకులతో కలిసి సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గవ్వ వంశీధర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ పదేళ్లపాటు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించి దేశంలోనే తెలంగాణను నంబర్ వన్‌గా నిలిపారని కొనియాడారు. ప్రజలకు తమకు ఇచ్చిన ప్రతిపక్ష హోదాను సమర్థవంతంగా నిర్వహిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ తప్పుడు విధానాల పై పోరాడుతున్నామన్నారు. రజతోత్సవ సభ మన హుస్నాబాద్ నియోజకవర్గంలోనే నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పెట్టిన హామీల అమలులోనూ పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలను రజతోత్సవ సభలో కేసీఆర్ ప్రజలకు వివరించి చైతన్యపరచనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తిప్పారపు నాగరాజు, మాజీ సర్పంచ్ లు తోట ఆంజనేయులు, లోనే మల్లేశం, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు యాద ఆశోక్, చింతలపల్లి తిరుపతిరెడ్డి, పిల్లి సంపత్, బబ్బురు శ్రీనివాస్ గౌడ్, మంద సురేష్, పిడిశెట్టి రాజు, పోలవేని కుమారస్వామి, ఎం.డీ.ఓ.వైస్., పెద్ద తిరుపతిరెడ్డి, తిప్పరవేని భాస్కర్, గాలిపల్లి బాబు, కొనవేని బాలకిషన్, చింతలపల్లి సుధాకర్ రెడ్డి, రమేష్, కల్లికోట రాహుల్ చారి, తదితరులున్నారు.

## భూ భారతితో రైతుల సమస్యలు పరిష్కారం

- భూ సమస్యలుంటే పోర్టల్ లో దరఖాస్తు చేసుకోవాలి
- సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి
- భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన



**మిరుదొడ్డి, ఏప్రిల్ 21, (మనం న్యూస్) :** భూ భారతిలో రైతుల భూ సమస్యలకు త్వరగా పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. సోమవారం మిరుదొడ్డి మండల కేంద్రంలోని రైతు వేదికలో భూ భారతి చట్టం గురించి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఆర్.ఓ.ఆర్. 2025 చట్టంతో ఎంతో మంది రైతులకు మేలు చేకూరుతుందన్నారు. రైతులు ఎన్నో సంవత్సరాలుగా భూ సమస్యల పరిష్కారానికి అధికారుల చుట్టూ, కోర్టుల చుట్టూ తిరుగుతూ డబ్బులు, సమయాన్ని వృధా చేసుకోవడమే తప్ప సమస్యల పరిష్కారం కాక రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రస్తుతం భూ భారతి చట్టం ద్వారా చేకూరే ప్రయోజనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమస్యలున్న రైతులు చట్టం అమలులోకి వచ్చిన ఏడాది కాలంలోపు భూ భారతి పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ చట్టం ప్రకారం భూ సంబంధిత సమస్యను బట్టి తహసీల్దార్, రెవెన్యూ డివిజన్ అధికారి రెండంచెలలో నిర్దిష్ట గడువులోపు పరిష్కరించడం జరుగుతుందన్నారు. సమస్య పరిష్కారం కాకుంటే కొత్తగా ఏర్పాటు చేసిన ట్రిబ్యునల్ ను కూడా ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. అనంతరం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కారానికై భూ భారతి పోర్టల్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పెండింగ్ లో ఉన్న సాదాబైనామాల కోసం భూ భారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అబ్దుల్ హమీద్, ఆర్డీఓ సదానందం, తహసీల్దార్ ఉదయశ్రీ, స్పెషల్ ఆఫీసర్ గణేష్, ఎంపిడిఓ గణేష్ రెడ్డి, వ్యవసాయ అధికారి మల్లేశం, డిప్యూటీ తహసీల్దార్ సందీప్ తోపాటు రెవెన్యూ సిబ్బంది, వ్యవసాయ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక చర్యలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ఏప్రిల్ 21 మనం ప్రతినిధి:** ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, హరికృష్ణ లతో కలిసి అర్జీదారుల నుండి నుండి దరఖాస్తులు స్వీకరించారు. భీమిని మండలం చిన్నగుడిపేట గ్రామానికి చెందిన రెడ్డి స్వామి తన భూవివాదం విషయంలో తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. హాజీపూర్ మండలం నంనూర్ గ్రామానికి చెందిన ఆత్మకూరి అనూష తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి పట్టణం కాంట్రాక్టర్ బస్తీకి చెందిన ఎండి. అప్సర్ ఖాన్ బెల్లంపల్లి పట్టణంలోని ప్రభుత్వ భూములను అక్రమంగా విక్రయించడంతో పాటు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాసిపేట మండలం పెద్దనపల్లి గ్రామానికి చెందిన కొక్కర లక్ష్మి తాను గతంలో కొనుగోలు చేసిన భూమి నుండి జాతీయ రహదారి విస్తరణలో కొంత భూమి పోయిందని, మిగిలిన భూమికి పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. హాజీపూర్ మండలం ర్యాలీ గ్రామానికి చెందిన బియ్యాల శంకర్ తనకు గ్రామ శివారులో గల భూమికి సంబంధించి పట్టాదారు పాస్ పుస్తకం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జన్నారం మండల కేంద్రానికి చెందిన ఎస్. అంజయ్య తనకు గ్రామ శివారులో పట్టా భూమి ఉందని, ఇట్టి భూమి నిషేధిత జాబితాలో చేర్చబడిందని, సవరించి తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మందమర్రి పట్టణంలోని విద్యానగర్కు చెందిన ఆవుల నిర్మల తన తండ్రికి హాజీపూర్ మండలం వేంపల్లి శివారులో లావుని పట్టా భూమి ఉందని, ఆన్లైన్ రికార్డులలో ఇతరుల వివరాలు చూపుతున్నాయని, ఈ విషయంపై విచారించి తన తండ్రి మరణించినందున ఇట్టి భూమిని తన పేరిట విరాసత్ చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మందమర్రి మండలం ఊరు మందమర్రి గ్రామానికి చెందిన మెరుగు పోసు తనకు వంశ పారంపర్యంగా సంక్రమించిన భూమికి సంబంధించి హద్దులు నిర్ణయించాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నామని, ఇట్టి భూమికి సంబంధించి హైకోర్టు నందు కేసు కొనసాగుతుందని, భూమి హద్దులు సమర్పించవలసి ఉన్నందున త్వరగా హద్దులు నిర్ణయించి ఇవ్వగలరని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం బి.ఐ.ఎస్. కేర్ యాప్కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

అన్ని ప్రభుత్వ శాఖలు మార్కెట్ లోని ఉత్పత్తులు, బి.ఐ.ఎస్. ప్రమాణాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఉత్పత్తుల నాణ్యత ప్రాముఖ్యత గురించి తెలిసి ఉండాలని, ఉత్పత్తుల నాణ్యత ప్రమాణాలను తెలుసుకునేందుకు కేర్ యాప్ ఉపయోగ పడుతుందని, ప్లే స్టోర్ ద్వారా యాప్ ను డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

ఈ యాప్ ద్వారా ఉత్పత్తి ప్రామాణికత, లైసెన్స్ గడువు, లైసెన్సారుని వివరాలు తెలుసుకోవచ్చని, హెచ్.యు.ఐ.డి. హాల్ మార్క్ గల ఆభరణాల ప్రామాణికత తెలుస్తుందని తెలిపారు. వినియోగదారులు తాము కొనుగోలు చేసే వస్తువుల విషయంలో బి.ఐ.ఎస్. యాప్ ద్వారా సరైన వాటిని కొనుగోలు చేయవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో బి.ఐ.ఎస్. జిల్లా ప్రతినిధి రాళ్ళబండి రాజన్న, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ కుటుంబానికి పోలీస్ శాఖ చేయూత

- పోలీస్ శాఖ భద్రత నుండి రూ.16 లక్షలు అందజేత
- పోలీస్ కమీషనర్ డా. బి. అనురాధ



**సిద్దిపేట, ఏప్రిల్ 21, (మనం ప్రతినిధి):** శాంతిభద్రతల పరిరక్షణలో నిత్యం ప్రజల కోసం విధులు నిర్వహించే పోలీసుల కుటుంబాలకు పోలీస్ శాఖ అండగా ఉంటుందని సిద్దిపేట పోలీస్ కమీషనర్ డా. బి. అనురాధ తెలిపారు. 2024 నవంబర్ నెలలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ నవీన్ కుటుంబానికి పోలీస్ శాఖ భద్రత నుండి వచ్చిన రూ.16 లక్షల చెక్కును వారి కుటుంబ సభ్యులకు సీపీ సోమవారం నాడు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో మరణించిన కానిస్టేబుల్ నవీన్ కుటుంబానికి పోలీస్ శాఖ భద్రత స్కీమ్ ఎంతగానో ఆసరాగా నిలుస్తుందన్నారు. విధి నిర్వహణలో మృతి చెందిన పోలీస్ కుటంబ సభ్యులకు పోలీస్ శాఖ ఎప్పుడూ అండగా ఉంటుందని, నవీన్ కుటుంబానికి పోలీస్ శాఖ నుండి రావాల్సిన మరిన్ని బెనిఫిట్స్ త్వరలోనే అందజేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ యాదమ్మ, సూపరిండెంట్ ఎం.డి. ఫయాజుద్దీన్, రాష్ట్ర పోలీస్ సంఘం ఉపాధ్యక్షులు రవిందర్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రవి రాజు తదితరులు పాల్గొన్నారు.

## కొండపాక మార్కెట్ కమిటీ చైర్మన్‌గా విరుపాక శ్రీనివాసరెడ్డి



**కొండపాక, ఏప్రిల్ 21, (మనం న్యూస్) :** కొండపాక మార్కెట్ కమిటీ పాలకవర్గానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో సోమవారం కొండపాక మార్కెట్ కమిటీ కార్యాలయంలో కమిటీ పాలకవర్గం బాధ్యతలు స్వీకరించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గా విరుపాక శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ గా బట్ట పరశురాములు, డైరెక్టర్లుగా శివలింగ కృష్ణమూర్తి , రెడ్డమైన రవీందర్, నాగపురి సుజాత , అంబటి రాజు, చుక్క యాదయ్య , మహమ్మద్ తాళ్లపల్లి అంజయ్య, కొమ్ము మల్లికార్జున్, శిలసాగరం శ్రీనివాస్, వడ్లకొండ రాజు, పెరుగు తిరుపతి, వడ్లకొండ శ్రీనివాస్ లతో పాటు మరో నలుగురు ఎక్స్ ఆఫీసియో మెంబర్లతో పాలకవర్గాన్ని ఏర్పాటు చేయడంతో చైర్మన్ వైస్ చైర్మన్, డైరెక్టర్లు సోమవారం అధికారికంగా రిజిస్టర్లో సంతకం చేసి బాధ్యతలు స్వీకరించారు. మార్కెట్ కమిటీ కార్యదర్శి పరమేశ్వర్ వారికి బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, నాయకులు లింగారావు, సురేందర్ రావు, వెంకట్ రెడ్డి,రెడ్డమైన రవీందర్,తుం శ్రీకాంత్ రెడ్డి,ఉపేందర్ పలు గ్రామాల కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

**రైతు సంక్షేమ ప్రభుత్వం**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డి అన్నారు. కొత్త పాలకవర్గం ఏర్పాటు సందర్భంగా పాలకవర్గానికి అభినందనలు తెలిపి మాట్లాడారు. పాలకవర్గం రైతులకు మేలు చేసే విధంగా పనిచేయాలని సూచించారు. గత ప్రభుత్వం మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని పది సంవత్సరాలపాటు నియమించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. రైతులకు నేను చేసే విధంగా పనిచేసి మన్ననలు పొందాలన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**బోధన్ ఏప్రిల్ 21(మనం న్యూస్):** బోధన్ మండలం ఎరాజ్ పల్లి ప్రభుత్వ పాఠశాలలో 1992-93 సంవత్సరంలో 7వ తరగతి చదివిన విద్యార్థినీ విద్యార్థులు సోమవారం వారి క్లాస్ మెంట్ చంద్రకాంత్ రెడ్డి నివాస గృహంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు.చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ మరిచిపోలేని సన్నివేశాలను నెమరు వేసుకున్నారు.ఉద్యోగరీత్యా,వివాహాలు చేసుకుని దూర ప్రాంతాలలో సైతం స్థిరపడినప్పటికీ తన చిన్ననాటి తరగతిలో చదువును అభ్యసించిన సన్నివేశాలు,చిలిపి చేష్టలు చేసుకున్న సందర్భాలను తెలియపరచుకొని సంతోషకరమైన వాతావరణాన్ని నెలకొల్పారు.33 సంవత్సరాల సుదీర్ఘకాలం తర్వాత విద్యార్థిని విద్యార్థులు ఒక దగ్గరికి చేరుకొని ఆత్మీయతను పంచుకున్నారు.సహపంక్తి భోజనాలు చేశారు.కేకులు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.ఎవరు ఏ స్థాయిలో స్థిరపడినప్పటికీ ఒకరికి ఒకరం సోదరా భావంతో ఉంటూ సహాయ సహకారాలు చేసుకుంటూ తోడునీడగా ఉందామన్న సంకల్పం వారి ఆత్మీయతలో కళ్ళకు కట్టింది.వారి చిన్ననాటి జ్ఞాపకాలు అందరినీ మైమరిపించాయి.ఈ కార్యక్రమంలో ఎరాజ్ పల్లి ఏడవ తరగతి విద్యార్థినీ విద్యార్థులు,వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం సంచార కులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



**మంచిర్యాల,ఏప్రిల్ 21(మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంచార కులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మంచిర్యాల జిల్లా సంచార జాతుల సంక్షేమ సంఘం, జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేసారు. సోమవారం మంచిర్యాల పట్టణంలోని బెల్లంపల్లి చౌరస్తా వద్ద జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర జనాభాలో బీసీలు 50.6 శాతం ఉంటే అందులో దాదాపు 10 శాతం జనాభా సంచార జాతుల వారు ఉన్నారన్నారు .

ఈ సంచార జాతులకులాల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నదని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలలో ఉన్న కొన్ని కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం జరిగిందని, దానిని స్వాగతిస్తూనే విద్య ఉద్యోగ ఆర్థిక రాజకీయ రంగాలలో అట్టడుగు స్థానాలలో ఉన్న కులాలైన సంచార జాతుల్లో ఉన్న ఈ కులాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నామని, ఈ డిమాండ్ లో భాగంగా సంచార కులాల కు కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రత్యేకంగా 5 వేల కోట్ల బడ్జెట్ ను విడుదల చేయాలని, అలాగే సంచార కులాలకు ప్రత్యేకంగా చైర్మన్ ను ఏర్పాటు చేయాలని, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో దాదాపు 50 కి పైగా సంచార కులాలు ఎలాంటి అభివృద్ధికి నోచుకోకపోవడం బాధాకరమని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నామని గొప్పలు చెప్పుకున్నా, సంచార కులాల వారికి ఎలాంటి ఫలాలు చెందడం లేదని, అవన్నీ పక్కదారి పడుతున్నాయని, కాబట్టి ప్రభుత్వాలు సంచార కులాల పై ప్రత్యేక దృష్టి సారించి సంచార కులాల అభివృద్ధికి దోహదపడాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సంచార జాతుల సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వైద్య భాస్కర్, జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గుమ్మల శ్రీనివాస్, బీసీ నాయకులు శాఖ పూరి భీమ్సేన్ శ్రీపతి రాములు కొత్తకొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి దోహదం

- సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి



**సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 21, (మనం న్యూస్):** ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదుదారుల నుంచి జిల్లా కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి పలువురు అర్జిదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణిలో భూ సంబంధిత, హౌసింగ్, ఆసరా పింఛన్ల, ఇతర అర్జిలు మొత్తం 44 అర్జీలు స్వీకరించారు. అర్జిదారులకు న్యాయం చేసి తిరిగి అర్జి పెట్టుకోకుండా పని చెయ్యాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, ఏఓ అబ్దుల్ రహమాన్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యువతకు ఉపాధి కల్పన కోసం మూడంచెల వ్యూహం అమలు

## డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు

- 100కు పైగా కంపెనీలలో 5 వేల ఉద్యోగ అవకాశాలు కల్పించేలా మెగా జాబ్ మేళా నిర్వహణ
- త్వరలో 30 వేల ప్రభుత్వ ఉద్యోగాల కల్పనకు కసరత్తు
- 9 వేల కోట్ల రూపాయలతో రాజీవ్ యువ వికాసం కింద స్వయం ఉపాధి ప్రోత్సాహం
- యువత మత్తు పదార్థాలు, సంఘ విద్రోహ శక్తులకు దూరంగా ఉండాలి
- జాబ్ మేళా కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సిఎం



**మధిర, ఏప్రిల్ 21(మనం న్యూస్):** కోరి తెచ్చుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పన కోసం ప్రజా ప్రభుత్వం మూడంచెల వ్యూహం అమలు చేస్తుందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. 5 వేల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో మధిర పట్టణంలోని రెడ్డి గార్డెన్స్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ ఉద్యోగ మేళాలో 100కు పైగా కంపెనీలు పాల్గొని, 5 వేల మందికి ఉద్యోగాలు ఇవ్వడానికి కంపెనీ ప్రతినిధులు ముందుకు వచ్చారని, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యువత అనేక ఆశలతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో పాల్గొందని, పదేళ్ల వరకు పాలకులు యువత ను నిర్లక్ష్యం చేశారని, యువతకు ఉపాధి అవకాశాలు చూపించడంలో వైఫల్యం చెందారని అన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం మూడంచెల వ్యూహం అమలు చేస్తుందని అన్నారు. ఇందులో భాగంగా మొదట పబ్లిక్ సర్వీస్ కమీషన్ ప్రక్షాళన చేసి జాబ్ కేలండర్ విడుదల చేసామన్నారు. మొదటి దశలో ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డ మొదటి సంవత్సరంలోనే ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న 56 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, త్వరలోనే మరో 30 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి కసరత్తు జరుగుతుందని అన్నారు. రెండవ దశలో ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న గ్లోబలైజేషన్ లో భాగంగా వస్తున్న మార్పులను అలవర్చుకొని బహుళ జాతుల సంస్థలకు రాష్ట్రంలో అవసరమైన వనరులు కల్పించి భారీ ఎత్తున పెట్టుబడులు, వీటి ద్వారా యువతకు లక్షల్లో ఉద్యోగ అవకాశాలు సాధిస్తున్నామని అన్నారు. మూడవ దశలో ఉపాధిని ప్రోత్సహించేందుకు 9 వేల కోట్ల పెట్టుబడితో రాజీవ్ యువ వికాసం పథకం కింద యువతకు రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2 నాడు స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు మంజూరు పత్రాలు పంపిణీ చేయనున్నామని తెలిపారు. స్వయం ఉపాధి కోసం ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా భారీగా నిధులు కేటాయించామని అన్నారు. చదువు పూర్తి చేసుకున్న వారు ఖాళీగా ఉండకుండా, సొంత ఆదాయంతో ముందడుగు వేసేందుకు జాబ్ మేళాలు ఉపయోగపడతాయని, ఇక్కడ ఉద్యోగం పొందిన వారు ఇక్కడితోనే ఆగిపోకుండా ఇది మొదటి మెట్టుగా భావించి వచ్చిన జీతంతో వారి జీవితంలో పెట్టుకున్న గొప్ప లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ జాబ్ మేళా ద్వారా ఒకే రోజు 5 వేల మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. యువత రాష్ట్రానికి గొప్ప వనరు అని, రాష్ట్ర జిడిపి పెరుగుదలకు, కుటుంబ బాగు కోసం, సమాజానికి పెద్ద ఎత్తున యువత ఉపయోగపడాలని ఆయన ఆకాంక్షించారు. ఖాళీగా ఉండే యువత సంఘ విద్రోహ శక్తులకు, మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉండాలని, చివరి వయసులో తల్లిదండ్రులను బాధపడకుండా చూసుకోవాలని, యువత సన్మార్గంలో నడిచేందుకు జాబ్ మేళాలు ఉపయోగపడతాయని అన్నారు. రాష్ట్రంలోని యువతకు అవసరమైన స్కిల్ అందించేందుకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 65 ఐటిఐ కళాశాలలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ గా అప్ గ్రేడ్ చేసిందని అన్నారు. నిరుపేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందించాలనే ఆలోచనతో 60 యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్ నిర్మాణానికి ఒకేసారి 11 వేల 600 కోట్ల నిధులను కేటాయించిందని అన్నారు. ఈ పాఠశాలల ద్వారా నాలుగో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు నాణ్యమైన విద్య ఉచితంగా అందుబాటులోకి వస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను అప్ గ్రేడ్ చేసి అన్ని వసతులు కల్పిస్తున్నామని అన్నారు.

కార్యక్రమంలో ఇంచార్జీ కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ జీవితంలో విజయం సాధించేందుకు మనపై నమ్మకం ఉండడం చాలా ముఖ్యమని, చిన్న ఉద్యోగమైనా మనం చేరితే మనలో విశ్వాసం పెరుగుతుందని, ఉన్నత స్థాయికి చేరుకోవడానికి ఇది తోడ్పాటు అందిస్తుందని అన్నారు. యువతకు వచ్చిన అవకాశాలను సంపూర్ణంగా వినియోగించుకోవాలని, జాబ్ మేళాలో వచ్చిన ఉద్యోగాల్లో ఎటువంటి సమస్య వచ్చినా అవసరమైన సహకారం జిల్లా యంత్రాంగం నుంచి అందిస్తామని అన్నారు. మేగా జాబ్ మేళా నిర్వహణలో సహకరించిన డిప్యూటీ సీఎంకు ఇంచార్జి కలెక్టర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మెగా ఉద్యోగ మేళాలో సింగరేణి జనరల్ మేనేజర్ సాలెం రాజు, వివిధ కంపెనీల ప్రతినిధులు, యువత, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సౌత్ సెంట్రల్ రైల్వే డిఆర్ఎంకు అఖిలపక్షం వినతి



**మధిర, ఏప్రిల్ 21(మనం న్యూస్):** మధిర రైల్వే స్టేషన్ కు రైల్వే ట్రాక్, స్టేషన్ లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించేందుకు విచ్చేసిన సౌత్ సెంట్రల్ రైల్వే డి ఆర్ ఎం ను సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, నిధుమనూరు వంశీ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అద్దంకి రవి కాంగ్రెస్ నాయకులు మునుగోటి వెంకటేశ్వర్లు, కర్నాటి రామారావు సిపిఎం మండల, పట్టణ కార్యదర్శులు మంద సైదులు, పడకంటి మురళి ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రాన్ని అందచేశారు. మధిరలో ఆర్ యు బి నిర్మించే వరకు రైల్వే గేటుదగ్గర నడకదారిని కొనసాగించాలని, గతంలో ఆగిన గౌతమి, సింహపురి రైళ్లను తిరిగి ఆపాలని, మధిర ప్రజల దశబ్దాలుగా అడుగుతున్న నవజీవన్, లక్నో రైళ్లు మధిర రైల్వే స్టేషన్ లో ఆగేలా అనుమతులను ఇవ్వవలసిందిగా వినతి పత్రాన్ని అందజేశారు.

## నూతన తహశీల్దారుగా ఆర్.శారద



**గార్ల, ఏప్రిల్ 21(మనం న్యూస్):** గార్ల మండల నూతన తహశీల్దారుగా ఆర్.శారద సోమవారం భాధ్యతలు స్వీకరించారు. గతంలో సీరోల్ మండలం తహశీల్దారుగా విధులు నిర్వహించిన శారద సాధారణ బదిలీలలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గార్ల మండల నూతన తహశీల్దారుగా భాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తహశీల్దారు శారద మాట్లాడుతూ మండలంలో ప్రజలు రెవిన్యూ పరమైన సమస్యలు ఏమైనా ఉంటే తనను నేరుగా సంప్రదించాలని, మద్యవర్తుల నమ్మి మోసపోవద్దని పేర్కొన్నారు. మండలంలో ఏలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే శాఖా పరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దారు హెచ్చరించారు.

# భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టం

- ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి

**ఖమ్మం, ఏప్రిల్ 21(మనం బ్యూరో):** గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి వెబ్ సైట్ లో పరిష్కారం లేకుండా ఉన్న భూ సమస్యల పరిష్కారానికి అవకాశం కల్పిస్తూ ప్రజా ప్రభుత్వం భూ భారతి చట్టం ప్రవేశ పెట్టిందని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లిలోని అమ్మ ఫంక్షన్ హాలులో సోమవారం భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఖమ్మం ఎంపీ, జిల్లా ఇంచార్జి కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణిలో భూ సమస్యలు పరిష్కారం కాక, కొత్త సమస్యలు ఏర్పడ్డాయని, అటువంటి సందర్భంలో భూ సమస్యల పరిష్కారం సజావుగా పరిష్కరించుకునేందుకు ప్రజా ప్రభుత్వం భూ భారతి చట్టం ప్రవేశపెట్టిందని అన్నారు. మాధాపురంలో తాత గారి నుండి తమకు 40 ఎకరాల భూమి ఉండేదని, ధరణిలో వేరే పేర్ల మీద భూమి వస్తే పరిష్కారం కోసం కోర్టుకు వెళ్ళాల్సి వచ్చిందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెవెన్యూ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, లాయర్లు, వ్యవసాయదారులతో చర్చించి భూ భారతి చట్టం తీసుకొని వచ్చారని అన్నారు. సాదా బైనామా పరిష్కారం, రికార్డులో తప్పుల సవరణ, దేవాదాయ భూముల పరిష్కారం, సర్వే మ్యాప్ తయారీ, భూ హక్కుల రికార్డు పరిష్కారం చూపించారని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఎటువంటి తొందర లేకుండా బాగా చర్చించి చట్టం తీసుకొని వచ్చారని, భూ భారతి చట్టంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఎంపి సూచించారు. కార్యక్రమంలో ఇంచార్జీ కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ భూ సమస్యలలో చాలా వరకు పరిష్కార మార్గాలను భూ భారతి చట్టంలో పొందుపర్చడం జరిగిందని అన్నారు. మ్యుటేషన్, ఓఆర్సిస్, ఇనాం భూములకు, భూ టైటిల్స్ సంబంధించి ఫిర్యాదులు ఏవైనా ఉంటే మన జిల్లాలో నూతన చట్టం అమల్లోకి వచ్చిన ఏడాదిలోగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ప్రజలు అందించిన దరఖాస్తులను పరిశీలించి రెవెన్యూ డివిజన్ అధికారి, జిల్లా కలెక్టర్ ఒక నిర్ణయం తీసుకుంటారని, దరఖాస్తుదారునికి ఏమైనా



అభ్యంతరాలు ఉంటే కలెక్టర్, భూమి ట్రిబ్యూనల్ లో అప్పీల్ చేసుకోవచ్చని ఇంచార్జ్ కలెక్టర్ తెలిపారు. గతంలో ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరాలు ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి ఉండేదని, నేడు అప్పీల్ వ్యవస్థకు అవకాశం కల్పించిందని అన్నారు.ఆర్.ఎస్.ఆర్. ఎక్సెస్ సమస్యల పరిష్కారం కోసం పైలెట్ ప్రాజెక్టు క్రింద రాష్ట్రంలో 4 మండలాల్లో సర్వే జరుగుతుందని, మన జిల్లాలో నేలకొండపల్లి మండలంలో ఇది అమలు అవుతుందని అన్నారు. భూ భారతి చట్టంపై ఇంకా ఏమైనా సూచనలు, సలహాలు ఉంటే అందించాలని, ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందని అన్నారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ భూ భారతి చట్టం రూల్స్ తీసుకురావడం జరిగిందని, ప్రస్తుతం ధరణిలో ఉన్న భూ రికార్డులు భూ భారతి చట్టంలో కొనసాగుతాయని, భూ హక్కులకు సంబంధించి ఫిర్యాదులు ఏవైనా ఉంటే మన జిల్లాలో నూతన చట్టం అమల్లోకి వచ్చిన ఏడాదిలోగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. భూ భారతి చట్టంపై అవగాహన కల్పించేలా కరపత్రాలను పంపిణీ చేశామని, ప్రజలు వీటిని గమనించాలని ఏమైనా సందేహాలు ఉంటే తీర్చడానికి అధికారులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ఖమ్మం ఆర్డీఓ నరసింహా రావు, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి పుల్లయ్య, ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీఓ కుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత బిఆర్ఎస్ కార్యకర్తలదే..



- అబద్ధపు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**భద్రాచలం అర్బన్, ఏప్రిల్ 21( మనం న్యూస్ ):** తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి బీఆర్ఎస్ కార్యకర్తలపై ఉందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. వరంగల్లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభ నేపథ్యంలో ఉద్యమకారులను, కార్యకర్తలను కలిసేందుకు భద్రాచలం వచ్చిన కవిత ముందుగా భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారిని దర్శించుకుని అమ్మవారికి పట్టు వస్త్రాలను అందించారు. అనంతరం హరిత హోటల్లో ఏర్పాటు చేసిన తెలంగాణా రాష్ట్ర ఉద్యమకారులు, కార్యకర్తలసమావేశంలో ఆమె మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉద్యమ కారులది, బీఆర్ఎస్ పార్టీది రక్త సంబంధం అన్నారు. ఉద్యమకారులు లేకపోతే తెలంగాణ ఆవిర్భవించేదే కాదన్నారు. తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన ఎన్నికలలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు బీఆర్ఎస్‌ను ఆదరించకపోయినా కేసీఆర్ జిల్లాలో 3 లక్షల ఎకరాలకు సాగునీరు అందించారని గుర్తు చేశారు. 70 లక్షల సభ్యత్వాలు ఉన్న అతిపెద్ద రాజకీయ పార్టీ బీఆర్ఎస్ అని, ప్రతి కార్యకర్త తలెత్తుకుని జీవించేలా పార్టీ చేస్తుందని కార్యకర్తలకు హామీ ఇచ్చారు. కేసీఆర్ ని మళ్లీ ముఖ్యమంత్రిగా చూడాలనే ధ్యేయంతో మనమందరం కష్టపడాలని పిలుపునిచ్చారు.

### మమ్మల్ని పట్టించుకోవడం లేదు : ఉద్యమకారులు

పార్టీలోకి వలస వచ్చిన నాయకులు వారికి ఇష్టం వచ్చిన వారికి పదవులు కట్టబెడుతూ, ఉద్యమ కారులను పట్టించుకోవడం లేదని ఉద్యమకారులు ఎమ్మెల్సీ కవిత ముందు ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో మంత్రులుగా పని చేసిన తుమ్మల నాగేశ్వరరావు, పువ్వాడ అజయ్ కుమార్, నాయకులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వాళ్ల అనుచరులకు పదవులు కట్టబెట్టడం వల్లనే పార్టీకి నష్టం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరావు, రేగా కాంతారావు, హరిప్రియా, ఎమ్మెల్సీ తాత మధు తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరు పోలీస్ స్టేషన్ లో ఏసీబీ దాడులు



- రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డ సిఐ

**మణుగూరు, ఏప్రిల్ 21(మనం న్యూస్):** మణుగూరు పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. సిఐ సోమ సతీష్ కుమార్, బిగ్ టివి రిపోర్టర్ మిట్టపల్లి గోపీ ఓ వ్యక్తి నుండి రూ. 4 లక్షల లంచం డిమాండ్ చేశారని, అందులో రూ. 1 లక్ష తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్గా పట్టుబడ్డారని ఏసిబి అధికారులు తెలిపారు. గోపీ మధ్యవర్తిగా వ్యవహరించి, కేసులో బాధితుల పేర్లు చేర్చకుండా చూసే ప్రయత్నం చేశాడని తెలిపింది. 318(4), 329(3) బిఎన్ఎస్ తెలంగాణ స్టేట్ గేమింగ్ (సవరణ) చట్టం సెక్షన్ 5 కింద కేసు నమోదు చేసి రసాయనిక పరీక్షలు నిర్వహించి అభియోగాలకి బలమైన ఆధారాలు సేకరించి ఇద్దరినీ అరెస్ట్ చేసి వరంగల్ ఎస్పీఈ ఎసీబీ కోర్టులో హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. ఏ ప్రభుత్వ ఉద్యోగులు అయినా లంచం అడిగినట్లయితే ప్రజలు తెలంగాణ అవినీతి నిరోధక శాఖ వారి టోల్ ఫ్రీ నెంబర్ 1064 కు డయల్ చేయాలని కోరారు. 'వాట్సాప్( 9440446106) ఫేస్ బుక్, ఎక్స్' ద్వారా కూడా సంప్రదించవచ్చని తెలిపారు.

# చిట్టి చేతుల్లో చీపుర్లా!

- పలకా, బలపం పట్టే చిన్నారులతో వెట్టి చాకిరి

**లక్ష్మీదేవిపల్లి, ఏప్రిల్ 21 (మనం న్యూస్) :** బడికి పోయి అక్షరం నేర్చుకోవాల్సిన, పలక బలపం పట్టాల్సిన చిన్నారి చేతులు చీపుర్లు పట్టి పనులు చేయడం అది వారు చదువుకునే పాఠశాలలోనే కావడం చూసినవారు పిల్లలతో పనులు చేయించడం అమానుషమంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నారి చిట్టి చేతులతో పాఠశాల ఆవరణ అంతా చీపురుతో శుభ్రం చేస్తున్న దృశ్యాలను మనం చిత్రీకరించింది. లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగు గ్రామపంచాయతీ పరిధిలోని మోకాళ్ళగుంపు గ్రామంలో లోని జిపిఎస్ పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువులు పిల్లల చేతికి చీపురులను ఇచ్చి ఆవరణలో చెత్తాచెదారంతో శుభ్రం చేయించారు. ఇలా బాల కార్మికుల వలె చిన్నారులతో పాఠాలకు సంబంధించినవి కాకుండా వ్యక్తిగత అవసరాలైన మంచినీళ్ల బాటిళ్లు, బిస్కెట్లు తెప్పించడం అందుకు పిల్లల్ని బయటికి పంపడం అదే సమయంలో తరగతి గదులను శుభ్రం చేయించడం వంటి వెట్టి చాకిరి పనులు చేయిస్తున్నారని ఆ పాఠశాల పిల్లల్లో కొందరు మనోవేదనకు గురవుతున్నారు. గురువుల వద్దకు విద్య నేర్పాలని పంపిస్తే చిన్న పిల్లలతోటి చేయించడం ఏంటని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.




ఈ విషయమై జిల్లా విద్యాశాఖ అధికారి తక్షణమే పిల్లల చేత పనులు చేయించిన పాఠశాల పంతులపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



# భూగర్భ జలాల పరిరక్షణ అందరి బాధ్యత

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 22 (మనంప్రతినిధి) :** భూగర్భ జలాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో భూగర్భ జలాల పరిరక్షణ పై భూగర్భ జలాల పరిరక్షణ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గృహాలు, పరిశ్రమలు మరియు వ్యవసాయ క్షేత్రాల్లో ఇంకుడు గుంతలు మరియు ఫామ్ పౌండ్ లు విస్తృతంగా నిర్మాణాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతులకు డ్రిప్ ఇరిగేషన్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డ్రిప్ ఇరిగేషన్ ద్వారా 50 శాతం సబ్సిడీ వస్తుందని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో మరియు పట్టణాలలో నీరు ఎక్కడ



నిలబడుతుందో, ఇంకుడు గుంతలు ఎక్కడ నిర్మించాలి అనేది గుర్తించి నిర్మాణాలు చేపట్టాలని ఇంకుడు గుంతల నిర్మాణాల్లో ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలలో లోని ప్రతి గృహంలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయు విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామాలలో ఇంకుడు గుంతలు ఉచితంగా ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మిస్తామని కలెక్టర్ తెలిపారు. మున్సిపాలిటీలు పరిధిలో ఇంకుడు గుంతలు తవ్వినవారికి ఉచితంగా సిమెంట్ రింగ్ లు మరియు కవర్ షీట్ ను అందిస్తామని ఆయన తెలిపారు. ఇంకుడు గుంతల నిర్మాణంలో చేపట్టిన వారికి అధికారులు సన్మానం చేయాలని సూచించారు. ఇంకుడు గుంతల నిర్మాణం సరైన రీతిలో చేపట్టాలని నీరు ఇంకుడు గుంతలోకి వెళ్ళు విధంగా నిర్మాణాలు ఉండాలని ఆయన అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు వసతి గృహాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాలను చేపట్టాలన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు ఈ వేసవిలో చెరువుల్లో నీటి నిల్వలు తక్కువగా ఉంటాయని వాటిలో పూడిక తీయు విధంగా చర్యలు చేపట్టాలన్నారు. చెరువుల్లోని పూడిక తీసిన మట్టిని రైతుల వ్యవసాయ పొలం కి ఉపయోగపడు చర్యలు చేపట్టాలని, ఆ వివరాలను రిజిస్టర్లు నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని దమ్మపేట, జూలూరుపాడు, చంద్రుగొండ, సుజాతనగర్, చుంచుపల్లి మండలాల్లో 16 గ్రామాలలో భూగర్భ జలాలు తక్కువగా ఉన్నాయని, అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పెద్ద ఎత్తున ఇంకుడు గుంతలు ఫామ్ పాండ్ నిర్మాణాలు చేపట్టే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో కమర్షియల్ ప్రదేశాలలో ఇంకుడు గుంతల నిర్మాణానికి తగిన ప్రదేశాలు గుర్తించాలన్నారు. భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఒకటే మార్గమని ఇంకుడు గుంతలు త్రవ్వటం విస్తృతంగా చెట్లు నాటడం ద్వారానే భూగర్భ జలాలను పెంపొందించవచ్చును కలెక్టర్ తెలిపారు. అన్ని శాఖల అధికారులు మరియు ప్రజలు అందరూ భూగర్భ జలాలను పెంపొందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. చేపట్టిన ఇంకుడు గుంతల నిర్మాణాలను జల్ సంచెయ్ జన్ భాగి దారి లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో భూగర్భ జల శాఖ ఏడి రమేష్, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, పబ్లిక్ హెల్త్ శాఖ ఈఈ రంజిత్, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్, పాల్వంచ మున్సిపల్ కమిషనర్ సుజాత, అడిషనల్ డిఆర్డిఏ రవి మరియు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## పత్రికా ప్రకటన

### దరఖాస్తులకు ఆహ్వానము

జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, వైరా, ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యాలయ పరిధిలో ఖాళీగా నున్న (6) గోపాలమిత్ర సూపర్వైజర్ పోస్టులకు ఒప్పంద (కాంట్రాక్టు) పద్ధతిన ధరఖాస్తులు ఆహ్వానించడమైనది. ఇట్టి పోస్టుకు వెటర్నరీ పాలిటెక్నిక్, డిప్లమా లేదా డైరీ సైన్సు లేదా గోపాలమిత్రగా పనిచేసిన అనుభవం కలిగి వుండి మరియు డిగ్రీతో కంప్యూటర్ పని చేయుటలో అనుభవం కలిగి ఉండాలి. వయస్సు 18సం.ల నుండి 40సం.లు కలిగి ఉండాలి.

ఇతర వివిరములకు వైరాలోని కార్యాలయ అన్ని పనివేళలో ఫోన్ నెం. 9705271297 కు కాల్ చేసి సంప్రదించగలరని కోరుచున్నాము.

ధరఖాస్తులు స్వీకరించుటకు ఆఖరు తేది ది.25.04.2025 సాయంత్రం 5గం.ల వరకు. స్వీకరించినధరఖాస్తుల ప్రకారము ది.28.04.2025 నాడు వ్రాత పరీక్ష మరియు ఇంటర్వ్యూలు వైరా కార్యాలయములో నిర్వహించబడును.

**ఇట్లు**

కార్యనిర్వహణ అధికారి జిల్లా పశుగణాభివృద్ధి
సంస్థ వైరా, ఖమ్మం జిల్లా

మనం Manam Mahabubnagar మహబూబ్ నగర్

## బ్యాంకర్లతో జూమ్ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సమీక్ష



**కామారెడ్డి, ఏప్రిల్ 21(మనం ప్రతినిధి):** రాజీవ్ యువ వికాసం పథకం క్రింద బ్యాంకులకు నిర్దేశించిన లక్ష్యాలకు రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం ప్రత్యేక జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశం లో కలెక్టర్ జూమ్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన పథకం లో యువతకు ఉపాధి కల్పనకు జిల్లాలో ఈ పథకం క్రింద 44630 దరఖాస్తులు రావడం జరిగిందని, జిల్లాకు 13,450 లక్ష్యాలను నిర్దేశించడం జరిగిందని తెలిపారు. మండలాల వారీగా బ్యాంకు బ్రాంచి ల వారీగా లక్ష్యాలను నిర్ణయించి ఆయా బ్యాంకులకు అందజేయడం జరిగిందని తెలిపారు. మండల స్థాయి, జిల్లా స్థాయి కమిటీలను నియమించడం జరిగిందని తెలిపారు. మండల స్థాయి బ్యాంకర్ల ఆయా దరఖాస్తులను పరిశీలించి వెరిఫికేషన్ చేయాలని తెలిపారు. రైస్ మిల్లర్లకు బ్యాంకు గ్యారంటీలు నిర్దేశించడం త్వరితగతిన నిర్వహించాలని బ్యాంకర్లను కలెక్టర్ ఆదేశించారు. అంతకు ముందు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్ మాట్లాడుతూ, రాజీవ్ యువ వికాసం పథకం క్రింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ నిరుద్యోగ యువతకు ప్రభుత్వ సబ్సిడీలతో బ్యాంకుల రుణాలతో ఈ పథకం అమలు చేయడం జరుగుతుందని వివరించారు. ఈ సమావేశంలో ఎల్డిఏం రవికాంత్ , జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడి దయానంద్, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారిని రజిత, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాజేందర్, బ్యాంకర్లు, తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి ద్వారా రైతు భూ సమస్యలు పరిష్కారం

- **దేవరకద్ర శాసన సభ్యులు జి.మధు సూధన్ రెడ్డి**

**మహబూబ్ నగర్, ఏప్రిల్21(మనం బ్యూరో):** రైతుల సమస్యలు సులభంగా పరిష్కరించే విధంగా తీసుకు వచ్చిన గొప్ప చట్టం భూ భారతి ఆర్. ఓ.ఆర్ చట్టం 2025 అని దేవరకద్ర శాసన సభ్యులు జి. మధుసూదన్ రెడ్డి అన్నారు. రైతు పక్షపాతిగా తమ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు.సోమవారం అడ్డా కుల మండలం సంత బజార్ లో, మూసాపేట మండలం జడ్.పి.ఉన్నత పాఠశాల ఆవరణలో భూ భారతి అర్. ఓ.అర్.చట్టం పై నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ధరణి భూ హక్కుల చట్టంతో సామాన్య ప్రజలు ఎంతో ఇబ్బంది పడ్డారని, సమస్యలు పరిష్కారం కాలేదని ఆయన తెలిపారు ధరణి భూతం వలన ఎంతో మంది రైతులు తహాశీల్దార్ ,కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరిగినప్పటికీ భూ సమస్యలు పరిష్కారం కాదని తెలిపారు. ఎన్నికల ముందు అధికారంలోకి రాగానే ధరణి బంగాళాఖాతంలో వేస్తామని మాట ఇచ్చిన ప్రకారమే అందరి నిపుణులు, మేధావులతో చర్చించి 12 రాష్ట్రాల్లో రెవెన్యూ చట్టాలను అధ్యయనం చేసి ఆ చట్టాల్లో ఉన్న మంచిని తీసుకొని భూభారతి చట్టాన్ని రూపొందించడం జరిగింది అని తెలిపారు ధరణి స్థానంలో భూ భారతి చట్టాన్ని అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14న శ్రీకారం చుట్టినట్లు తెలిపారు .కొత్తగా తీసుకు వచ్చిన అమలుకు ముందే భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కలిగించాలని,చట్టం లో ఉన్న నిబంధనలు తెలియ చేయటానికి భూభారతి అవగాహన సదస్సులు ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు.అవగాహన సదస్సులలో ఈ చట్టం లో లోపాలు ఉంటే సరి చేసి మెరుగ్గా అమలు చేయడం జరుగుతుందని అన్నారు..ధరణి చట్టం అమలు చేసినప్పుడు గత ప్రభుత్వం అవగాహన కలగ చేయలేదని అన్నారు. ధరణి చట్టం లో భూ సమస్యలకు తహాశీల్దార్,ఆర్.డి. ఓ,కలెక్టర్ కు పరిష్కారం అధికారాలు లేవని అన్నారు. ధరణి లో 20 లక్షల పట్టా భూములు నిషేధిత జాబితా లోకి వెళ్లి పరిష్కారం కాకుండా ఉన్నట్లు వంటి సంఘటనలు వివరించారు. ధరణి చట్టం సామాన్య ప్రజలకు ఉపయోగ పడలేదని తెలిపారు.ధరణి అమలుకు ఎటువంటి నియమాలు తీసుకు రాలేదని అన్నారు గత ప్రభుత్వం అన్ని లొసుగులతో ధరణి తీసుకు వచ్చి ప్రజల నెత్తిన రుద్ది వారి అవసరాలకు ఉపయోగ పడేలా ప్రభుత్వ భూములను కొల్ల గొట్టారని అన్నారు .పది సంవత్సరాలు పాలించి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని అన్నారు. సరళతర నియమాలతో సామాన్యులకు మేలు జరిగేలా భూ భారతి చట్టం తీసుకు వచ్చి నిబంధనలు రూపొందించినట్లు తెలిపారు.తహాశీల్దార్,ఆర్.డి. ఓ,కలెక్టర్ స్థాయిలో భూ సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా భూ భారతి చట్టం తీసుకు వచ్చినట్లు తెలిపారు.సాదా బైనామా ద్వారా కొనుగోలు చెందిన భూములు ఆర్.డి. ఓ విచారణ చేసి పట్టా జారీ చేయడం జరుగుతుందని అన్నారు.రెవెన్యూ అధికారులు చిత్త శుద్ధితో భూ సమస్యలు పరిష్కారం చేయాలని సూచించారు.

కొట్లాడి మన బతుకులు బాగు పడతాయని తెచ్చుకున్న రాష్ట్రం లో పది సంవత్సరం లు గత ప్రభుత్వం లో 7 లక్షల కోట్ల రూ.లు అప్పులు చేసి రాష్ట్రం ను ఆర్థికంగా దివాళా తీయించారని అన్నారు .మాట ఇచ్చిన ప్రకారం 2 లక్షల లోపు రుణాలకు రైతు రుణ మాఫీ చేసినట్లు,అడ్డాకుల మండలం లో 3847 రైతులకు 32 కోట్ల 81 లక్షల రూ.లు మాఫీ చేసినట్లు తెలిపారు.8645 రైతులకు రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో 7 కోట్ల 85 లక్షలు జమ చేసినట్లు తెలిపారు. సన్న వడ్ల కు మద్దతు ధర తో పాటు 500 రూ.లు బోనస్ ప్రకటించి అమలు చేసిందని తెలిపారు.వానకాలంలో 774 మంది రైతులకు జిల్లాలో సన్న వడ్లు పండించిన రైతులకు మద్దతు ధర తో పాటు 2 కోట్ల 17 లక్షలు రూ.లు రైతుల అకౌంట్లో జమ చేసినట్లు తెలిపారు. అడ్డాకుల మండలం లో 12 వడ్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 8 ఐ కె.పి.మహిళా సంఘాల ద్వారా 4 పి. ఏ. సి.ఎస్.ద్వారా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.వర్షంలో తడిసిన ధాన్యం ను కూడా కొనుగోలు చేస్తామని తెలిపారు. 29 మంది రైతులు చనిపోతే 15 రోజుల్లో ఒక కోటి 45 లక్షలు భీమా రైతు కుటుంబాలకు అమలు చేసినట్లు తెలిపారు.సన్న బియ్యం ప్రతి కుటుంబం లో ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.రేషన్ కార్డులు లేని వారికి రేషన్ కార్డులు అంద చేయనున్నట్లు తెలిపారు. మూసాపేట మండలంలో ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలోనే రెండు లక్షల లోపు ఉన్న రుణాలను 19 కోట్ల 71 లక్షలు రుణమాఫీ చేసి రైతుల అకౌంట్లో డబ్బులు జమ చేయడం జరిగిందని ఆయన తెలిపారు అదేవిధంగా రైతు బీమా కింద చనిపోయిన రైతులకు 21 మందికి ఒక కోటి ఐదు లక్షల రూపాయలు అందజేసినట్టు తెలిపారు రైతు భరోసా కింద మండలంలో 6740 మంది రైతులకు 5 కోట్ల 59 లక్షల రూపాయలు వారి అకౌంట్లలో జమ చేయడం జరిగిందని తెలిపారు.వానాకాలంలో సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాలకు 500 రూపాయల బోనస్ ను రైతులకు అందజేస్తుందని, మండలంలో రెండు కోట్ల 98 లక్షల రూ లు సన్న వడ్లు కొనుగోలు చేసి బోనస్ రైతులకు జమ చేసినట్లు తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భూ భారతి చట్టంపై ఈ నెల 17 నుండి 29 వరకు అన్ని మండలాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం లో వచ్చే దరఖాస్తుల్లో 100 లో 80 మంది భూ సమస్యలు వస్తున్నాయని అన్నారు.కొన్ని పరిష్కారం చేయగలిగినప్పటికీ

1948 లో ఖాస్రా పహాని, బ ఆర్. ఓ ఆర్ కింద 1 బి రిజిస్టర్ తయారు చేయడం, 2017 భూ రికార్డులు అప్డేట్ చేయడం జరిగింది

ధరణి అమలులోకి వచ్చింది.ధరణి లో అమలుకు నిబంధనలు పేర్కొన లేదు 1971 లో ఆర్. ఓ.ఆర్ చట్టం చేస్తే 1989 లో నిబంధనలు రావడానికి చాలా కాలం పట్టింది.భూ భారతి చట్టం జనవరి లో రూపొందించి రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ జయంతి రోజున ఏప్రిల్ 14 నుండి భూ భారతి ఆర్. ఓ. ఆర్ చట్టం 2025 నిబంధనలు అమలులోకి వచ్చినట్లు తెలిపారు జిల్లాలో 3 లక్షల మంది భూమి కలిగిన ఖాతాదారులు ఉన్నారని,ఇందులో సుమారు 1/3 వంతు ఒక లక్ష మంది మహిళలు ఉన్నారని తెలిపారు.పట్టా చూపించి పొజిషన్ చూపించలేదు,సాగు చేసుకుంటూ అనుభవం లో ఉన్న వారికి భూ రికార్డుల్లో పేరు నమోదు కాకపోవడం, ఇనా భూమి ఉండి ఓ.ఆర్. సి వచ్చి పట్టా కింద రికార్డులో రాక పోవడం పోవడం,38 ఈ సర్టిఫికెట్, సాదా బైనామా భూములు భూమి హక్కుల రికార్డులలో నమోదు కాలేదు.ఇటు వంటి భూ సమస్యలు అధికారుల ద్వారా పరిష్కారం కానివి కోర్టు కు వెళ్ళ వలసి వచ్చేదని అన్నారు.కోర్ట్ లో చాలా సమయం పడుతుందని,ఖర్చు అవుతుందని అన్నారు.

భూ భారతి లో వివిధ మార్గాల ద్వారా భూమి కొనుకున్న వారు మ్యుటేషన్ జరగకపోతే అధికారుల ద్వారానే సమస్యలు పరిష్కారం జరుగుతుందని అన్నారు తహాశీల్దార్ కార్యాలయంలో పరిష్కారం కాకుంటే,అర్.డి. ఓ కార్యాలయం కు,ఆర్.డి. ఓ కార్యాలయం లో పరిష్కారం జరగక పోతే,జిల్లా కలెక్టర్ కు అప్పీల్ చేసుకో వచ్చని అన్నారు. జిల్లా కలెక్టర్ ద్వారా పరిష్కారం జరగక పోతే సి . సి.ఎల్.ఏ/

ల్యాండ్ ట్రిబ్యునల్ కు అప్పీల్ కు వెళ్ళ వచ్చని అన్నారు.

ధరణి చట్టం లో అప్పీల్ విధానం లేదని తెలిపారు.కోర్ట్ కు వెళ్ళవలసి వచ్చేదని అన్నారు .భూ భారతి చట్టం లో

వారసత్వా గా ద్వారా వచ్చిన భూమి పేరు మార్పుకు తహాశీల్దార్ విచారణ చేసి నిర్ణయం తీసుకుంటారు.30 రోజుల్లో సమస్య పరిష్కారం చేయకపోతే మార్పు జరుగుతుందని అన్నారు.

సాదా బైనామా క్రమ బద్దీకరణ చేసుకునే అవకాశం కలిగింది .రాష్ట్రంలో 9 లక్షల మంది పైగా ఉన్నారని,వారి పేరు రికార్డులో నమోదు కాలేదని అన్నారు.

**రైతులకు లబ్ధి కలుగుతుందని అన్నారు**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు తెల్ల కాగితం ద్వారా కొనుగోలు చేసి ఉండి 12 సంవత్సరం లు స్వాధీనం లో ఉంటే 2020 అక్టోబర్ నుండి నవంబర్ మాసం లో దరఖాస్తు చేసుకుని ఉంటే నూతన భూ భారతి చట్టం లో సాదా బైనామా క్రమ బద్దీకరణ చేసుకునే అవకాశం ఉందని అన్నారు.

భూ భారతి నూతన చట్టంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు అవగాహన కలిగించారు.సమావేశంలో రెవెన్యూ అధనపు

కలెక్టర్ మోహన్ రావు, అర్.డి.ఓ నవీన్, నియోజకవర్గం ప్రత్యేక అధికారి జిల్లా సహకార అధికారి శంకరాచారి ,తహాశీల్దార్ లు, వివిధ గ్రామాలలో ని రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## త్వరలో నూతన హంగులతో కామారెడ్డి రైల్వేస్టేషన్



- **జహీరాబాద్ ఎంపీ సురేష్ శెట్కార్**
- **షబ్బీర్ అలీతో కలిసి రైల్వేస్టేషన్ ను పరిశీలించిన ఎంపీ**

**కామారెడ్డి, ఏప్రిల్ 21 ( మనం ప్రతినిధి):** ఆర్నెళ్లలోనే కామారెడ్డి రైల్వేస్టేషన్ రూపురేఖలు మారబోతున్నాయని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి రైల్వేస్టేషన్‌ను పరిశీలించారు. రైల్వే డివిజనల్ ఇంజినీర్ శశాంక్‌తో సమావేశమై మంజూరైన నిధులు, సమస్యలపై చర్చించారు. అనంతరం రైల్వేస్టేషన్‌లో 'అమృత్ భారత్ పథకం' కింద కొనసాగుతున్న పనులను పరిశీలించారు. ప్రయాణికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మీడియాతో మాట్లాడుతూ., అమృత్ భారత్ స్కీం కింద పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. కొత్తగా రెండు ఆర్వోబీల కోసం ప్రయత్నాలు చేస్తున్నామని, పాత రైల్వే గేటు వద్ద ఆర్వోబీ నిర్మాణం కోసం సర్వే జరుగుతుందని, మట్టి పరీక్షలకు పంపించామని తెలిపారు. ఆర్వోబీలతో పాటు పాదాచారులు, ద్విచక్ర వాహనదారుల కోసం అండర్ గ్రౌండ్ బ్రిడ్జికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. మున్సిపల్ రైల్వే శాఖల సమన్వయంతో పనులు చేపడతామని తెలిపారు. పాత రాజంపేట వద్ద ఆర్వోబీ కోసం నేషనల్ హైవే అథారిటీ వారికి ప్రతిపాదనలు పంపిస్తామని పేర్కొన్నారు. రైల్వే స్టేషన్లో తాగునీరు, టాయిలెట్స్ సమస్యలను వారం రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎస్కలేటర్ నిర్మాణం కూడా ఆర్నెళ్లలో పూర్తవుతుందని పేర్కొన్నారు.

# రైతుల భూ కష్టాలు తీర్చడం కోసమే భూ భారతి

- **ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**

**వరంగల్/ రాయపర్తి,ఏప్రిల్ 21(మనం ప్రతినిధి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంతో రైతుల అన్ని భూ సమస్యలు తీరుతాయని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. గత ధరణి చట్టంతో రైతులు మోసపోయారని అన్నారు.వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలో గల రైతు వేదిక ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ హక్కుల రికార్డ్ పథకం (భూ భారతి చట్టం - ఖఛిౌటఛీ ౕజ ఖజీజ్జిట ఖఙ) పై అవగాహన సదస్సు నిర్వహించగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, జిల్లా కలెక్టర్ సత్య శారద గారితో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.... భూ భారతి చట్టం ద్వారా భూముల రికార్డులు పారదర్శకంగా నిర్వహించి, భవిష్యత్ తరాలకు భూ హక్కుల విషయంలో స్పష్టత కల్పించడమే మన ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. భూ కబ్జాలు, అక్రమాలు, వివాదాలు తొలగించి రైతులకు భద్రత కల్పించేందుకు ఈ చట్టం కీలకంగా పనిచేస్తుందని చెప్పారు. రైతులు తమ భూములకు సంబంధించి పూర్తి సమాచారం అందించడంతో పాటు, అధికారులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూ రికార్డులను నూతనంగా నమోదు చేస్తారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి గారి మానస పుత్రికగా భూ భారతి నిలుస్తుందన్నారు. రైతులు ఎలాంటి అనుమానాలు లేకుండా భూమి వివరాలను అధికారులు చేపడుతున్న సర్వేల్లో సరిగ్గా నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ చట్టం అమలుతో భవిష్యత్తులో భూ సంబంధిత సమస్యలకు స్థానం ఉండదన్నారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్టం రైతుల భవిష్యత్తు కోసమేనని అన్నారు.జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ...

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ సమస్యలను పరిష్కరించడానికి అమలు చేయనున్న భూ భారతి చట్టం ద్వారా ఎక్కువ మొత్తంలో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని, భూ భారతి చట్టంపై అవగాహన కలిగి ఉండాలని

అన్నారు. ధరణిలోని పొరపాట్లను సవరించేందుకు కలెక్టర్ కి మినహా ఏ అధికారికీ అవకాశం లేదని చెప్పారు. దీనివల్ల తాహసిల్దార్ స్థాయిలో పరిష్కారమయ్యే చిన్న సమస్యలు కూడా వేల సంఖ్యలో పేరుకుపోయేవని అన్నారు. చిన్న చిన్న సమస్యలు కూడా తహసిల్దార్లు, ఆర్డీవో పరిష్కరించలేని పరిస్థితి ఉండేదని పేర్కొన్నారు. భూభారతి చట్టం ద్వారా ప్రభుత్వం భూ సమస్యలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చిందని తెలిపారు. ఈ చట్టం ద్వారా పొరపాట్ల సవరణకు అవకాశం ఉందని, మ్యూటేషన్ దరఖాస్తులు త్వరితగతిన పరిష్కారం అవుతాయని తెలిపారు. రెండంతల అప్పీలు వ్యవస్థతో రైతులు, ప్రజలు భూ సమస్యలపై కోర్టు వరకు వెళ్లవలసిన అవసరం దాదాపు ఉండదని తెలిపారు.2010 సంవత్సరంలో ప్రతి వ్యక్తి తన గుర్తింపు కోసం ఆధార్ కార్డు ఎలా పొందారో అదే తరహాలో భూ భారతి చట్టం ద్వారా భూమి హక్కు పట్టాలను పొందగలుగుతారని తెలిపారు. ధరణి లో భూ సమస్యల పై దరఖాస్తులు చేసుకోవాలంటే 33 మాడ్యుల్స్ ఉండేవని, ప్రస్తుతం భూభారతి చట్టంలో కేవలం నాలుగు మాడ్యుల్స్ మాత్రమే ఉండి సులభతరమైన పద్ధతిలో దరఖాస్తు ప్రక్రియ ఉంటుందని అన్నారు.సాదాబైనామా వారసత్వ భూమి చేయుటకు 30 రోజుల కాలవ్యవధి ఉంటుందని 30 తర్వాత ఒక్కరోజు ఆలస్యమైన ఆటోమేటిక్ గా మ్యుటేషన్ అవుతుందని ,అందుకు అధికారులు జవాబుదారీతనం కలిగి ఉండేలా ఈ చట్టం రూపకల్పన చేయడమైనది అన్నారు.ఈ సందర్భంగా భూభారతి చట్టం 2025 ను పి పి టి ద్వారా రైతులకు అవగాహన కల్పించారు.ఈ సదస్సుకు రైతులు అధిక సంఖ్యలో హాజరై, వారి సందేహాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు గ్రామస్థాయిలో సర్వేలు ఎలా జరుగుతాయో, భూ నక్షా పునర్నిర్మాణ ప్రక్రియ ఎలా ఉంటుందో వివరించారు.ఈ కార్యక్రమములో ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




# తెలంగాణ రాష్ట్రం మీద ఏ రాజకీయ పార్టీ నాయకుడికి ప్రేమ లేదు

- **తెలంగాణ రైతులకు బేషరుతుగా క్షమాపణ చెప్పాలి**
- **మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్**

**నిజామాబాద్, ఏప్రిల్ 21( మనం ప్రతినిధి):** తెలంగాణ రైతులకు వ్యవసాయం ఆంధ్ర ప్రాంతం వారు నేర్పించార్న పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలపై మాజీ మంత్రి,ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఘాటుగా స్పందించారు. 'తెలంగాణ రైతులకు ఆంధ్రప్రాంతం వారు వ్యవసాయం నేర్పించారని పీసీసీ అధ్యక్షుడు మాట్లాడడం యావత్ తెలంగాణ సమాజాన్ని అవమాన పరిచినట్టే.... రైతులను అరిగోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతు మహోత్సవ వేడుకలు జరపడం.. చంపినోడే..సంతాప సభ పెట్టినట్టు ఉంది.కేసిఆర్ చెప్పేది అక్షర సత్యం..బిఆర్ఎస్ కు తప్పా తెలంగాణ మీద ప్రేమ ఏ రాజకీయ పార్టీకి ఉండదు తెలంగాణ కాంగ్రెస్ నాయకులు తీవ్ర భావదారిద్ర్యంలో ఉన్నారు.

ఆంధ్ర పాలకుల మన్ననల కోసం ఇంకా ప్రాకులాడడం సిగ్గు చేటు అని ఆయన అన్నారు. నాడు తెలంగాణ ఏర్పాటుకు అడ్డుపడ్డ సమైక్య పాలకుల అడుగులకు మడుగులొత్తిన కాంగ్రెస్ నాయకులు..ఇప్పుడు సొంత రాష్ట్రంలో ఉన్నామనే సోయి మరిచినట్టు ఉన్నారు.. తెలంగాణ వ్యవసాయ చరిత్ర తెలియని వ్యక్తులు.. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ కు పాలకులు కావడం తెలంగాణ ప్రజల దౌర్భాగ్యం ఆంధ్రలోని కోస్తా ప్రాంతంలో వరి తప్పా ఏది పండించరు, కానీ తెలంగాణ రైతులు వరితో పాటు వాణిజ్య పంటలైన పత్తి,పసుపు, చెరుకు, మిర్చి,మక్క జొన్న పంటలు పండిస్తారు. పల్లి,పెసర,శనగ,కందులు,మినుములు లాంటి ఆహార ధాన్యాలు పండిస్తారు. వెయ్యేళ్ళ క్రితమే దక్కన్ ప్రాంతంలో వరి ధాన్యం పండించిన చరిత్ర తెలంగాణ రైతులది వ్యవసాయ రంగంలో నిష్ణాతులైన తెలంగాణ రైతులను అవమానించిన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ వెంటనే యావత్ తెలంగాణ సమాజానికి బే షరతుగా క్షమాపణ చెప్పాలి.' అని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు.




# అవమానాలే సోపానాలుగా మార్చుకున్న మహనీయుడు అంబేద్కర్

- **ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం**
- **కేంద్ర మంత్రి బండిసంజయ్ కుమార్**

**కరీంనగర్, ఏప్రిల్21 (మనం బ్యూరో) :** భారతదేశ చరిత్రలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఎదుర్కొన్న అవమానాలు మరెవరూ ఎదుర్కోలేదని, అడు గడు గునా హేళనకు గురైన వాటినే సోపానాలుగా చేసుకుంటూ అనుకున్న లక్ష్యానికి చేరుకోవడంతో పాటు తన చదువునంతా సమాజ శ్రేయస్సుకు, అణగారిన వర్గాల అభ్యున్నతికి ధారపోసిన మహనీయుడు అంబేద్కర్ అని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కొనియాడారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ లోని శుభమంగళ గార్డెన్స్ లో నిర్వహించిన 'సెమినార్' లో బండి సంజయ్ ప్రసంగించారు. చిన్న సమస్య, అవమానాలు ఎదురైతే లక్ష్య సాధన నుండి పక్కకు తప్పుకుంటున్న నేటి తరానికి అంబేద్కర్ జీవితమే స్ఫూర్తిదాయక మన్నారు. ఆ మహనీయుడి చరిత్రను నేటి తరానికి తెలియ జేసేందుకే సామాజిక సమరసత దినోత్సవాల పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని



చెప్పారు..దేశానికి అద్భుతమైన రాజ్యాంగాన్ని అందించి యావత్ ప్రపంచమే గర్వించదగ్గ అత్యున్నత ప్రజాస్వామ్యానికి బాటలు వేసిన గొప్ప మేధావని పేర్కొన్నారు. దళిత, బడుగు, బలహీనవర్గాల బిడ్డలంతా రిజర్వేషన్ల ఫలాలు అనుభవిస్తున్నారంటే ఆయనే కారణ మన్నారు.అంతటి మహనీయుడిని కాంగ్రెస్ పార్టీ జీవితాంతం అనేక అవమానాలకు గురిచేసింద న్నారు.అంబేద్కర్ ను చరిత్రను తెరమరుగు చేసేందుకే అడుగడు గునాప్రయత్నిం చింద న్నారు. ఆర్టికల్ 370 దేశానికి మంచిది కాదని, ఒకే దేశానికి రెండు చట్టాలు కరెక్ట్ కాదని అంబేద్కర్ తీవ్రంగా వ్యతిరేకిస్తే ఆయనను అవమానిస్తూ ఆ ఆర్టికల్ ను ఆమోదించిందన్నారు. రిజర్వేషన్లను వ్యతిరేకించిన కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు మతపరమైన రిజర్వేషన్లు కల్పించేందుకు కుట్రలు చేసిందని తెలిపారు. అంబేద్కర్ కు భారతరత్న అవార్డు వచ్చేలా చేసిన పార్టీ బీజేపీయేనని అంబేద్కర్ జయంతి రోజు రాష్ట్రీయ సమరసత దినంగా ప్రకటించి 120 దేశాల్లో జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. పార్లమెంటులో అంబేద్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేశామన్నారు. సుప్రీంకోర్టు, న్యాయమంత్రిత్వ శాఖలో విగ్రహం ఏర్పాటు చేశామని, నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవంగా ప్రకటించామన్నారు. అంబేద్కర్ ఆశయాలను అమలు చేస్తూ ఆయన అడుగు జాడల్లో నడుస్తున్న ఏకైక పార్టీ కూడా బీజేపిపార్టీయేనన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, మాజీ మేయర్ సునీల్ రావు, మానేరు అనంతరెడ్డి, దేవేందర్ రావు, అడవి కుమార్, డాక్టర్ గంగాధర్, రాజేందర్ రెడ్డి, సోమిడి వేణు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి అడ్డాలపై ఎక్సైజ్ అధికారుల వేట

- **అంతర్ రాష్ట్ర గంజాయి రవాణా మూఠా పట్టివేత**
- **పక్క ప్లాన్ చేసి పట్టుకున్న ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ టీం.**
- **ఐదుగురు గంజాయి స్మగ్లర్ల అదుపులో**
- **25 కిలోల గంజాయి... కారు బైక్లు స్వాధీనం**

**నిజామాబాద్, ఏప్రిల్ 21(మనం ప్రతినిధి):** జిల్లాలో ఎక్సైజ్ శాఖ అధికారులు గంజాయిపై వేట కొనసాగిస్తున్నారు. పక్క ప్లాన్ ప్రకారం ప్రకారంగా నిజామాబాద్ ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ టీం అంతరాష్ట్ర గంజాయి రవాణా ముఠా ఆట కట్టించింది. గడిచిన కొన్ని రోజుల క్రితం నిజాంసాగర్ వద్ద 80 కిలోల గంజాయిని పట్టుకొని అంతరాష్ట్ర గంజాయి నెట్‌వర్క్‌ను చేదించిన విషయం తెలిసిందే. తాజాగా నిజామాబాద్ ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ స్వప్న ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోఅర్సపల్లి లో రెండు రోజుల క్రితం అయూబ్ అనే గంజాయి సరఫరాదారును పట్టుకొన్నారు. అతని ద్వారా మహారాష్ట్రలోని బోకర్ కు చెందిన ఫరూక్ ఖురేషి, షేక్ ఫహీం, షేక్ సిద్దిక్, జుబేర్ ఫఠాన్ లను పట్టుకున్నట్టు నిజామాబాద్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి తెలిపారు... సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఎక్సైజ్ డిసి సోమిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.... తొలిసారి నిజామాబాద్ పోలీసులు మహారాష్ట్ర స్మగ్లర్లను నవీపేట్ మండలం యంచ వద్ద దాడులు నిర్వహించి నలుగురు గంజాయి స్మగ్లర్లను పట్టుకున్నారని తెలిపారు. ఐదుగురు వద్ద 25 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వారి వద్ద నుంచి ఒక కారు, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నారు మరొక కీలక సూత్రధారి కోసం గాలిస్తున్నట్టు సమాచారం. మహారాష్ట్ర నుంచి నిజామాబాద్ కు గంజాయి రవాణా అవుతున్నట్టు గుర్తించి పథకం ప్రకారం కీలక సూత్రధారుని పట్టుకొని అతని ద్వారా మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.. పోలీసులకు చిక్కకుండా గంజాయి స్మగ్లర్లు ముందుగా వాహనాలలో రెక్కి నిర్వహించి కారులో గంజాయి రవాణా చేస్తున్నట్టు



తెలిసింది. గంజాయి దందా లో తలపండిన వారి కోసం ఎక్సైజ్ అధికారుల వెట కొనసాగుతోంది. గంజాయి కి చాలా డిమాండ్ ఉండడంతో చిన్నచిన్న ప్యాకెట్లలో అమ్ముతూ విద్యార్థులను యువతను గంజాయికి వ్యసనపరులుగా మారుస్తున్నారు. నిజామాబాద్ ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ టీం ఆధ్వర్యంలో గంజాయి నెట్వర్క్ చేదనకు కసరత్తు జరుగుతుంది.

# రైతులు అవగాహన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలి

- **కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**

**నిజామాబాద్, ఏప్రిల్ 21(మనం ప్రతినిధి):** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిరాజ్ డిగ్రీ కళాశాల ఆవరణలో రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న రైతు మహోత్సవంలో వివిధ అంశాలపై రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. తొలిరోజైన సోమవారం పసుపు సాగులో మెళకువలు, ఆదర్శ రైతుల అనుభవాలు, చెరకు సాగులో అవరోధాలను ఎలా అధిగమించాలి, ఆయిల్ పామ్ సాగుతో సమకూరే ప్రయోజనాలు, వరి పంటలో మేలు రకాలు, నిర్ణీత సమయంలో పంట విత్తుకోకపోతే కలిగే నష్టాలు, మొక్కజొన్న పంట సాగులో పాటించాల్సిన జాగ్రత్తలు, సుగంధ ద్రవ్యాల సాగు, వాటి ఆధారిత ఉత్పత్తులు, మార్కెట్ లో డిమాండ్ ఉన్న పంటలు, వ్యవసాయ ఆధారిత ఉత్పత్తుల గురించి వ్యవసాయ




శాస్త్రవేత్తలు, నిపుణులు అవగాహన కల్పించగా, ఆదర్శ రైతులు తమ అనుభవాలను వివరిస్తూ రైతులలో ఆసక్తిని పెంపొందింపజేశారని తెలిపారు.

22న మంగళవారం నిర్వహించే అవగాహన కార్యక్రమాల వివరాలు

రైతు మహోత్సవంలో భాగంగా ఈ నెల 22న ఉదయం 10 గంటలనుండి సాయంత్రం 5 గంటల వరకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, ఆయా అంశాలపై రైతులకు అవగాహన కల్పించనున్నారని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు.

22వ తేదీ ఉదయం 10 గంటల నుండి 10:30 వరకు నాణ్యమైన పసుపు పంట సాగు పద్ధతులపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంకు చెందిన సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.మనోహర్ రావు రైతులకు అవగాహన కల్పిస్తారని, 10:30 నుండి 10:45 గంటల వరకు మామిడి, ఇతర పండ్ల తోటల పెంపకం పై సంగారెడ్డి ఫల పరిశోధన కేంద్రం సైంటిస్ట్ డాక్టర్ పి.హరికాంత్ అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఉదయం 10:45 నుండి 11:15 గంటల వరకు ఆయిల్ పామ్ సాగుపై శాస్త్రవేత్త నర్సింహారావు, 11:15 నుండి 11:30 గంటల వరకు ఆదర్శ రైతు సుభాష్ తన అనుభవాలను వెల్లడిస్తారని, 11:30 నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు సేంద్రీయ పంటల సాగుపై మంచిర్యాల కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ కె.శివకుమార్, 12:00 నుండి 12:15 వరకు ఆదర్శ రైతు సోమరాజారెడ్డి స్వీయ అనుభవాలను వివరిస్తారని,12:15 నుండి 12:45 వరకు సోయాబీన్, పత్తి పంటల సాగులో మెళకువల గురించి ఆదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ వై.ప్రవీణ్, 12:45 నుండి 1:00 వరకు ఆదర్శ రైతు ఆలేటి బాలకిషన్ తన అనుభవాలను తెలియజేస్తారని అన్నారు.

భోజనానంతరం మధ్యాహ్నం 2:00 నుండి 2:30 గంటల వరకు పశువుల మేత, నిర్వహణ అంశాలపై డాక్టర్ నితీష్ వర్మ, 2:30 నుండి 2:45 వరకు ఆదర్శ రైతు ఎన్.గంగారాం కూరగాయల సాగుపై తన అనుభవాలను పంచుకుంటారని, 2:45 నుండి 3:15 వరకు డెయిరీ నిర్వహణపై ఆకుల పాపయ్య, 3:15 నుండి 3:30 వరకు ఆయిల్ పామ్, పసుపు సాగుపై డి.గంగారెడ్డి, 3:30 నుండి 4:00 వరకు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం గురించి నిజామాబాద్ జిల్లా మత్స్యశాఖ అధికారి డి.ఆంజనేయులు, సాయంత్రం 4:00 నుండి 4:15 వరకు స్పాన్ పెంపకంపై ఆదర్శ రైతు వెలగపూడి గోపాల్, 4:15 నుండి 4:45 వరకు మిర్చి పంట సాగుపై శాస్త్రవేత్త కె.నాగరాజు, 4:45 నుండి 5:00 గంటల వరకు కూరగాయల సాగుపై ఆదర్శ రైతు నాగ పోతరావు అవగాహనా కల్పిస్తారని కలెక్టర్ వివరించారు. రైతులు అధిక సంఖ్యలో హాజరై అవగాహన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## 76 వ సారి రక్తదానం చేసిన డాక్టర్ బాలు

- **వృద్ధురాలికి సకాలంలో రక్తం అందజేత**
- **రక్తానికి ప్రత్యామ్నాయ మార్గాలు లేవు**

**కామారెడ్డి రూరల్, ఏప్రిల్ 21 (మనం న్యూస్):** కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం మల్లుపేట్ గ్రామానికి చెందిన బాలవ్వ (68) కు అత్యవసరంగా ప్రభుత్వ వైద్యశాల కామారెడ్డి లో ఓ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో వారికి కావాల్సిన రక్తాన్ని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు జిజిహెచ్ రక్తనిధి కేంద్రంలో 76 వ సారి రక్తదానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ బాలు



మాట్లాడుతూ., రక్తానికి ప్రత్యామ్నాయ మార్గాలు లేవని ఆపదలో ఉన్నవారికి సకాలంలో రక్తాన్ని అందజేసినప్పుడే వారి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని రక్తదానం పట్ల ఉన్న అపోహలను విడనాడి రక్తదానం చేయడానికి ముందుకు రావాలని, రక్తదానం చేసే వారిలో గుండెపోటు, కొలెస్ట్రాల్, క్యాన్సర్ లాంటి వ్యాధులు వచ్చే అవకాశం చాలా వరకు తక్కువ అని అన్నారు. తలసేమియా చిన్నారుల కోసం,ప్రభుత్వ వైద్యశాలలోని రక్తనిధి కేంద్రాలకు కావలసిన రక్తాన్ని అందజేయడం కోసం రక్తదాన శిబిరాలను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి రక్తదాతల సమూహ ఉపాధ్యక్షులు ఎర్రం చంద్రశేఖర్, బుక్క రజనిబాలు టెక్నీషియన్ ప్రమోద్ లు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- **ప్రభుత్వ సలహాదారుడు మొహమ్మద్ షబ్బీర్ అలీ**

**నిజామాబాద్, ఏప్రిల్ 21(మనం ప్రతినిధి):** నిజామాబాద్ పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ నిజామాబాద్ అర్బన్ నియోజక వర్గానికి చెందిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ( సిఎంఆర్ఎఫ్) 21 చెక్కులను దాదాపు 20లక్షల రూపాయలు లబ్దిదారులకు పంపిణి చేశారు.ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ నిజామాబాద్ అర్బన్ నియోజక వర్గంలోనీ పలు



కాలనీల లోని బాధితులకు సీఎం సహాయ నిధి నుండి నిధులు మంజూరు చేయించడం జరిగింది అన్నారు..అనారోగ్యంతో అప్పుల పాలైన వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఎంతో కొంత ఉపశమనం కలిగిస్తాయి అన్నారు. పేదలకు సహాయంగా అండగా. నియోజకవర్గ ప్రజల మంచి మాత్రమే కోరుకుంటామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు మరియు కొత్త రేషన్ కార్డులు అర్హులకు అందిస్తాం,ఎన్నికల్లో ఇచ్చిన హామీల కంటే ఎక్కువగానే అమలు చేస్తున్నాం రుణమాఫీ చేసి చూపించాం రైతు భరోసా అందిస్తున్నాం, మహిళలకు ఉచిత బస్సు 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ 200 యూనిట్ వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం అన్నారు.రాజీవ్ యువ వికాసం పథకానికి నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## ఘనంగా ఏఐబి ఈ ఏ ఫౌండేషన్ డే

- **అసోసియేషన్ సీనియర్ నాయకులు బోస్ బాబు**

**నిజామాబాద్ స్పోర్ట్స్,ఏప్రిల్ 21( మనం న్యూస్):** ప్రతి ఒక్కరు ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా ఏఐబి ఈ ఏ క్రీడ పోటీల్లో బ్యాంక్ ఉద్యోగులు పాల్గొనడం చాలా ఆనందంగా ఉంది. ప్రతి బ్యాంకు ఉద్యోగి విధుల్లో నిమగ్నమైపోయి దేశ అభివృద్ధి కోసమే పాటుపడే బ్యాంక్ ఉద్యోగస్తులు ఈ రకంగా క్రీడ పోటీలలో పాల్గొనడం శారీరకంగా ఉత్సాహాన్ని కలిగిస్తుందని బ్యాంక్ అసోసియేషన్ జాతీయ నాయకుడు బోస్ బాబు అన్నారు. సోమవారం నగర శివారులోని గ్లోబల్ స్కూల్ లో బ్యాంక్ ఉద్యోగస్తుల సంఘాల పథకాన్ని ఎగురవేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని బ్యాంక్ ఉద్యోగస్తులు తమ సమస్యలను పరిష్కారం పోరాటం చేస్తూనే దేశం ఆర్థికంగా ఎదగడానికి ఎంతో కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. ఈ సంఘం స్థాపించి 80 వ వసంతంలో అడు గేస్తున్న సందర్భంగా క్రీడల ఉత్సవాలను జరుపుకోవడానికి అన్ని బ్యాంక్ ఉద్యోగస్తులు ఏకతాటిపై కొచ్చి పాల్గొనడం చాలా గొప్ప



విషయమని ఆయన అన్నారు. రాబోయే రోజులలో ఒకవైపు ట్యాంకుల అభివృద్ధికి తో పాటు బ్యాంకులలో ఉన్న ఉద్యోగస్తుల సమస్యలు పరిష్కరించుకునేందుకు జాతీయ స్థాయిలో సమస్యలను తీసుకెళ్లి తమకు రావాల్సిన హక్కులను సాధించుకొని తీరుతామని ఆయన అన్నారు. ఈ 80 వ క్రీడా ఉత్సవాలలో షటిల్, వాలీబాల్, క్యారం, చెస్, బ్యాట్మెంటల్, టేబుల్ టెన్నిస్, 100 మీటర్ల రన్నింగ్, రింగ్ స్పూన్ తో పాటు వివిధ రకాల క్రీడలను నిర్వహించుకోవడం జరిగిందని, ఈ క్రీడ పోటీలను న్యాయ నిర్మాతగా అజ్మత్ ఖాన్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ సంఘం సెక్రటరీ మనోజ్ కుమార్ సింగ్ రీజనల్ వెంకటేష్, ఆదిత్య, కుమార్, ఉదయ్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మహిళా నాయకురాలు శృతి, స్వరూప. సైలజా, దీపిక, శృతి అఖిల, సంధ్య, నాయకులు పాల్గొన్నారు.

## 30 ఎంబసీలు, కాన్సులేట్ల మూసివేత!

- **ట్రంప్ ప్రభుత్వం యోచన**

**వాషింగ్టన్,ఏప్రిల్ 21:** విదేశాల్లోని దాదాపు 30 రాయబార కార్యాలయాలను, కాన్సులేట్లను మూసివేయాలని ట్రంప్ ప్రభుత్వం చూస్తోంది. విదేశాల్లో తమ దౌత్య విధానాల మార్పుల్లో భాగంగా ఈ చర్య చేపట్టనున్నట్లు తెలుస్తోంది. తనకు లభించిన విదేశాంగశాఖ పత్రాలను ఉటంకిస్తూ వాషింగ్టన్ పోస్టు దీనిపై ఒక కథనాన్ని ప్రచురించింది. ముందుగా సోమాలియా, ఇరాక్‌లోని కార్యాలయాలను మూసివేయాలనే సిఫారసులు ఆ పత్రాల్లో ఉన్నాయి. ఈ పత్రాలపై విదేశాంగ మంత్రి రుబియో సంతకాలు చేశారా.. లేదా అన్నది తెలియరాలేదు. ఈ పత్రాల్లోని వివరాల ప్రకారం.. 18 ఎంబసీలను, 17 కాన్సులేట్లను ట్రంప్ ప్రభుత్వం మూసివేయాలని భావిస్తోంది. వీటిలో ఎక్కువ భాగం ఐరోపా, ఆఫ్రికాల్లోనే ఉన్నాయి. ఆసియా, కరీబియన్లలో ఒక్కోటి ఉన్నాయి. మూసివేయాలని భావిస్తున్న ఎంబసీల్లో మాల్టా, లక్సెంబర్గ్, లెసోతో, రిపబ్లిక్ ఆఫ్ కాంగో, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్, దక్షిణ సూడాన్ ఉన్నాయి. మూసివేయాలనుకుంటున్న కాన్సులేట్లలో 5 ఫ్రాన్స్‌లో, 2 జర్మనీలో, 2 బోస్నియా అండ్ హెర్జిగోవినా, 1 బ్రిటన్‌లో, 1దక్షిణాఫ్రికాలో, 1 దక్షిణ కొరియాలో ఉన్నాయి.

మూసివేసిన ఎంబసీల కార్యకలాపాలను పొరుగు దేశాల నుంచి నిర్వహించాలని విదేశాంగశాఖ పత్రాలు సూచించాయి. ఎంబసీలు, కాన్సులేట్ల మూసివేతపై స్పందించేందుకు విదేశాంగశాఖ అధికార ప్రతినిధి టామీ బ్రూస్ నిరాకరించారు. ఏవైనా అనుమానాలుంటే శ్వేతసౌధాన్ని సంప్రదించాలని సూచించారు. లీకైన పత్రాల్లోని వాటిపై ఎలా స్పందించగలమని, అవన్నీ తప్పని స్పష్టం చేశారు.

## ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిశీలించాలి

- **కామారెడ్డి అదనపు కలెక్టర్ వి. విక్టర్**

**కామారెడ్డి, ఏప్రిల్ 21 (మనంప్రతినిధి):** ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి సత్వర చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి. విక్టర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజా వాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించే వెంటనే డిస్పోస్ చేయాలని అన్నారు. ఈ రోజు ప్రజావాణి లో (108)అర్జీలు రావడం జరిగాయని తెలిపారు. ప్రజాపాలనలో రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తుల పై విచారణ త్వరగా నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వం జారీచేసిన కొత్త వెర్షన్ లో చేపట్టాలని తెలిపారు. సబ్ కలెక్టర్, ఆర్డీఓ లు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం కొనిగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రారంభించడం జరిగాయని, అయ్యా కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్లు పర్యవేక్షించాలని ఆయన సూచించారు. కొన్ని కేంద్రాల్లో ధాన్యం ఉన్నప్పటికీ కొనుగోళ్లు జరగడం లేదని అధికారుల దృష్టికి వచ్చిందని తెలిపారు. కొన్ని మండలాల్లో రెండుపడక గదుల ఇళ్ల కేటాయింపునకు లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని అన్నారు. తహసీల్దార్లు ఆన్లైన్ లో ధరణీ ఫైల్స్ ఫార్వర్డ్ చేస్తున్నారనీ, మాన్యువల్ ఫైల్స్ పంపించడం లేదని అన్నారు. ఈ ప్రజావాణిలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్, ఆర్డీఓ వీణ, కలెక్టరేట్ పరిపాలన అధికారి మసూద్ అహ్మద్, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## హార్ట్ సర్జరీ కోసం 2,25,000 ఎల్ ఓ సి అందజేత

- **మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి**

**భీంగల్, ఏప్రిల్ 21(మనంన్యూస్):** భీంగల్ మండల కేంద్రానికి చెందిన నస్రీన్ బేగం అహ్మద్ హార్ట్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ హార్ట్ బైపాస్ సర్జరీ అవసరమై నిమ్స్ హాస్పిటల్ లో చేరడంతో స్థానిక



నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వారికి చికిత్స కొరకు 2,25,000 రూపాయల ఎల్ ఓ సి మంజూరు చేయించారు.ఈ రోజు హైదరాబాద్ లోని నివాసంలో బాధితునికి ఎల్ ఓ సి కాపీ అందజేశారు ఈ సందర్భంగా ఎల్ ఓ సి మంజూరు చేయించిన మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి కి వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

## జాతీయం- అంతర్జాతీయం

### బీజింగ్ ప్రతీకారం: అమెరికా చట్టసభ్యులపై చైనా ఆంక్షలు..!

**బీజింగ్, ఏప్రిల్ 21:** అమెరికాపై చైనా మరోసారి ప్రతీకార చర్యకు దిగింది. అగ్రరాజ్యానికి చెందిన కాంగ్రెస్ సభ్యులు, అధికారులు, ఎన్జీవో అధిపతులపై ఆంక్షలు విధించింది. చైనా-అమెరికా వాణిజ్య యుద్ధం తారస్థాయికి చేరడంతో.. పరస్పర ప్రతీకార చర్యలు



వేగవంతమయ్యాయి. తాజాగా అమెరికా కాంగ్రెస్ సభ్యులు, ప్రభుత్వ అధికారులు, ఎన్జీవో సంస్థల అధిపతులను లక్ష్యంగా చేసుకొని బీజింగ్ ఆంక్షలు విధించింది. హాంకాంగ్‌కు సంబంధించిన అంశాల్లో అతి ప్రవర్తన కారణంగానే ఈ చర్యలు తీసుకొన్నట్లు చైనా విదేశాంగశాఖ వెల్లడించింది. గత నెలలో ఆరుగురు చైనా, హాంకాంగ్ అధికారులపై అమెరికా ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. దీనిపై తీవ్రంగా స్పందించిన చైనా.. ట్రంప్ ప్రభుత్వ తీరును ఖండించింది. అప్పుడే బీజింగ్ ప్రతీకారానికి సిద్ధమైనట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ''హాంకాంగ్‌కు సంబంధించిన సమస్యపై అమెరికాకు చెందిన కాంగ్రెస్ సభ్యులు, అధికారులు, ఎన్జీవో అధిపతులు అతిగా స్పందిస్తున్నారు. తప్పుడు చర్యలపై చైనా ప్రతిఘటిస్తుంది'' అని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి గువో జియాకున్ పేర్కొన్నారు. కాగా.. అమెరికాలో ట్రంప్ అధికారం వచ్చాక ఆయన ప్రభుత్వం ప్రపంచ దేశాలపై టారిఫ్లతో వాణిజ్య యుద్ధం చేస్తోంది.

## వారు హంతకులకంటే ప్రమాదకరం.. పిల్లల అక్రమ రవాణాపై సుప్రీంకోర్టు

**ఢిల్లీ,ఏప్రిల్ 21:** దేశ రాజధాని ప్రాంతంలో ఇటీవల అదృశ్యమైన ఆరుగురు పిల్లలను రక్షించాలని ఢిల్లీ పోలీసులను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ సందర్భంగా పిల్లల అక్రమ రవాణా విషయంలో సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. చిన్నారుల అక్రమ రవాణాకు పాల్పడేవారిని చట్టం ముందు నిలబెట్టాలని.. అలాంటి ముఠాలు ఈ సమాజానికి ఎంతో ప్రమాదకరమని హెచ్చరించింది. నవజాత శిశువులను రూ.లక్షలకు అమ్ముతున్నట్లు వచ్చిన వార్తలపై జస్టిస్ జేబీ పార్థివాలా, జస్టిస్ ఆర్ మాధవన్లతో కూడిన ధర్మాసనం సుమోటోగా విచారణ చేపట్టింది. ''ఆ ఆరుగురు చిన్నారుల ఆచూకీని తప్పకుండా గుర్తించండి. పిల్లలను అమ్ముతున్న, కొంటున్న వారిని చట్టం ముందు నిలబెట్టండి. వారందరూ నిందితులే. వారంతా సమాజానికి పెద్ద ముప్పుగా పరిణమించారు'' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పిల్లల



అక్రమ రవాణాదారులు.. హంతకులకంటే ప్రమాదకరమని జస్టిస్ పార్థివాలా అన్నారు. ''ఎవరైనా ఒక వ్యక్తిని హత్య చేస్తే.. దాని వెనక పలు కారణాలు, ఉద్దేశాలు ఉంటాయి. ఆ తర్వాత అతడు మరో హత్య చేయకపోవచ్చు. కానీ.. పిల్లలను కిడ్నాప్ చేసి అమ్మేవారు.. ఆ నేరాలకు మళ్లీ మళ్లీ పాల్పడుతున్నారు. వారు ఈ సమాజానికి మరింత ప్రమాదకరమైనవారు'' అని ఆందోళన వ్యక్తంచేసింది. ఢిల్లీలో పిల్లల అక్రమ రవాణా రాకెట్ వెనకున్న కీలక సూత్రధారిని వెంటనే పట్టుకోవాలని పోలీసులను కోర్టు ఆదేశించింది. ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో చిన్నారులను రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు విక్రయిస్తున్నారని.. దీని వెనక ఒక పెద్ద ముఠా పనిచేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని కోర్టు పేర్కొంది. అయితే.. వీరిలో కొందరు చిన్నారులు అపహరణకు గురికాలేదని.. తల్లిదండ్రులే అమ్మేస్తున్నారని కోర్టుకు పోలీసులు నివేదించారు. పిల్లలు దొరికిన అనంతరం వారిని తిరిగి తీసుకోవడానికి తల్లిదండ్రులు సిద్ధంగా లేకపోతే.. అప్పుడు ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలని కోర్టు పేర్కొంది. ప్రతి ఏడాది దాదాపు రెండు వేల పిల్లల అక్రమ రవాణా కేసులు వెలుగులోకి వస్తున్నాయని జాతీయ క్రైమ్ రికార్డు బ్యూరో నివేదికలు వెల్లడిస్తున్నాయి.

## కెనడాలో హిందూ ఆలయంపై దాడి

**ఒట్టావా,ఏప్రిల్ 21:** కెనడాలోని సిక్కు వేర్పాటువాదులు మరోసారి రెచ్చిపోయారు. ఖలిస్థానీ జెండాలతో ఏప్రిల్ 19న సర్రేలోని శ్రీ లక్ష్మీ నారాయణ ఆలయం వద్ద వీరంగం సృష్టించారు. వారి దాడిలో దేవాలయ ప్రవేశద్వారం, స్తంభాలు ధ్వంసం అయ్యాయి. శనివారం ఉదయం 3గంటల ప్రాంతంలో ఇద్దరు దుండగులు ఖలిస్థానీ నినాదాలు చేస్తూ..ఆలయంలోకి ప్రవేశించి స్తంభాలు,



ద్వారాలపై ఖలిస్థానీ అనుకూల రాతలు రాశారని ఆలయ అధికారులు పేర్కొన్నారు. ఆధారాలు దొరకకుండా సీసీటీవీ కెమెరాలను దొంగలించారని అన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినే ఇటువంటి ద్వేషపూరిత విధ్వంసాలను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంపై కేసు నమోదు చేశామని స్థానిక పోలీసులు వెల్లడించారు. ఘటన వెనుక భారత వ్యతిరేక శక్తుల హస్తం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. మళ్లీ ఇటువంటి దాడులు జరగకుండా ఆలయం వద్ద భద్రతా దళాలు మోహరించాయని అన్నారు.

## ఐఎస్ఎస్‌కు శుభాంశు శుక్లా... ప్రయోగాలు చేయనున్న వ్యోమగామి!

ముంబయి, ఏప్రిల్ 21 :ఐఎస్ఎస్‌కు వెళ్లనున్న శుభాంశు శుక్లా తన మిషన్‌లో భాగంగా ఏడు ప్రయోగాలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు సమాచారం.అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేపట్టబోయే యాత్ర కోసం ప్రధాన వ్యోమగామిగా గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాను ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. యాక్సియమ్-4 మిషన్లో భాగంగా మే నెలలో ఐఎస్ఎస్‌కు వెళ్లనున్నారు. కాగా ఆయన కనీసం ఏడు ప్రయోగాల్లో పాల్గొననున్నట్లు తెలుస్తోంది. అంతరిక్షంలో పంట సాగు, వాటర్స్ బేర్ (నీటి ఎలుగుబంటి) గురించి అధ్యయనం చేయనున్నట్లు తెలుస్తోంది.

టార్డిగ్రేడ్, సూక్ష్మ కణజాల జీవిగా పిలిచే నీటి ఎలుగుబంటి భూమండలంపై జీవించి ఉండే అత్యంత అరుదైన జీవి. 0.3 మి.మీల నుంచి 0.5 మి.మీల పొడవు ఉండి పర్యావరణంలో అత్యంత కఠినమైన పరిస్థితులను తట్టుకుని జీవించే డీఎన్ఏను కలిగి ఉంటుంది. ఇలాంటి అరుదైన జీవి డీఎన్ఏను డీకోడ్ చేసిన ఇస్రో.. సూక్ష్మ గురుత్వాకర్షణ శక్తిలో పునరుత్పత్తిని.. భూమి, అంతరిక్షంలో జన్యు మార్పిడిని అధ్యయనం చేయనుంది. అత్యంత శక్తిమంతమైన సూర్యరశ్మితో పాటు గురుత్వాకర్షణ కలిగిన వాతావరణంలో ఈ జీవి డీఎన్ఏలో కలిగే మార్పులకు అనుగుణంగా వ్యోమగాముల రక్షణ వ్యవస్థలను



తయారు చేయనుంది. ఈ అధ్యయనం త్వరలో ప్రయోగించే మానవసహిత గగన్యాన్ మిషన్‌కు ఉపయోగపడనుందని ఇస్రో అంచనా వేస్తోంది. అలాగే ఈ యాత్రలో భాగంగా అంతరిక్షంలో కంప్యూటర్ స్క్రీన్లను ఉపయోగించడం వల్ల కలిగే మార్పులను అర్థంచేసుకోనున్నారు. మైక్రోగ్రావిటీలో గేజ్ ఫిక్సేషన్, వేగంగా కంటిని కదిలించడం వల్ల ఒత్తిడి స్థాయులు ఎలా ఉంటాయో పరిశీలించనున్నారు. దీనివల్ల భవిష్యత్ అంతరిక్ష నౌకల్లో కంప్యూటర్ల రూపకల్పనకు ఉపయోపడనుంది. ఇలా మొత్తం ఏడు పరిశోధనలు చేయనున్నారు.భారత్ ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన తొలి మానవసహిత అంతరిక్షయాత్ర 'గగన్యాన్' కోసం ఇస్రో తీవ్ర కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. దీనికి ముందేఅంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి మన వ్యోమగామి పంపించనున్నారు. భారత్-అమెరికా సంయుక్తంగా చేపడుతోన్న ఈ మిషన్‌లో గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాను ఇస్రోఇదివరకే ఎంపిక చేసింది. గగన్‌యాన్‌కు ఎంపికైన నలుగురు వ్యోమగాముల్లో శుభాంశు శుక్లా అతిపిన్న వయస్కుడు కావడం గమనార్హం.

# అంగన్వాడీలో పోషణ సంబరాలు

- అంగన్వాడీ లలో పోషణ...పక్వాడి కార్యక్రమం
- తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి




**తుంగతుర్తి, ఏప్రిల్ 21 (మనం న్యూస్):** తుంగతుర్తి ఐసిడిఎస్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలలోని పోషణ పక్షంలో భాగంగా పోషణ అభియాన్ కార్యక్రమాన్ని సోమవారం కరివిరాల రైతు వేదికలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి హాజరై తదనంతరం వారు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడ అనేది ప్రతి సంవత్సరం ఏప్రిల్ 8 నుండి 22 వరకు నిర్వహించే ఒక కార్యక్రమం .ఇది పోషకాహారం గురించి అవగాహన కల్పించడానికి మరియు తల్లి ,బిడ్డల ఆరోగ్యానికి అవసరమైన పోషకాహారం గురించి ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం నిర్వహించబడుతుందన్నారు. నేటి ఆధునిక జీవన విధానాలు నాణ్యమైన పోషకాహారాన్ని తీసుకోవాలని వైద్యులు ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారని ఈ క్రమంలో మహిళా శిశు సంక్షేమ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి చేస్తున్నాయన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు, పౌష్టికాహారం అందిస్తున్నాయన్నారు. ప్రతి ఇంట్లో సమతుల ఆహారం అందించడంపై పేదరికం కుటుంబ పరిస్థితులు పలు రకాల కారణాలతో తల్లిదండ్రులు తగిన శ్రద్ధ చూపడం జరగదు కాబట్టి గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవనం గడిపేవారు అధికంగా ఉంటారు కనుక వీరికి పోషకాహాలపై అవగాహన సరిగా ఉండదు గనుక చిన్నారులు గర్భిణీలు బాలింతలు పోషకాహార లోపాన్ని అధికమించి సంపూర్ణ ఆరోగ్య సమాజం కోసం రాష్ట్ర ప్రభుత్వం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ పోషక పక్షం కార్యక్రమం నిర్వహిస్తున్నారని పోషన్ పక్వాడ 2025 అనేది కేవలం అవగాహన ప్రచారం మాత్రమే కాదు ఇది పోషకాహారం ఒక తల్లి ఒక బిడ్డ ఇద్దరు ఒక సమయంలో ఒక భోజనంగా మార్చే ఉద్యమం అధునాతన సాంకేతికతతో అంగన్వాడీ కార్యకర్తలను శక్తివంతం చేయడం మరియు సంఘాలను భాగస్వామ్యం చేయడం ద్వారా భారతదేశం ఆరోగ్యకరమైన బలమైన తరం దిశగా ధైర్యమైన అడుగులు వేస్తుంది అనడానికి ఈ పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. తుంగతుర్తి ఐసిడిఎస్ సిడిపిఓ మాట్లాడుతూ బిడ్డకు 1000 రోజుల ప్రాముఖ్యత గురించి వివరించడం జరిగింది. ఈ 1000 రోజులంటే కడుపులో ఉన్నప్పటి నుండి రెండేళ్లు నిండే వరకు గడిచే దశ బిడ్డ భవిష్యత్తును నిర్ణయిస్తుందన్నారు. మొదటి 1000 రోజుల్లో బిడ్డ బరువు, ఎత్తు అత్యంత వేగంగా పెరుగుతాయని 80 శాతం మెదడు అభివృద్ధి ఈ 1,000 రోజుల్లోనే పూర్తవుతుందని మరియు రోగనిరోధక శక్తి కూడా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని వివరించారు.. కాబట్టి గర్భిణీలుగా ఉన్నప్పటి నుండి అంగన్వాడీ కేంద్రంలో ఇచ్చే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు అంగన్వాడీ పరిధిలో గల మహిళలకు చిరుధాన్యాల వల్ల అందే పోషక విలువలను తెలియజేయడం జరుగుతుందని అన్నారు ప్రతి ఒక్క మహిళ రాగులు, సజ్జలు, కొర్రలు మొదలగు చిరు ధాన్యాలలో ఐరన్, పిండి పదార్థాలు అధికంగా లభిస్తాయని తెలిపారు. చిరు ధాన్యాలు తప్పనిసరిగా మహిళలందరూ స్వీకరించి ఆరోగ్యంగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ దయానందం, ఎంపీడీవో శేషు కుమార్, పల్లె డాక్టరు ,అంగన్వాడీ సూపర్వైజర్ లు కైరునిస ,మంగ , అంగన్వాడి టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు,తల్లులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.రు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ దయానందం, ఎంపీడీవో శేషు కుమార్, పల్లె డాక్టరు ,అంగన్వాడీ సూపర్వైజర్ లు కైరునిస ,మంగ , అంగన్వాడి టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు,తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన తహసిల్దార్



**పెన్ పహాడ్, ఏప్రిల్ 21 (మనం న్యూస్):** మండల పరిధిలోని అనంతారంలో ఏర్పాటు చేసిన (నారాయణ గూడెం) పిఏసిఎస్ పెన్ పహాడ్ లో ఏర్పాటు చేసిన (చీదేళ్ల) పి ఎస్ సి ఎస్ కొనుగోలు కేంద్రాలను స్థానిక ఇన్చార్జి తహసీల్దార్ ధారావత్ లాలు నాయక్ సోమవారం పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంటాలు వేసిన ధాన్యాన్ని అలాట్మెంట్ చేసిన మిల్లులకు వెంట, వెంటనే తరలించాలని నిర్వాహకులకు సూచించారు రైతుల సమాచారం మేరకు కొనుగోలు కేంద్రాలను పరిశీలించి తగిన సూచనలు సలహాలు అందించినట్లు తెలిపారు వాతావరణంలో మార్పులు వస్తున్నందున ఎప్పటికప్పుడు ధాన్యాన్ని తరలించేందుకు అనంతారం పిఏసిఎస్ కొనుగోలు కేంద్రానికి ధాన్యం ఎగుమతి చేసి దిగుమతి కోసం కోసం కాంటాలు వేసిన బ్యాగుల సామర్థ్యాన్ని బట్టి రెండు లారీలను, పెన్ పహాడ్ పి ఎస్ ఎస్ కొనుగోలు కేంద్రానికి ఒక లారీ అనాజిపురం ఐకెపి కొనుగోలు కేంద్రానికి మరో లారీని పంపించడం జరిగిందని అన్నారు రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని వెంట వెంటనే కాంటాలు వేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ సీఏవోలు ఆలకుంట్ల సైదులు, సోమ్లా, సిబ్బంది లక్ష్మారెడ్డి సైదులు తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ బహిరంగ సభను విజయవంతం చేయాలి




- రాష్ట్ర నాయకులు నలగాటి ప్రసన్నరాజ్

**నకిరేకల్, ఏప్రిల్ 21(మనం న్యూస్):** ఈనెల 27వ తేదీన వరంగల్ లో నిర్వహించే రజతోత్సవ సభకు కార్యకర్తలు,ప్రజలు ఉద్యమంలా కదిలి రావాలని రాష్ట్ర నాయకులు నలగాటి ప్రసన్న రాజ్ కోరారు.నకిరేకల్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా గ్రంధాలయ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్ రెడ్డి, మాజీ ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీలను అమలు చేయడం లేదని మండిపడ్డారు.తెలంగాణ సాధించిన ఘనత కేసిఆర్ కే దక్కుతుందన్నారు.రాష్ట్ర ప్రజలంతా మళ్ళీ కెసిఆర్ పాలన కోరుకుంటున్నారని గుర్తు చేశారు. ఈ సభ ద్వారా అధికార పార్టీ నాయకులకు కనువిప్పు కలగాలన్నారు. మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి నాయకత్వంలో జిల్లా ప్రజలు, కార్యకర్తలు ఏకతాటిగా కదలిరావాలన్నారు.అభివృద్ధి చేయలేక కేసీఆర్ పై అబండాలు మోపుతున్నారని మండిపడ్డారు.మంత్రులకు తమ శాఖలపై కనీస అవగాహన లేదన్నారు. దీంతోనే ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రజలు ఆందోళన చెందుతున్న విషయాన్ని వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి ఏ ఒక్క హామీని పూర్తి చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో చల్ల కృష్ణారెడ్డి, ఊటుకూరి ఏడుకొండలు, నూక సైదులు, ఎల్లపు రెడ్డి సైదిరెడ్డి, పుల్లంల ముత్తయ్య, యాతాకుల సోమయ్య, చెరుకు వెంకటాద్రి,చింతమల్ల శ్రీను,పంజాల రామలింగం, కొత్త నరసింహ, గుండాల రమేష్, చిట్యాల రాజిరెడ్డి, చెవుగోని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ శివాలయంలో ప్రత్యేక పూజలు



- రజితోత్సవ సభకు గులాబీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలి

**సూర్యాపేట ఏప్రిల్ 21 (మనం ప్రతినిధి):** సూర్యాపేట రూరల్: ఈనెల 27న వరంగల్ జిల్లాలో నిర్వహించే బిఆర్ఎస్ రజితోత్సవ సభ విజయవంతం కావాలని పిల్లల మర్రి శివాలయంలో బిఆర్ఎస్ నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సన్నాక సమావేశంలో పట్టణ ప్రధాన కార్యదర్శి బూర బాల సైదులు గౌడ్ మాట్లాడుతూ... సమైక్యపాలనలో వివక్ష గురైన తెలంగాణ ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్ర సాధనతో తెలంగాణ రాష్ట్రంలో మాజీ సీఎం కేసీఆర్ నెంబర్ వన్ గా తీర్చిదిద్దారని కృషి చేశారని గుర్తు చేశారు. రాష్ట్ర సాధనలో ఎన్నో అడ్డంకులను ఎదుర్కొని, ప్రాణాలను సైతం లెక్కచేయకుండా శాంతియుత వాతావరణం లో పోరాటాలు కొనసాగించారని వివరించారు. మార్పు పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరంన్నర కాలంలోనే రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో ఏ ఎన్నికల జరిగినా గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు. కెసిఆర్ సభ చూసేందుకు గులాబీ శ్రేణులు ఉత్సాహంతో ఉన్నారని నాయకులు కార్యకర్తలు సమన్వయంతో వ్యవహరించి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు బంగారి శ్రీనివాస్, రాపర్తి సైదులు, బత్తుల రమేష్, రాపర్తి మహేష్, పూర్ణయ్య, శంకరాచారి, జె. సత్యనారాయణ, రాజు, వెంకన్న, లింగయ్య, వీరయ్య, నాగరాజు, సత్తయ్య, అంజయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు. అనంతరం జెండా దిమ్మెను పరిశీలించారు.

## ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం పరిసర ప్రాంత ప్రజలు

- ప్రజలకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసిన డాక్టర్లు
- అభినందించిన జిల్లా గ్రంధాలయ చైర్మన్ గంగాపురం రాజేందర్




**దేవరకొండ, ఏప్రిల్ 21( మనం న్యూస్):** మారుమూల గిరిజన ప్రజలకు మెరుగైన విశేష సేవలు అందించాలన్న సంకల్పంతో ఇంత చక్కటి కార్యక్రమాన్ని నిర్వహించిన సమాచార హక్కు చట్టం రక్షణ సమితి - 2005, ఏగుర్ హాస్పిటల్స్ జడ్చర్ల వారిని నాగర్ కర్నూలు జిల్లా గ్రంధాలయ చైర్మన్ గంగాపురం రాజేందర్ అన్నారు. ఆదివారం నాడు నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం లింగాల మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమాచార హక్కు చట్టం రక్షణ సమితి -2005 వారు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని జడ్చర్ల ఏగూర్ హాస్పటల్ సారధ్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా గ్రంథాలయ చైర్మన్, సొసైటీ న్యాయవాది గంగాపురం రాజేందర్ హాజరయ్యారు. ఈ శిబిరంలో పరిసర ప్రాంత ప్రజలకు అనేక రకాల పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో దాదాపుగా 300 మండల కేంద్ర పరిసర ప్రాంత ప్రజలు ఈ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గ్రంధాలయ చైర్మన్ గంగాపురం రాజేందర్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో ఇలాంటి ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించడం గొప్ప విషయం అని ఇలాంటి శిబిరాన్ని పేద ప్రజల ఆరోగ్య రీత్యా ఆలోచించి ఏర్పాటు చేయడం అభినందనీయమని వారన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం ఎవరైనా మంచి ఆరోగ్యానికి మించిన సంపద లేదు అని వారన్నారు. సమాచార హక్కు చట్టం రక్షణ సమితి వారు ఆహ్వానించి ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం అదృష్టంగా భావిస్తున్నారని వారు అన్నారు. అనంతరం ఈ శిబిరాన్ని నిర్వహించిన రక్షణ సమితి సభ్యులను డాక్టర్లను శాలువాలతో సత్కరించి మెమొంటోళ్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు కొర్ర కిషన్ నాయక్, ఉపాధ్యక్షులు లక్ష్మయ్య ప్రధాన కార్యదర్శి ఎం డి అజీమ్ కార్యదర్శి పగిడిమర్రి యాదగిరి కోశాధికారి జి ఆనంద్ కార్యవర్గ సభ్యులు ప్రకాష్ శ్రీకాంత్ గుప్తా డాక్టర్ బాలు డాక్టర్ జిలాని డాక్టర్ హిదిరిస్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

# కబ్జాకు గురవుతున్న ఈత వనమును పరిరక్షించాలి

- తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ




**చండూరు, ఏప్రిల్ 21 (మనం న్యూస్):** కబ్జాకు గురవుతున్న ఈత వనమును పరిరక్షించాలని, ఈత వనం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ అన్నారు. చండూరు మండల పరిధిలోని నేర్మట గ్రామంలో ఉన్న ఈత వనమును కబ్జాకు గురి కాకుండా పరిరక్షించాలని కోరుతూ కల్లుగీత కార్మికులు ఈత వనం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈత వనం ఉన్న భూమి ప్రభుత్వ బంజరాయి భూమి అయినప్పటికీ గీత కార్మికులకు ఖర్జూర ఈత వనం పెంచడానికి జరిగిందని, ఈత వనం పెంచడానికి ఎక్సైజ్ శాఖకు, గతంలో జిల్లా,మండల రెవెన్యూ అధికారులకు వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని, ఇప్పటికైనా ఆక్రమణకు గురికాకుండా ఈ భూమిని కాపాడాలని, ఖర్జూర ఈత వనమును పెంచడానికి గీత కార్మిక సహకార సంఘానికి కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని ఆయన అన్నారు..గ్రామపంచాయతీ పర్మిషన్ లేకుండా ఈత వనంలో ఉన్న కంపచెట్లను తొలగిస్తున్నారని, ఎవరైనా పర్మిషన్ తీసుకొని కంప చెట్లను తొలగించడంతోపాటు ఈత వనంలో ఉన్న కంపమొద్దులను తొలగించే విధంగా చొరవ తీసుకొని ఈత వనం ను పరిశుభ్రంగా ఉంచాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈత వనంలో ఉన్న కంప చెట్లు విపరీతంగా పేరిగాయని, వాటిని తొలగించాలని ఆయన అన్నారు. ఈత వనం ఉన్న భూమిలో కొందరు మా భూమి అని కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని వెంటనే ప్రభుత్వం స్పందించి ఈత వనం ఉన్న భూమిని కాపాడాలని గీత కార్మికులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారని ఆయన అన్నారు. ఈ గ్రామంలో సుమారుగా 40 మంది గీత కార్మికులు గీత వృత్తిని నమ్ముకొని జీవనోపాధి కొనసాగిస్తున్నారని ఆయన అన్నారు. సామాన్య కల్లుగీత కార్మిక కుటుంబంలో పుట్టిన సర్దార్ సర్వాయి పాపన్న నేడు సమాజంలో అసమానతలకు వ్యతిరేకంగా పోరాటం చేశాడని, భారత రాజ్యాంగంలో చెప్పినట్లుగా ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత్వం కై ఉద్యమించాలని ఆయన అన్నారు. 560 జీవో ప్రకారం ప్రతి సొసైటీకి ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కల్లు గీతకార్మిక సంఘం గ్రామ శాఖఅధ్యక్షులు బుర్కల అంజయ్య గౌడ్, కల్లు గీత కార్మిక సంఘం నాయకులు బండమీది వెంకటయ్య, బోడిగే నగేష్ గౌడ్, యాదయ్య గౌడ్, శంకర్ గౌడ్, బురకల శేఖర్, రాజ్ కుమార్, సైదులు గౌడ్, స్వామి, అంజయ్య,తదితరులు పాల్గొన్నారు.

## ఫెర్టిలైజర్స్ ,పెస్టిసైడ్ డీలర్ల విస్తృతస్థాయి సమావేశం




- రాష్ట్ర ఫర్టిలైజర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గౌరిశెట్టి మునీందర్

**తుంగతుర్తి ,ఏప్రిల్ 21(మన న్యూస్):** ఫర్టిలైజర్, ఫెస్టిసైడ్స్ మరియు సీడ్స్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర ఫర్టిలైజర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గౌరిశెట్టి మునీందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో ఆ సంఘం డివిజన్ అసోసియేషన్ అధ్యక్షులు పూసపెల్లి యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన డివిజన్ డీలర్ల విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గతంలో డీలర్ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశామని, డీలర్లంతా ఏకతాటిపై ఉండి సమస్యల సాధన కోసం ముందుండాలని, సంఘం బలోపేతం కోసం కృషి చేయాలని, డీలర్లకు సమస్యలు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫర్టిలైజర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బజ్జూరి రవీందర్, రాష్ట్ర అసోసియేషన్ సభ్యులు మురిశెట్టి యోగి, డివిజన్ గౌరవ అధ్యక్షులు గుండా ఈశ్వరయ్య, డివిజన్ ప్రధాన కార్యదర్శి సోమ వెంకన్న, డివిజన్ అసోసియేషన్ బాధ్యులు, మండల అసోసియేషన్ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు డీలర్లు పాల్గొన్నారు.

## దామెర భీమనపల్లి పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవం వేడుకలు

**మర్రిగూడ, ఏప్రిల్ 21(మనం న్యూస్):** మండలంలోని దామెర భీమనపల్లి ప్రాథమిక పాఠశాలలో పాఠశాల వార్షికోత్సవం వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ వార్షికోత్సవం వేడుకలకు పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు,అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్,సభ్యులు విద్యార్థులు హాజరయ్యారు. ముందుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉదావత్ లచ్చిరాం 2024-2025 విద్యా సంవత్సరంలో పాఠశాల సాధించిన విద్యా ప్రగతి గూర్చి, విద్యార్థుల ప్రగతి గురించి,తల్లిదండ్రులకు సవివరంగా వివరించారు.ఈ సందర్భంగా తరగతి వారిగా బాలబాలికలు తమ నృత్యాలతో ఆకట్టుకున్నారు.అలాగే విద్యార్థిని విద్యార్థులకు ప్రగతి పత్రాలు అందజేశారు. సమ్మేటివ్ అసెస్మెంట్ - 2 లో తరగతి వారీగా టాపర్లకు బహుమతులు అందజేశారు.




### వినూత్నంగా బడిబాట కార్యక్రమం

ఉదయం పూట వార్షికోత్సవం ముగియగానే పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు కలిసి బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఉదావ త్ లచ్చిరాం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలే ముద్దు - ప్రైవేట్ పాఠశాలలు వద్దు అనీ, ప్రభుత్వం అన్ని రకాల వసతులు ప్రభుత్వ పాఠశాలలో సమకూర్చుతుందని అర్హత, అనుభవం కల్గిన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలో ఉండగా ప్రైవేట్ పాఠశాలలకు మీ విద్యార్థులను పంపి డబ్బులు ఎందుకు వృథా చేసుకుంటున్నారని,మీ పిల్లలకు చదువు మేము గ్యారెంటీ ఇస్తామని,మీ పిల్లలకు చదువు రాకపోతే అడగవచ్చని, ప్రభుత్వ పాఠశాల,ఉపాధ్యాయుల పై నమ్మకం పెంచుకొని మీ బడి ఈడు పిల్లలను ప్రభుత్వ బడికే పంపాలనీ,సందేహం ఉంటే తమ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు, ప్రైవేట్ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులతో కలిపి పోటీ పరీక్ష పెడితే తమ ప్రభుత్వ విద్యార్థులకే అత్యధిక మార్కులు తెచ్చుకుంటారని, గ్రామస్తులు అందరూ సహకరించితే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయని అన్నారు.

### పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 36 నుంచి 68 వరకు పెరుగుదల

ప్రధానోపాధ్యాయులు ఉదావత్ లచ్చిరాం మాట్లాడుతూ 2024 -2025 విద్యా సంవసంవత్సరంలో తాము జూలై నెలలో బదిలీపై దామెర భీమనపల్లి పాఠశాలకు వచ్చినప్పుడు పాఠశాల మొత్తం విద్యార్థుల సంఖ్య 36 మంది ఉండగా నేడు 68 మంది విద్యార్థులతో పాఠశాల కళకళలాడుతుందని, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో, గ్రామస్తుల సహకారంతో, ఉపాధ్యాయుల కృషితో పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడం జరిగిందని ఈ విద్యా సంవత్సరం అనగా 2025 -2026 లో కూడా బడిబాట కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి గ్రామస్తులు తల్లిదండ్రుల సహకారంతో ఉపాధ్యాయుల కృషితో పాఠశాలలో మరింత విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తామని అన్నారు.బడిబాట కార్యక్రమంలో గ్రామస్తుల నుంచి అపూర్వ స్పందన లభించిందని అన్నారు.ఇటీవల డాక్టరేట్ పొందిన ప్రధానోపాధ్యాయులు ఉదావత్ లచ్చిరాం ను పాఠశాల ఉపాధ్యాయ బృందం, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ పాఠశాల వార్షికోత్సవం, బడిబాట కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ మల్లమ్మ, ఉపాధ్యాయులు వై. మంజులత, కొండ శ్రీనివాస్, మీనా కుమారి, అమీనా తల్లిదండ్రులు జిల్లా శంకర్, జిల్లా సురేష్, ఐత రాజు పాపయ్య, మెట్టు రమేష్, సయ్యద్ జానీ, నడిమింటి జంగయ్య, అంబాల రమేష్, ముత్యాలు, మదార్ తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా ఉపాధి హామీ పనులు



- ఈ నెల నుండి అధికంగా హాజరవుతున్న ఉపాధి కూలీలు

**పెన్ పహాడ్, ఏప్రిల్ 21 (మనం న్యూస్):** మండలంలో 2025--26 సంవత్సరానికి సంబంధించిన ఉపాధి హామీ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలకు పనులు నిర్వహిస్తున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు ఉపాధి హామీ కూలీలకు పనులు నిరంతరం కొనసాగుతున్నప్పటికీ వ్యవసాయ పనులు పూర్తి కావడంతో ఈ నెల నుండి కూలీలు అధిక సంఖ్యలో హాజరవుతున్నారు ప్రతిరోజు 2500 నుండి 2700 వరకు కూలీలు ఉపాధి హామీ పనులకు హాజరవుతున్నారని అధికారులు తెలిపారు ఉపాధి హామీ పనులను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి సిబ్బందితో పాటు మండల స్థాయి అధికారులు కూడా పర్యవేక్షణ నిర్వహిస్తున్నారు అయినప్పటికీ ఎండలు తీవ్రంగా ఉండటంతో ఉపాధి హామీ పనుల వద్ద కనీస సౌకర్యాలైన టెంటు, మంచినీరు, పనిముట్లను ఏర్పాటు చేయాలని ఉపాధి హామీ కూలీలు కోరుతున్నారు ప్రభుత్వ నిబంధనల మేరకు ఉపాధి హామీ పనుల వద్ద సకాలానికి కూలీలు హాజరుకావాలని ఒకరికి బదులు మరొకరు పనులకు హాజరు కావద్దని ముందుగానే క్షేత్రస్థాయి సిబ్బంది ఉపాధి హామీ కూలీలకు తెలియజేస్తున్నారు ఏ రోజు కా రోజు పనులకు హాజరైన కూలీల ఫోటోలను, హాజరు పట్టికను ఆన్లైన్లో నమోదు చేస్తున్నట్లు క్షేత్రస్థాయి సిబ్బంది తెలిపారు.

# రైతు లేనిదే రాజ్యం లేదు



● అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్

నిజామాబాద్,ఏప్రిల్ 21(మనం ప్రతినిధి): గిరిరాజ్ కళాశాల మైదానంలో నిర్వహించిన తెలంగాణ రైతు మహోత్సవంలో ముఖ్యఅతిథులుగా రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, ఉత్తమ్ కుమార్, తుమ్మల నాగేశ్వరావు తో నిజామాబాద్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ హాజరు కావడం జరిగింది.ఈ సందర్భంగా రైతులకు కావాల్సిన పరికరాలు, ఉత్పత్తులు, సీడ్, ఫర్టిలైజర్ స్టాల్స్, వ్యవసాయ, ఉద్యానవన శాఖలతోపాటు సెరికల్చర్, ఆయిల్ ఫెడ్ , అనుబంధ శాఖల స్టాల్స్ పరిశీలించడం జరిగింది.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతు రైతులకు నూతన సాంకేతిక విధానాలతో, సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు రైతు మహోత్సవం నిర్వహించడం అభినందనీయం అన్నారు. రైతు లేనిదే దేశం లేదని అలాంటి రైతన్నల పట్ల చిన్నచూపు చూడొద్దని అన్నారు. అకాల వర్షల కారణంగా పంట నష్టపోయిన రైతులకు కేంద్రం పసల్ బీమా యోజన కింద ఇస్తున్న నష్టపరిహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం కూడా అమలు చేయాలనీ సూచించారు. రైతులు పండించిన పంటను సకాలంలో కొనుగోలు చేయాలనీ అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న 500 బోనస్ అన్ని పంటలకు వర్తింప చేయాలని సూచించారు. రైతులకు పెట్టుబడి సహాయం కింద ఎకరానికి 12 వేలు సకాలంలో అందించే విదంగా చర్యలు తీసుకోవాలన్నారు.

# నూతన భూ భారత్ చట్టంపై అవగాహన సదస్సు

● జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ,ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



భూపాలపల్లి, ఏప్రిల్ 21 (మనం ప్రతినిధి): నూతన భూ భారతి చట్టంతో భూముల హక్కులు భద్రంతో పాటు భూ సమస్యలు సత్వర పరిష్కారం జరుగుతాయని, రైతుల మేలుకోసం ప్రజాపాలనలో చారిత్రక మార్పు అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. సోమవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఏ.ఎస్.ఆర్ ఫంక్షన్ హాలులో జరిగిన భూ భారతి నూతన ఆర్ ఓ ఆర్ చట్టం అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా భూ భారతి చట్టంలోని అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ తల్లిదండ్రుల తర్వాత భూమి ప్రజలకు మరొక తల్లి తండ్రి అని భూమికి అన్ని హక్కులు కల్పించే విధంగా భూ భారతి చట్టాన్ని తీసుకురావడం జరిగిందని ఆయన తెలిపారు. గత ప్రభుత్వం తెచ్చిన ధరణి వల్ల రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని, రెవెన్యూ అధికారులు పనిచేయడం లేదని అసత్య ప్రచారం చేసి ప్రజల్లో అధికారులను చులకన చేసారని తెలిపారు. ధరణి వల్ల పట్టాలు కాక ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని అన్నారు. గతంలో తమ ప్రభుత్వం అధికారంలో పటిష్టమైన ఉన్నపుడు పట్వారి వ్యవస్థ ఉండేదని రకం రశీదును ఆధారంగా తీసుకొని అమ్ముకున్న, కొనుగోలు చేసిన ఇద్దరు వ్యక్తుల వివరాలు పహణి లో పక్కాగా నమోదు చేసేవారని అన్నారు. ప్రతి సంవత్సరం జమాబంది చేసి పట్టాకాలంలో కొనుగోలు దారు పేర్లు ఎక్కించడం వల్ల భూమి హక్కులు కల్పించారని తెలిపారు. గత ప్రభుత్వాహయంలో ధరణి పేరుతో ప్రజల భూములను దగా, దోపిడీ చేశారని, అనేక అక్రమాలు చేసి, వాళ్ళ కడుపులు నింపుకున్నారు తప్ప పేదలకు న్యాయం చేయలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ధరణిని బంగాళాఖాతంలో వేసి రైతులకు న్యాయం చేస్తామని ఇచ్చిన మాట ప్రకారం, రైతులకు ఒక ఆదర్శవంతమైన చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు. భూ మాత చట్టాన్ని 9 మంది సీనియర్ అధికారులతో కమిటీ వేసి భారతదేశంలోని అన్ని రాష్ట్రాల్లో అధ్యయనం చేసి కష్టపడి ప్రజలకు అనుకూల మైనటువంటి చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 4 మండలాల్లో పైలెట్ ప్రాజెక్టుగా ఎన్నుకొని ప్రజల నుండి సలహాలు, సూచనలు తీసుకుంటున్నామని, వాటిని క్రోడీకరించి ఇంకేమైనా చట్టంలో జత చేయాల్సిన విషయాలు ఉంటే జాతచేస్తామని తెలిపారు. తదుపరి మన జిల్లాలో ఒక మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని భూ భారతిలో చేర్చి రైతుకు వెసులుబాటు కల్పించే విధంగా పట్టాలివ్వాలి, హక్కులు కల్పించే విధంగా ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ధరణి వల్ల రైతులు కార్యాలయాలు చుట్టూ తిరిగి విసిగి వేసారి, అధికారుల మీద పెట్రోల్ పోసిన సంఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు. ధరణి వల్ల ప్రజలు నానా అవస్థలు పడ్డారని తెలిపారు. కొత్తపల్లి గ్రామంలో సుమారు 70సంవత్సరాలు నుండి సాగు చేసుకుంటున్న భూమికి పట్టాలు, పాస్ బుక్ రాకపోవడం వల్ల రైతు బంధు, రైతు బీమా, బ్యాంక్ రుణాలు రాక అమ్ముకుందామంటే రిజిస్ట్రేషన్ లేక పేద రైతులు అనేకమంది ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.దున్నుకునే రైతులకు పట్టాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, నూతన చట్టం ప్రకారం అన్ని హక్కులు కల్పిస్తామని తెలిపారు. 30 రోజుల భూ సమస్యలు తహసిల్దార్ పరిష్కరించే విధంగా చట్టంలో పొందుపరిచినట్లు తెలిపారు. 30 రోజుల్లో తహసిల్దారు రిజిస్ట్రేషన్ చేయకపోతే ఆటోమేటిక్ గా భూ భారతిలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందని ఆయన తెలిపారు.

తహసిల్దారు మీద ఆర్డీవోకి ఆర్డిఓ మీద కలెక్టర్ కి కలెక్టర్ మీద ల్యాండ్ రెవెన్యూ ట్రిబ్యునల్ కు ఫిర్యాదు చేసే అవకాశాన్ని కూడా కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డిఓ రవి, తాసిల్దార్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకర రామచంద్రయ్య, పిఎసిఎస్ చైర్మన్ మేకల సంపత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అప్పం కిషన్, దాట్ల శ్రీను, పిప్పాల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

● జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



భూపాలపల్లి ఏప్రిల్ 21 (మనం ప్రతినిధి): ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల సమస్యలను నేరుగా ప్రభుత్వ అధికారులకు తెలియజేసి, వాటిని సత్వరమే పరిష్కరించేందుకు రూపొందించిన ప్రజాసంబంధ కార్యక్రమమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల జిల్లా అధికారులతో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి, జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని స్వయంగా దరఖాస్తులు స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారం కోసం సమర్పించిన దరఖాస్తులను పెండింగ్లో ఉంచకుండా, సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేసినట్లు తెలిపారు. ప్రజావాణిలో 52 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.ప్రజావాణి ప్రధాన ఉద్దేశం ప్రజల ఫిర్యాదులను స్వీకరించి, వాటిని సంబంధిత శాఖలకు ఎండార్స్ చేసి, త్వరితగతిన పరిష్కారం చేయడం అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అన్ని శాఖల జిల్లా అధికారు లు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ విద్య

● జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



వరంగల్, ఏప్రిల్ 21 (మనం ప్రతినిధి): సోమవారం రాయపర్తి మండలంలోని కొండూరు జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాలలో మ్యాథమెటిక్స్ ల్యాబ్ ను, ఎంపీపీఎస్ కొండూరు పాఠశాలలో ఏ , ఐ ల్యాబ్ ను కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఏటా ప్రభుత్వ విద్యా రంగం సమగ్ర అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు పాఠ్యాంశాలను బట్టీపట్టి నూరు శాతం మార్కులు సాధిస్తే తెలివైన వారు కాదన్నారు. అన్ని రంగాలపై అవగాహన కలిగి ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రస్తుత పరిస్థితులలో విద్యార్థులకు వ్యవసాయ రంగంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలో వరంగల్ జిల్లా అగ్రస్థానంలో నిలిచిందని కలెక్టర్ పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలలో అనుభవం, అంకితభావం, సుశిక్షితులైన ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నట్లు చెప్పారు. అంతేగాక సర్కార్ బడుల్లో చదువుకుంటున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం ఉచితంగా అందజేస్తున్నట్లు వివరించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో డీఈఓ జ్ఞానేశ్వర్, ఎం ఈ ఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కొనతం పద్మలత, తాసిల్దార్ ముల్కనూరి శ్రీనివాస్, ఎంపీడీవో గుగులోతు కిషన్ నాయక్, ఎంపీఓ కూచన ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

# బెల్లాల్ చెరువును పరిశీలించిన సబ్ కలెక్టర్



బోధన్, ఏప్రిల్ 21 (మనం న్యూస్): బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో మున్సిపల్ కమిషనర్ వెంకట్ నారాయణ, మున్సిపల్ డీఈతో కలిసి సోమవారం బెల్లాల్ చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా చెరువులో నీటి నిల్వ పరిస్థితిని, పంపింగ్ వ్యవస్థను సరఫరా మార్గాలను పరిశీలించారు. వేసవి కాలంలో నీటి అవసరాలు పెరిగే నేపథ్యంలో ప్రజలకు తాగునీటి కొరత లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. నీటి సరఫరా వ్యవస్థలో ఎక్కడైనా లీకేజీలు ఉన్నా వెంటనే గుర్తించి మరమ్మతులు చేయాలని, లీకేజీల వలన నీటి నష్టం జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన చోట వెంటనే పునరుద్ధరణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమర్థవంతంగా నీటి పంపిణీ కొనసాగించేందుకు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

● జిల్లా కలెక్టర్ సత్య శారద



వరంగల్, ఏప్రిల్ 21 (మనం ప్రతినిధి): సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద రాయపర్తి మండలం కొత్తూరు గ్రామంలో పర్యటించి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరితంగా పూర్తి చేయుటకు అధికారులకు పలు సూచనలు చేశారు. బేస్మెంట్, రూఫ్ లెవెల్ లెవల్ లలో ఉన్న నిర్మాణం పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటివరకు నిర్మాణం పూర్తయిన పనులకు బిల్లులు చెల్లింపు చేయడం జరిగిందని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్న నేపథ్యంలో పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.అనంతరం రాయపర్తి మండల కేంద్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు.కలెక్టర్ వెంట జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ గణపతి, టీజీ ఈడబ్ల్యూఐడిసి డీఈ తహసిల్దార్,ఎంపీడీవో తదితరులు ఉన్నారు.

# బాలికల వసతి గృహం పనులను వెంటనే ప్రారంభించాలి



● అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్ వినతిపత్రం అందించిన గ్రామ అభివృద్ధి కమిటీ

జనగామ, ఏప్రిల్ 21 (మనం ప్రతినిధి): లింగాలఘణపురం మండల కేంద్రంలో తెలంగాణ మోడల్ స్కూల్ కళాశాలల్లో బాలికల వసతి గృహం నిర్మాణా పనులల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు సగంలోనే ఉన్నాయని వెంటనే కాంట్రాక్టర్ పై చర్యతీసుకొని పనులు పూర్తి చేయాలని జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్ కు లింగాలఘణపురం గ్రామ అభివృద్ధి కమిటి సభ్యులు వినతి పత్రం అందజేశారు, అనంతరం వీడిసి సభ్యులు మాట్లాడుతూ 2014 సంవత్సరంలో హాస్టల్ మంజూరు అయ్యింది,కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో హాస్టల్ నిర్మాణం పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయని వారు అన్నారు,ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి హాస్టల్ నిర్మాణం పనులు పూర్తి చేపియగలరని వారు కోరారు,ఈ వినతిపత్రం అందించినవారు విడిసి కమిటీ అధ్యక్షులు బోయిని రమేష్, ప్రధాన కార్యదర్శి, కే ల్లపు లక్ష్మీనారాయణ, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, చెన్నూరి మల్లేశం, రాగల్లఉపేందర్, వంగ మురళి, బి. శ్రీనివాస్, ఏదునూరివీరన్న, శ్రీహరి రమేష్,ఆర్. శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

● జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.



ములుగు, ఏప్రిల్ 21(మనం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ సమస్యలను పరిష్కరించడానికి అమలు చేయనున్న భూ భారతి చట్టం ద్వారా ఎక్కువ మొత్తంలో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని, భూ భారతి చట్టంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. సోమవారం మల్లంపల్లి మండల కేంద్రంలో భూ భారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సు లో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పాల్గొని రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణిలోని పొరపాట్లని సవరించేందుకు కలెక్టర్ కి మినహా ఏ అధికారికీ అవకాశం లేదని చెప్పారు. దీనివల్ల తాహసిల్దార్ స్థాయిలో పరిష్కారమయ్యే చిన్న సమస్యలు కూడా వేల సంఖ్యలో పేరుకుపోయేవని అన్నారు. చిన్న చిన్న సమస్యలు కూడా తహసిల్దార్లు, ఆర్డీవో పరిష్కరించలేని పరిస్థితి ఉండేదని పేర్కొన్నారు. భూభారతి చట్టం ద్వారా ప్రభుత్వం భూ సమస్యలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చిందని తెలిపారు. ఈ చట్టం ద్వారా పొరపాట్ల సవరణకు అవకాశం ఉందని, మ్యూటేషన్ దరఖాస్తులు త్వరితగతిన పరిష్కారం అవుతాయని తెలిపారు. రెండింతల అప్పీలు వ్యవస్థతో రైతులు, ప్రజలు భూ సమస్యలపై కోర్టు వరకు వెళ్లవలసిన అవసరం దాదాపు ఉండదని తెలిపారు. 2014 సంవత్సరంలో సాదా బైన మా కోసం కానీ 2020 సంవత్సరంలో అప్పటి ధరణి పోర్టల్ లో పేరు నమోదు చేసుకొని పట్టాలు పొందడానికి ప్రయత్నించినప్పటికీ సమస్యలు పరిష్కారం కానివి నేటి ప్రజా ప్రభుత్వం తెచ్చిన భూ భారతి చట్టం ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. గతంలో ఉన్న చట్టానికి అనుగుణంగా మరో 14 నూతన అంశాలను ప్రభుత్వం పొందుపరిచిందని, 2010 సంవత్సరంలో ప్రతి వ్యక్తి తన గుర్తింపు కోసం ఆధార్ కార్డు ఎలా పొందారో అదే తరహాలో భూ భారతి చట్టం ద్వారా భూమి హక్కు పట్టాలను పొందగలుగుతారని తెలిపారు. ఈ కార్యక్రమములో ఆర్డీఓ వెంకటేష్, తహసిల్దార్ విజయ భాస్కర్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

● అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)లెనిన్ వత్సల్ టొప్పో



మహబూబాబాద్, ఏప్రిల్ 21 (మనం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో సోమవారం ప్రజల నుండి వినతులు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లాలోని షెడ్యూల్ అభివృద్ధి శాఖ లో అవుట్ సోర్సింగ్ ద్వారా పనిచేస్తున్న ఉద్యోగుల కొన్ని నెలల జీతాలు పెండింగ్ లో ఉన్నాయని, అదే విధంగా ఈ.ఎస్.ఐ, ఈ.పి.ఎఫ్ ల జమలు కూడా పెండింగ్ లో ఉన్నాయని మా సమస్యను పరిష్కరించాలని కోరారు.డోర్నకల్ మండలం ఎర్రమట్టి తండాకు చెందిన గుగులోతు పద్మ తను రేకుల ఇంటిలో నివసిస్తున్నానని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు.నెల్లికుదురు మండలం ఆలేరు గ్రామానికి చెందిన రైతులు తమ భూములను సర్వే చేపించి పట్టాలు ఇప్పించగలరని కోరారు.గార్ల మండలం మద్దివంచ గ్రామానికి చెందిన గ్రామస్తులు తమ గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ పాటశాలకు కావాల్సిన స్థలాన్ని కమిటీ ఆద్వర్యంలో కొనుగోలు చేసిన స్థలాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఆక్రమించుకుంటున్నారని, రెవెన్యు రికార్డుల పరంగా సర్వే చేసి పాటశాలకు హద్దులు ఏర్పాటు చేయగలరని కోరారు.ఈ సందర్భంగా రెవెన్యూ(33), మునిసిపల్ అడ్మినిస్ట్రేటివ్(7), డి.ఆర్.డి.ఓ(5), ఎంప్లాయ్మెంట్(3) ఈ విధంగా వివిధ శాఖలకు సంబంధించి సోమవారం ప్రజావాణి లో వచ్చిన(63)దరఖాస్తులను పరిష్కారం కొరకు అధికారులను ఆదేశించారు.ఈ ప్రజావాణి లో జెడ్.పి సీ.ఈ.ఓ పురుషోత్తం, తొర్రూరు ఆర్డీఓ గణేష్, డి.ఆర్.డి.ఓ మధుసూదనరాజు, సి.పి.ఓ సుబ్బారావు, డి.పి.ఓ హరిప్రసాద్, డి.సి.ఓ వెంకటేశ్వర్లు, డి.హెచ్.ఎస్.ఓ మరియన్న, బి.సి, ఎస్.సి డెవలప్మెంట్ అధికారులు నరసింహ స్వామి, శ్రీనివాసరావు, డి.ఎం.సివిల్ సప్లై అధికారి కృష్ణవేణి, గ్రౌండ్ వాటర్ అధికారి సురేష్, జి.ఎం.ఇండస్ట్రీస్ శ్రీమన్నారాయణ, మత్స్య శాఖ అధికారి వీరన్న, ఎల్.డి.ఎం సత్యనారాయణ మూర్తి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ మదన్ మోహన్, వివిధ మండలాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి

● అదనపు కలెక్టర్ రెవిన్యూ సి.హెచ్.మహేందర్ జి



ములుగు, ఏప్రిల్21, మనం ప్రతినిధి: ప్రజావాణిలో ఫిర్యాదు చేసే దరఖాస్తులను నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రెవిన్యూ సి.హెచ్. మహేందర్ జి. ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రెవిన్యూ సి.హెచ్.మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావుతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించారు. ప్రజావాణికి మొత్తం 39 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా రెవిన్యూ భూమి సమస్యల పై 16 దరఖాస్తులు, ఉపాధి కల్పన కోసం 4, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కోరుతూ 3 ఇతర శాఖల కార్యాలయాలకు సంబంధించినవి 16 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.






# చెన్నైకు 'ప్లేఆఫ్స్' ఛాన్స్.. గతేడాది ఆర్సీబీలా ఆడితేనే!



ఐపీఎల్ లో గెలుస్తుందనే మ్యాచుల్లో ఓడిపోవడం.. నాకౌట్ కు చేరుకోవడం కష్టమనుకొనే టీమ్ లు ప్లేఆఫ్స్ కు వెళ్లడం ఇప్పటికే మనం చూశాం. ఇప్పుడందరి దృష్టి ధోనీసేన పైనే ఉంది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో చివరన ఉన్న సీఎస్కే టాప్ -4లోకి దూసుకొచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఇది సాధ్యం కావాలంటే ఒకే ఒక్క మార్గముంది. అదేంటి? గతంలో ఇలా ఏ జట్టైనా సాధించిందా? అనే విషయాలపై ఓ లుక్కేద్దాం.

**సీఎస్కే మిగిలిన ఆరింట్లోనూ గెలిస్తేనే..**

చెన్నై సూపర్ కింగ్స్ ఇప్పటివరకు 8 మ్యాచులు ఆడింది. కేవలం రెండే విజయాలే ఉన్నాయి. అంటే నాలుగు పాయింట్లతో చివరి స్థానంలో కొనసాగుతోంది. ఇంకా ఆరు మ్యాచులు ఉన్నాయి. వాటన్నింటినీ గెలిస్తే సీఎస్కే ఖాతాలో 16 పాయింట్లు చేరతాయి. ముంబయితో మ్యాచ్ అనంతరం ధోనీ కూడా 'ప్లేఆఫ్స్'కు క్వాలిఫై కావడానికి ప్రయత్నిస్తామని చెప్పాడు కదా. అంటే ఏ చిన్న ఛాన్సు్ను మిస్ చేసుకోమని దాని ఉద్దేశం. విజయాలు సాధించడంతోపాటు నెట్రన్రేట్ను కాస్త మెరుగుపర్చుకుంటే సీఎస్కేకు తిరుగుండదు. అయితే, టాప్ -4 ప్లేస్ల కోసం ఇప్పటికే తీవ్ర పోటీ నెలకొంది. ఏ ఒక్క మ్యాచ్లో ఓడినా తలుపులు మూసుకుపోవడం ఖాయం. చెన్నై సూపర్ కింగ్స్ తన సొంత మైదానం చెపాక్లో మూడు మ్యాచులను ఆడనుంది. మిగిలిన మూడు బయట వేదికల్లో తలపడాల్సి ఉంటుంది.

**ఎవరెవరితో మ్యాచులు?**

సన్రైజర్స్ హైదరాబాద్ (ఏప్రిల్ 25) - చెన్నై
పంజాబ్ కింగ్స్ (ఏప్రిల్ 30) - చెన్నై
రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (మే 3) - బెంగళూరు
కోల్కతా నైట్రైడర్స్ (మే 7) - కోల్కతా
రాజస్థాన్ రాయల్స్ (మే 12) - చెన్నై
గుజరాత్ టైటాన్స్ (మే 18) - అహ్మదాబాద్

**బెంగళూరు కూడా ఇలానే..**

వరుసగా ఆరు మ్యాచులు ఓడిపోవడం.. తొలి ఎనిమిదిలో ఒకేఒక్క విజయం.. ఇలాంటి టీమ్ ప్లేఆఫ్స్కు వస్తుందని ఎవరైనా ఊహించగలరా? కానీ, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అసాధ్యవనకున్న ఘనతను సుసాధ్యం చేసింది. ఐపీఎల్ 2024 సీజన్లో ఇలాంటి అరుదైన ఫీట్ నమోదైంది. అద్భుతంగా పుంజుకొన్న ఆర్సీబీ తాను ఆడిన తొమ్మిదో మ్యాచ్ నుంచి 14వ మ్యాచ్ వరకు వరుసగా ఆరింట్లో గెలిచింది. టాప్-4లో నిలిచి ప్లేఆఫ్స్కు చేరుకుంది. ఎలిమినేటర్లో రాజస్థాన్ చేతిలో ఓటమి పాలైందనుకోండి అది వేరే విషయం. అతి తక్కువగా ఉన్న ఛాన్స్ను ఏమాత్రం వదులుకోకుండా వరుసగా విజయాలను నమోదుచేసిన ఆర్సీబీని ఇప్పుడు సీఎస్కే స్ఫూర్తిగా తీసుకోవాలి. అప్పటి బెంగళూరుతో పోలిస్తే ఇప్పటి చెన్నై పరిస్థితే కాస్త మెరుగు.. కానీ, మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ మాత్రం సీఎస్కేకు అవకాశాలు చాలా క్లిష్టంగా ఉన్నాయని వ్యాఖ్యానించాడు.

**అవకాశాలు దాదాపు ముగిసినట్లే: కృష్ణమాచారి శ్రీకాంత్**

చెన్నైపై విజయం సాధించిన ముంబయి ఇండియన్స్ను శ్రీకాంత్ అభినందించాడు. ''ఈ సీజన్లో ప్లేఆఫ్స్ కోసం సీఎస్కే పోరాటం దాదాపు ముగిసిందనుకుంటున్నా. రోహిత్, సూర్య మైదానంలోని నలుమూలలా బంతులను పంపించారు. ముంబయి అన్ని విభాగాల్లో బాగా ఆడింది. ఇప్పుడు సీఎస్కేకు ఒకటే సూచన ఇవ్వగలను. మిగతా మ్యాచుల్లో నిర్భయంగా ఆడేయండి'' అని పేర్కొన్నాడు.

## అర్జున్ కు రజతం

ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్ షూటింగ్ లో పారిస్ ఒలింపియన్ అర్జున్ బబుతా సత్తాచాటాడు. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ లో రజత పతకంతో మెరిశాడు. ఫైనల్లో 252.3 పాయింట్లు స్కోరు చేసిన అర్జున్.. కేవలం 0.1 పాయింట్ తేడాతో బంగారు పతకానికి దూరమయ్యాడు. ఒలింపిక్ ఛాంపియన్ షెంగ్ లిహావో (252.4- చైనా) స్వర్ణం గెలుచుకున్నాడు. మహిళల 10 మీ ఎయిర్ రైఫిల్ లో ఆర్య బోర్సే అయిదో స్థానంలో నిలిచింది.

## ఆసియా బాక్సింగ్ లో భారత్ శుభారంభం

ఆసియా అండర్-15, అండర్-17 బాక్సింగ్ ఛాంపియన్ షిప్ లో భారత్ శుభారంభం చేసింది. తొలి రౌండ్లో హార్దిక్ దహియా, రుద్రాక్ష్ సింగ్ ఏకపక్ష విజయాలతో సత్తాచాటారు. అండర్-15 బాలుర 43 కేజీల విభాగంలో హార్దిక్ 5-0తో కుబనిచెక్ బొలుషోవ్ (కిర్గిస్తాన్)ను చిత్తుచేశాడు. 46 కేజీల విభాగంలో రుద్రాక్ష్ 5-0తో ఇబ్రఖిమ్ మరల్ (మంగోలియా)ను మట్టికరిపించాడు. ఈ టోర్నీలో భారత్ తరఫున 56 మంది బాక్సర్లు బరిలో ఉన్నారు.



## కోహ్లీ.. శ్రేయస్‌తో అలా!

గత మ్యాచ్ లో బెంగళూరును దాని సొంతగడ్డపై ఓడించాక పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ కొంచెం గట్టిగానే సంబరాలు చేసుకున్నాడు. అది చూసిన కోహ్లీ ఊరుకుంటాడా? ఆదివారం పంజాబ్ ను దాని సొంతగడ్డపై బెంగళూరు చిత్తుగా ఓడించడం, పైగా తాను చివరి వరకు ఉండి జట్టును గెలిపించడంతో విరాట్ రెచ్చిపోయాడు. విజయానంతరం శ్రేయస్ వైపు చూస్తూ గట్టిగా అరుస్తూ సంబరాలు చేసుకున్నాడు. బదులుగా శ్రేయస్ తలాడిస్తూ ముందుకు రాగా.. కోహ్లీ నవ్వుతూ వెళ్లి అతడితో కరచాలనం చేశాడు. శ్రేయస్ మాత్రం కోహ్లీ సంబరాలతో కొంచెం నొచ్చుకున్నట్లే కనిపించాడు.

## ఐపీఎల్‌లో రోబో డాగ్ సందడి.. దీని పేరెంటో తెలుసా?

ప్రస్తుతం ఐపీఎల్ 18 సీజన్ లో రోబో డాగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. మ్యాచ్ టాస్ సందర్భంగా కెప్టెన్లతోపాటు గ్రౌండ్లో దీని సందడి మామూలుగా లేదు. ఆటగాళ్ల వద్దకు వెళ్లడం, వారికి షేక్ హ్యాండ్ ఇస్తుండడంతో



అంతా దీని చేష్టలను ఉత్సాహంగా గమనిస్తున్నారు. ఈ రోబోతో పలు జట్ల ఆటగాళ్లు సరదాగా ఆడుకుంటున్న వీడియోలు ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. తాజాగా ముంబయి, చెన్నై మ్యాచ్ ప్రారంభానికి ముందు దీనికి అధికారికంగా 'చంపక్' గా నామకరణం చేశారు. ఇక ఈ రోబో విషయానికి వస్తే ఇది వేగంగా నడవగలదు, పరుగెత్తగలదు, వ్యాయామాలు చేయగలదు, జంప్ చేసేలా, కూర్చునేలా రూపకల్పన చేశారు. కొన్ని భావాలను సైతం వ్యక్తపరుస్తుంది. దీని తల ముందు భాగంలో కెమెరా ఉంది. ఇది ప్రేక్షకులకు అద్భుతమైన వీక్షణ అనుభవాన్ని అందివ్వగలదు. దీంతో ఈ సీజన్ బ్రాడ్ కాస్టింగ్ లో ఈ రోబో అంతర్భాగమైపోయింది.

## ఆ నిర్మాత నాతో దారుణంగా ప్రవర్తించాడు

బాలీవుడ్ బోల్ బ్యూటీ విద్యాబాలన్ గతంలో క్యాస్టింగ్ కౌచ్ పై సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఓ దర్శకుడు తనతో అసభ్యకరంగా ప్రవర్తించాలనుకున్నాడని ఈ స్టార్ హీరోయిన్ ఆ మధ్య సంచలన వ్యాఖ్యలు చేసింది. ఇప్పుడు తాజాగా 'ఒక నిర్మాత నాతో చాలా దారుణంగా ప్రవర్తించాడు.. అసభ్యంగా పిలిచాడు' అంటూ షాకింగ్ కామెంట్స్ చేసింది. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో విద్యాబాలన్ మాట్లాడుతూ.. 'ఒక నిర్మాత నాతో చాలా దారుణంగా ప్రవర్తించాడు. నేరుగా నా దగ్గరకు వచ్చి నన్ను అసభ్యంగా పిలిచాడు. అతను నన్ను అలా అవమానించిన తర్వాత నేను అద్దంలో ఆరు నెలలు నా ముఖం కూడా చూసుకోలేదు' అని విద్యాబాలన్ తెలిపింది. విద్యాబాలన్ ఇంకా మాట్లాడుతూ 'ఆ సమయంలో ఆ నిర్మాత లాంటి కొందరు వ్యక్తులు మాట్లాడే మాటలు నాపై నాకున్న నమ్మకాన్ని పూర్తిగా నాశనం చేశాయి. అలాగే, ఒక సినిమా కోసం నేను బరువు పెరుగుతున్న సమయంలో బాడీ షేమింగ్ చేసేవారు. ఒక సారి మలయాళంలో కూడా అవకాశం వచ్చింది. కానీ, ఆ సినిమా ప్రారంభం కాకముందే ఆగిపోయింది. దీంతో నన్ను దురదృష్టవంతురాలు అంటూ ప్రచారం చేశారు. మూవీ టీం ఆపేసిన అక్కడ నను బ్లెమ్ చేశారు. చెప్పుకుంటూ పోతే నా కెరీర్ లో ఇలాంటి చాలా ఉన్నాయి' అని విద్యాబాలన్ చెప్పుకొచ్చింది.



## సమంత రెండో పెళ్లి..?

సమంత - నాగచైతన్య విడిపోయాక సామ్ ఒంటరిగానే ఉంటుంది. అయితే, సమంత రెండో పెళ్లి పై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చ గురించి తెలిసిందే. తాజాగా ఈ వార్త పై మళ్లీ రూమర్ వైరల్ అవుతుంది. సమంత రెండో పెళ్లికి సిద్ధమవుతుందని, తన బాయ్ ఫ్రెండ్ రాజ్ నిడుమోరుతో ఆమె పెళ్లి పీటలు ఎక్కబోతుందని టాక్ నడుస్తోంది. వీరిద్దరూ కలిసి నిన్న తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దీంతో ఈ రూమర్ కి బలం చేకూర్చినట్లు అయింది.

పైగా, ఇప్పటికే వారిద్దరూ డేటింగ్ లో ఉన్నారని, మే నెలలో పెళ్లిపీటలు ఎక్కబోతున్నారని కొత్తగా గాసిప్ వినిపిస్తోంది. అన్నట్టు సామ్ - రాజ్ పెళ్లికి ఇరు కుటుంబాలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. దీనిపై ఇటు సమంతగానీ, అటు రాజ్ గానీ స్పందించలేదు. ఇక సమంత నిర్మాతగా వ్యవహరించిన 'శుభం' సినిమాలో అంతా కొత్తవారే నటించారు. నటిగా తన కెరీర్ మొదలు పెట్టిన సమయంలో యాక్టింగ్ గురించి తనకు పెద్దగా తెలియదన్నారు సమంత. 'శుభం' సినిమాలో నటీనటులు బాగా చేశారని సామ్ చెప్పింది.





## పవన్ వాటికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడా..?

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రస్తుతం వరుస చిత్రాలను రిలీజ్ కు రెడీ చేస్తున్న సంగతి తెలిసిందే. ఆయన నుంచి రాబోతున్న సినిమాల్లో 'హరిహర వీరమల్లు', 'ఓజి' ఇప్పటికే మెజారిటీ షూటింగ్ పూర్తి చేసుకున్నాయి. ఈ రెండింట్లో 'హరిహర వీరమల్లు' కొద్ది రోజుల షూటింగ్ మాత్రమే మిగిలి ఉండటంతో ఈ సినిమా రిలీజ్ తరుచూ వాయిదా పడుతూ వస్తోంది. ఇక ఇప్పుడు ఈ సినిమా రిలీజ్ డేట్ విషయంలో మేకర్స్ ఓ క్లారిటీకి రాబోతున్నట్లు తెలుస్తోంది. పవన్ కళ్యాణ్ హరిహర వీరమల్లు తో పాటు ఓజి చిత్రాల రిలీజ్ కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో మేకర్స్ ఇప్పుడు వీలైనంత త్వరగా ఈ సినిమాలను ముగించి రిలీజ్ కు రెడీ చేయాలని చూస్తున్నారట. ఇక వీరమల్లు చిత్రంలో పవన్ చేయాల్సిన షూటింగ్ కొంతనే ఉండటంతో ఈ సినిమాను మే 2వ వారంలో లేదా 4వ వారంలో రిలీజ్ చేయాలని చిత్ర యూనిట్ భావిస్తోందట.

ఈ సినిమాలో పవన్ పాత్ర ప్రేక్షకులను స్టన్ చేయడం ఖాయమని చిత్ర యూనిట్ చెబుతోంది. ఇక ఈ సినిమాలో నిధి అగర్వాల్ హీరోయిన్ గా నటిస్తుండగా.. బాబీ డియోల్ విలన్ పాత్రలో నటిస్తున్నాడు. ఈ సినిమాకు ఎం.ఎం.కీరవాణి సంగీతం అందిస్తుండగా జ్యోతికృష్ణ డైరెక్ట్ చేస్తున్నారు. ఏ.ఎం.రత్నం ఈ సినిమాను అత్యంత భారీ బడ్జెట్ తో ప్రొడ్యూస్ చేస్తున్నారు.

## రామ్ డేటింగ్..? స్పందించిన భాగ్యశ్రీ బోర్సే!

తన అందం, అభినయంతో తొలి సినిమాతోనే అందరికీ అభిమాన నటిగా మారారు భాగ్యశ్రీ బోర్సే. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. కొన్ని రోజుల నుంచి సోషల్ మీడియాలో ఆమె పేరు ట్రెండింగ్ అవుతోంది. దీనికి కారణం యంగ్ హీరో రామ్ పోతినేనితో ఆమె డేటింగ్ లో ఉన్నట్లు వార్తలు ప్రచారం కావడమే.

వీరిద్దరూ కలిసి ఓ సినిమాలో నటిస్తోన్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కినప్పటి నుంచి వీరిద్దరిపై రూమర్స్ ప్రారంభమయ్యాయి. తాజాగా వీరిద్దరూ షేర్ చేసిన ఫొటోల్లో బ్యాక్ గ్రౌండ్ ఒకేలా ఉండడంతో ఈ ప్రచారం జోరందుకుంది. ఆ ఫొటోలు చూసిన నెటిజన్ లు 'ఒకే గదిలో ఫొటో దిగారా' అంటూ కామెంట్స్ పెడుతున్నారు. మరొక నెటిజన్ ఇంకాస్త వివరంగా 'మీ చేతికి ఉంగరం ఉంది. అది ఎవరు తొడిగారు?' అని అడిగారు. దీనికి భాగ్యశ్రీ స్పందిస్తూ.. 'అది నేనే కొనుక్కున్నాను' అని రిప్లై పెట్టారు. ప్రస్తుతం వారి ఫొటోలతో పాటు ఆమె రిప్లై కూడా ఆసక్తిగా మారింది.

ప్రస్తుతం వీరిద్దరూ మహేశ్ బాబు.పి దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నారు. ఇందులో సాగర్ గా రామ్ కనిపించనుండగా.. మహాలక్ష్మి పాత్రలో భాగ్యశ్రీ అలరించనున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ ఒక షెడ్యూల్ పూర్తి చేసుకుంది. దీనితో పాటు దుల్కర్ సల్మాన్ ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న 'కాంత' లోనూ భాగ్యశ్రీ బోర్సే నటిస్తున్నారు. ఇందులో రానా కీలకపాత్ర పోషిస్తున్నారు.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.